2-9Pg1fBGO.qxd:02-9Pg1fBGO.qxd 01/01/01 9:35 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

విజయవాడ f: fb.com/vaartha

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,Srikakulam

2-9-2024 సోమవారం సంపుటి: 30 సంచిక: 215 పేజీలు: 12 వెల: 6.50

సిఎం చంద్రబాబుకు ప్రధాని మోడీ ఫోన్ 2లో

రాజకీయ పార్టీల్లోనూ క్యాస్టింగ్ కౌచ్! 9లో

# వరద ముంపు

## 14 జిల్లాలను పూర్తిగా ముంచిన వాయుగుండం

- వివిధ ప్రాంతాల్లో 10 మంది మృతి
- విజయవాడలో వరదముంపు ప్రాంతాలను బోటులో వెళ్లి పరిశీలించిన సిఎం చంద్రబాబు
- తీవ్ర ప్రభావిత జిల్లాలకు రూ. 3 కోట్లు, ఇతర జిల్లాలకు రూ. 2 కోట్లు తక్షణ సాయం
- ఉప్పలపాడులో వరదనీట కొట్టుకుపోయిన టీచర్, ఇద్దరు విద్యార్థులు



ఆదివారం విజయవాడలోని వరదనీట మునిగిన ప్రాంతాలను పడవలో పర్యటిస్తూ పరిశీలించిన సిఎం చంద్రబాబు, మంత్రి నారాయణ తదితరులు

**విజయవాడ,సెప్టెంబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మరో మూడు రోజులు భారీ వర్షాలకు అవకావమున్నట్లు వాతావరణశాఖ, సూచిస్తుందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు.గతంలో ఎన్నడులేని రీతిలో విజయవాడ,గుంటూరు నగరాలు,ఇతర జిల్లాల్లో వర్షం ప్రజలకు భారీ నష్టకలిగించిందన్నారు. భారీ వర్షాలకు ఇప్పటి వరకు అందిన సమాచారాన్ని అనుసరించి 10మంది వరకు మరణించడం దురదృష్టకరమన్నారు.సహాయక చర్యలకు జిల్లాకు రూ.3కోట్లు, తీవ్రత తక్కువున్న జిల్లాకు రూ.2కోట్లు చొప్పున తక్షణసాయం విడుదల చేయాలని ఆదేశించారు.హుద్‌హుద్ తుఫాను సమయంలో మనం అనుసరించిన విధానాలను మనం అధ్యయనం చేయాలి,అప్పటి మాదిరిగానే సహాయక చర్యలు అందజేయాల్సి ఉంది,తరుణ వ్యాధులు,ఇతర ఆరోగ్య సమస్యలు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య సిబ్బంది ఎక్కడిక్కడ వైద్యసేవలు అందించాలన్నారు. ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. తీరగ్రామాలకు వర్షాలకు సంబంధించి సూచనలువచ్చినవెంటనే అధికారులు జాగ్రత్త పడాలన్నారు.నష్టం >>2

# రైల్వే ట్రాక్‌లు ధ్వంసం

## పలు స్టేషన్లలో రైళ్లు నిలిపివేత

**హైదరాబాద్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుఫాన్ కారణంగా తెలుగు రాష్ట్రాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తెలంగాణ, ఎపిలోని పలుచోట్ల రైల్వే ట్రాక్‌లు ధ్వంసం కాగా ఇంకొన్నిచోట్ల రైలు పట్టాల పైనుంచి వరదనీరు ప్రవహించసాగాయి. కొన్నిచోట్ల రైల్వే స్టేషన్లు నీట మునిగిపోయాయి. అయితే భారీ వర్షం వల్ల తలెత్తే అవకాశాలున్న ముప్పును పోలీసులతో పాటు రైల్వే శాఖ ముందుగానే అంచనా వేయడంతో పలుచోట్ల రైలు ప్రమాదాలు తప్పాయి. తెలంగాణలోని వరంగల్-విజయవాడ మార్గంలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వద్ద భారీ వరద కారణంగా రైలు పట్టాల కింద కంకర, మట్టి కొట్టుకు పోవడంతో పట్టాలు గాలిలో వేలాడాయి. శనివారం అర్థరాత్రి సమయంలో ఈ ఘటన జరిగింది. అయితే ఈ విషయాన్ని మొదట రైల్వే సిబ్బంది గమనించి పోలీసుల సహకారంతో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న రైళ్లను సమీపంలోని స్టేషన్లలో నిలిపి వేయించారు. ఒకవేళ రైల్వే సిబ్బంది కేసముద్రం వద్ద రైల్వే ట్రాక్ ధ్వంసం అయిన విషయాన్ని గమనించకుండా వుండివుంటే ఈమార్గంలో కచ్చితంగా ప్రమాదం జరిగి వుండేదని పోలీసులు చెబుతున్నారు. గతంలో విజయవాడ మార్గంలో వానా >>2


పూర్తిగా వరదనీట మునిగిన విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లోని ఇళ్లు

# ఆరు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాల రాక

## సహాయక చర్యల కోసం ఆరు హెలికాప్టర్లు

**విజయవాడ.సెప్టెంబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వరద సహయక చర్యలు కోసం కేంద్రం ఆరు ఎన్డీఆర్‌ఎఫ్ టీమ్‌లను ఇతర రాష్ట్రాలనుంచి తక్షణమే పంపుతున్నట్లు సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు. సిఎం చంద్రబాబు ఏపీలో వరదల ఉధృతి నేపథ్యంలో స్వయంగా బాధితుల వద్దకు వెళ్లి పరిస్థితులు తెలుసుకున్నారు.దాంతో ఆయన విజయవాడలో సాధారణ పరిస్దితులు వచ్చే వరకు కలెక్టరేట్‌లోనే ఉంటానని వెల్లడించారు.ఈ పరిణామాల నడుమ సిఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ ఏపీలో వరద పరిస్దితిపై కేంద్రప్రభుత్వంతో నిత్యం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు.కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ఫోన్ చేసి పరిస్దితిని వివరించారు. ఆ వెంటనే కేంద్రహోం కార్యదర్శితో మాట్లాడినట్లు చంద్రబాబు వివరించారు. వరద ప్రాంతాల్లో సహయక చర్యల కోసం అత్యవసరంగా పవర్‌బోట్లు రాష్ట్రానికి పంపించే అంశంపై చర్చించామన్నారు.ఈ క్రమంలో కేంద్రం రాష్ట్రానికి అదనంగా మరో ఆరు ఎన్డీఆర్‌ఎఫ్ టీమ్‌లు ఇతర రాష్ట్రాల నుంచి తక్షణమే పంపుతున్నట్లు హోంశాఖ కార్యదర్శి వెల్లడించారన్నారు. ఒక్కో ఎన్డీఆర్‌ఎప్ టీమ్‌లో 25 మంది సిబ్బంది. ఒక్కో టీమ్‌కు నాలుగు పవర్‌బోట్లు ఉంటాయని వివరించారు. సోమవారం ఉదయానికి విజయవాడకు చేరుకుంటాయని తెలిపారు.మొత్తం 40పవర్‌బోట్లు రాష్ట్రానికి పంపుతున్నట్లు వెల్లడించారు. వాయుమార్గంలో మరో నాలుగు ఎన్డీఆర్‌ఎఫ్‌టీమ్‌లు సోమవారం రాష్ట్రానికి పంపుతు >>2


నందిగామవద్ద జాతీయ రహదారిపై వరదనీరు (విహంగవీక్షణం)

# 100 పునరావాస కేంద్రాలకు బాధితుల తరలింపు

- 4 జిల్లాల్లోని 62,644 హెక్టార్లలో నీట మునిగిన పంట
- వరద ముంపులో చిక్కిన 294 గ్రామాల ప్రజలు
- కళింగపట్నం సమీపాన తీరందాటిన వాయుగుండం


ఆదివారం వరద సహాయక చర్యలను సమీక్షిస్తున్న హోంమంత్రి అనిత

**విజయవాడ,సెప్టెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముంపు బారిన పడిన 294 గ్రామాలకు చెందిన 13,227 మందిని పునరావాస కేంద్రాలకు తరలించామని హోం, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో స్టేట్ ఎమర్జన్సీ ఆపరేషన్ నుంచి భారీ వర్షాలపై మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు,అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బంగాళాఖాతంలోని వాయుగుండం అర్థరాత్రి విశాఖపట్నం,గోప్‌పూర్ మధ్య కళింగపట్నంకు దగ్గరలో తీరం దాటినట్లు సమాచారమన్నారు. ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలో అధిక వర్షాల కారణంగా ఇంత వరకు 100 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి,అక్కడికి 13,227 మందిని తరలించామన్నారు.దీని ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని హోంమంత్రి వెల్లడించారు. తీరం వెంబడి గంటకు 45-55 కి.మీల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, రేపు చాలా చోట్ల మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో 61 మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసామన్నారు. ఇంత వరకు భారీ వర్షాల కారణంగా 9మంది మరణించారన్నారు. పోలీసు, ఎన్టీఆర్‌ఎఫ్ >>2

## నూజివీడు ట్రిపుల్ ఐటిలో

# ఫుడ్ కాంట్రాక్టర్లపై క్రిమినల్ చర్యలకు రంగం సిద్ధం

## ఫుడ్‌కోర్టు మూసివేయాలని ఆదేశించిన మంత్రి లోకేష్

**మంగళగిరి,సెప్టెంబరు 1,ప్రభాతవార్త :** కలుషితాహారం ఘటనపై విచారణ కమిటి సిఫార్సుల మేరకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రస్తుతం కేటరింగ్ సేవలు అందిస్తున్న మెస్సర్స్ ఫైన్ క్యాటరింగ్ సర్వీసెస్,మెస్సర్స్ అనూష హాస్పటల్ సేవలను తక్షణమే రద్దుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

వారిపై క్రిమినల్ చర్యలకు విద్య,ఐటి శాఖమంత్రి ఆదేశాలు జారీచేశారు.ఆ సంస్థలు రాష్ట్రవ్యాప్తంగా మరే ఇతర టెండర్లలో పాల్గొనకుండా బ్లాక్ లిస్టు చేయాలని నిర్ణయించింది.కొత్త కాంట్రాక్టర్లను నియమించేవరకు విద్యార్థులందరికీ ఆహారాన్ని అందించడానికి తాత్కాలికంగా మెస్సర్స్ కెఎంకె క్యాటరింగ్ సేవలను ఉపయోగించుకోవాలని నూజివీడు ట్రిపుల్ ఐటి అధికారులకు ప్రభుత్వం సూచించింది. క్యాటరింగ్ కోసం కొత్త టెండర్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వం పేర్కొంది.కమిటీ సిఫార్సు మేరకు నూజివీడు ట్రిపుల్ ఐటిలోని ఫుడ్ కోర్టును తక్షణమే మూసివేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

పెండింగ్‌లో ఉన్న ఫుడ్‌కోర్టు అద్దెను రెండు వారాల్లోగా ఏజెన్సీనుంచి వసూలు చేయాలని, చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని బయటి ఆహారాన్ని క్యాంపస్‌లోనికి అనుమతించవద్దని మంత్రి లోకేష్ ట్రిపుల్ ఐటి అధికారులనుఆదేశించారు.ఫుడ్ కోర్టుకు సంబంధించిన కొత్త టెండర్ల ప్రక్రియను వారంరోజుల్లో ప్రారంభించాలని మంత్రి లోకేష్ ట్రిపుల్ ఐటి అధికారులకు సూచించారు.అప్పటివరకు రాష్ట్రంలోని ప్రముఖ ఫుడ్ చెయిన్లనుంచి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి పేర్కొన్నారు.




# మునిగిన రైలు మార్గాలు




**గుంతకల్లు రైల్వే, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** .ప్రస్తుత వర్షాకాలంలో ఏర్పడిన విపత్కర పరిస్థితిలో ప్రతి రైల్వే ఉద్యోగి పూర్తిస్థాయి నిబద్ధతతో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. వాయుగుండం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో శనివారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాలు రైల్వే వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నా యని పేర్కొంటూ రైల్వేప్రయాణికులు సాధ్యమైనంత వరకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా మౌలిక సదుపాయాలను కల్పించాలని దిశ నిర్దేశం చేశారు. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని

## పలు సెక్షన్లలో పెద్ద సంఖ్యలో రైళ్లు రద్దు

## ప్రత్యామ్నాయ రూట్లలో కొన్ని మళ్లింపు

విజయవాడ-ఖాజీపేట్ సెక్షన్‌లో డోర్నకల్-మహబూబాబాద్ మధ్య చెరువుకట్ట తెగిపోవడంతో వరద నీరు రైలు పట్టాలపై ప్రవహిస్తుండడంతోపాటు, నీటి ప్రవాహానికి కంకర పూర్తిగా కొట్టుకుపోయింది. సిగ్నలింగ్, కమ్యునికేషన్ వ్యవస్థకు సైతం పూర్తిగా కొట్టుకుపోయింది. వర్షం, వరద ప్రభావిత స్టేషన్లలో నీటి ప్రభావం తగ్గితే తప్ప పునరుద్దరణచర్యలకు అవకాశం లేదని రైలు మార్గాం నిర్వహణ విభాగం అధికారులు చెబుతున్నారు. డోర్నకల్, మహబూబాబాద్, కేసముద్రం, నేకోండ, వరంగల్లు స్టేషన్లలో మధ్య ఎక్కడి రైళ్లు అక్కడే నిలిపివేశారు. దీంతో విజయవాడక్ష-ఖాజీపేట ప్రధాన రైలు మార్గానికి తీవ్ర అంతరాయం ఏర్పడిన కారణంగా ఈ మార్గం మీదుగా తిరిగే >>2

## నేడు విద్యా సంస్థలకు సెలవు

**విజయవాడ, సెప్టెంబరు 1, ప్రభాతవార్త ప్రతినిధి** ఎడతెరిపి లేని వర్షాలతో రాష్ట్ర వ్యాప్తంగా జన జీవనస్తంభించింది.భారీ వర్షాలు, వరద ఉధృతి కారణంగా సోమవారం (నేడు) విద్యా సంస్థలకు సెలవుఇవ్వాలని సిఎంచంద్ర బాబు ఆదేశించారు. ఆదేశాలు పాటించని ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. భారీ వర్షాలకు ఇప్పటి వరకు 9 మంది మృతి చెందారు.వారిలో పాఠశాల విద్యార్దులు ఇద్దరు, ఉపాధ్యాయుడు పలువురు గల్లంతయ్యారు.



ఆదివారం విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో మంత్రులు నారాయణ,రవీంద్ర, ఎంపి చిన్ని



విజయవాడలోని ప్రకాశం బ్యారేజి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వద్ద వరదనీటికి కంకర కొట్టుకుపోవడంతో గాలిలో వేలాడుతన్న రైలు పట్టాలు

# వరద ముంపు

>> జరగకముందే జరుగకుండా శ్రద్ధ తీసుకోవాలి ఇప్పటికైన కొండ చరియల ప్రాంత,లోతట్టు ప్రాంత నివాశితులను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలన్నారు.నిన్నంతా వర్షాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించిన చంద్రబాబు ఆదివారం ఉదయం నుంచే వర్షం వలన కలిగిన నష్టం,రవాణా వ్యవస్థ,విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ అంశాలపై అధికారులతో వర్చువల్ సమీక్షలు ప్రారంభించారు.పాఠశాలలకు మనం సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ఉప్పలపాడు దగ్గర ఒక టీచరు,ఇద్దరు విద్యార్థులు వరద నీటిలో కొట్టుకు పోయిన ఘటనను తీవ్రంగా పరిగణించాలన్నారు. భారీవర్షాలు,వరదల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయి అప్రమత్తతో ఉంటే ప్రజల ఇబ్బందులను తగ్గించవచ్చని సిఎం చంద్రబాబు సూచించారు. ఇరిగేషన్,రెవిన్యూ శాఖలు సమన్వయంతో చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లపై భారీ స్థాయిలో నీరు చేరి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోందన్నారు. వీటిపై దృష్టి పెట్టాలని పరిస్థితికి అను గుణంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. భారీ వర్షాలు,వరదల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయి అప్రమత్తతో ఉంటే ప్రజలు ఇబ్బందులను తగ్గించవచ్చును. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలి. పరిస్థితికి అనుగుణంగా ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు.వర్షాలు,వరదలు కారణంగా మంచినీరు, ఆహరం కలుషితం అయ్యే అవకాశం ఎక్కువ ఉంది. దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. బాధితులకు మెరుగైన వైద్యసాయం అందించాలన్నారు.ముఖ్యంగా ఏజెన్సీలలో జ్వరాల బారినపడిన గిరిజనులకు వైద్యం అందేలా చూడాలన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలు,వాగులు దాటేందుకు ప్రజలను అనుమతించ వద్దు, ఈ విషయంల కఠినంగా వ్యవహరించాలన్నారు భారీ వర్షాలు, వరదలపై ఆయా ప్రాంతాల ప్రజల ఫోన్లకు అలెర్ట్ మేసెజ్‌లు ఇవ్వాలి. వరద ఉధృతంగా ఉన్న ప్రాంతాల్లో సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి,వరద బాధితులను సురక్షప్రాంతాలకు తరలించాలన్నారు. విద్యుత్తు సరఫరాకు ఇబ్బంది ఉండకూడదని స్పష్టం చేసారు.ప్రతి కుటుంబానికి కచ్చితంగా నాణ్యమైన ఆహరం అందించాలన్నారు.ఇక రైళ్ళు,బస్సులు రాకపోకలు ఆయా స్టేషన్లలో నిలిచివున్న ప్రయాణికులకు అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు.ఏపీలో భారీవర్షాలపై చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.ప్రభుత్వ ప్రధానకార్యదర్శి,డీజీపీ,మంత్రులు,జిల్లా కలెక్టర్లు. ఎస్పీలు ఆయా శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా వర్షాలపై పరిస్థితిని ముఖ్యమంత్రి సమీక్షించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్,డీజీపీ సిహెచ్ ద్వారకా తిరుమలరావులతో సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.సీఎం చంద్రబాబు నేటి మధ్యాహ్నాం ప్రకృత్తి.విపత్తు నియంత్రణ సంస్థ కార్యాలయానికి వెళ్ళి అక్కడ నుంచి వరదలు తదితర పరిస్థితులను సమీక్షించారు.

**తీరం దాటిన వాయుగుండం,లోతట్టు ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలి**

బంగళాఖాతంలో ఏర్పడిన తుఫాను ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా నడుమ 12.30-2.30ల మధ్య తీరం దాటింది,దీని ప్రభావంతో సోమ,మంగళవారాల్లోను పలు చోట్ల మాదిరి నుంచి భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉంది.శ్రీకాకుళం,విజయనగరం, మన్యం, అల్లూరి కాకినాడ,నంద్యాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది,ఏలూరు,కృష్ణా,ఎన్టీఆర్,గుంటూరు, బాపట్ల, పల్నాడు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుండి కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది,విశాఖపట్టణం, అనకాపల్లి, కోనసీమ, తూర్పు గోదావరి,పశ్చిమగోదావకి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయి. వైఎస్ఆర్,చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తెలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు.

## పది మంది మరణించడం భాధాకరం

### డి.సిఎం పవన్‌కల్యాణ్

**విజయవాడ, సెప్టెంబరు 1,ప్రభాతవార్త ప్రతినిధి** : రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో విజయ వాడ, గుంటూరు ప్రాంతాల్లో పదిమంది మర ణించడం భాధాకరమని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవాలని జనసూన పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒకప్రకటన విడుదలచేశారు. అధికార యంత్రాంగం చేపట్టే సహాయక చర్యలతో పాటు నాయకులు,శ్రేణులు కూడ సహాయం చేయడం అవసరమన్నారు. ఆహారం,రక్షిత నీరు అందించాలని,అదే విధంగా పిల్లలకు పాలు,బ్రెడ్, బిస్కెట్లు వంటివి అందుబాటులో ఉంచాలని, వైద్య శిబిరాలు ఏర్పాటుచేయడం ఎంతో అవసర మన్నారు. అందరూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. తన పుట్టిన రోజు పేరిట వేడుకలు చేయవద్దన్నారు.

## మరో 93 రైళ్లు దారి మళ్లింపు

**విజయవాడ, సెప్టెంబరు 1,ప్రభాతవార్త ప్రతినిధి** : భారీ వర్షాల కారణంగా పట్టాలపై నీళ్లు చేరడంతో విజయవాడ మీదుగా వెళ్లే 132 రైళ్లను అధికారులు రద్దు చేశారు.మరో 93 రైళ్లను దారి మళ్ళించారు. కొండపల్లి, రాయన పాడులో పట్టాలపై నీరు చేరడంతో మూడు రైళ్లు అక్కడే ఆగిపోయాయి. 40 ప్రత్యేక బస్సుల్లో 2 వేల మందిని విజయవాడ స్టేషన్‌కు తరలించారు. ప్రయాణీకులకు ఇబ్బంది లేకుండా ఎన్టీఆర్ జిల్లా అధికారులు అల్పాహారం,భోజన ఏర్పాట్లు చేశారు. మరోవైపు,కీసర టోల్ ప్లాజా వద్ద భారీ ట్రాఫిక్ జాం ఏర్పడింది. కంచికచర్యల మండల పరిధిలోని కీసర మునేరు వరద ఉధృతి పెరగటంతో జాతీయ రహదారిపై నీరు ప్రవహించి కీసర టోల్‌ప్లాజా వద్ద రెండు కిలోమీటర్ల బారీగా ట్రాఫిక్ జాంఅయ్యింది. దీంతో వాహనదారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు గంటల నుండి ఈ ట్రాఫిక్ లోనే ఉన్నామని ప్రజలు అంటున్నారు. తినడానికి తిండి,తాగడానికి నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఏపీలో మరో 24 గంటల పాటు కూడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు.

## సిఎం చంద్రబాబుకు ప్రధాని నరేంద్రమోడీ ఫోన్

**విజయవాడ,సెప్టెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో వరద పరిస్థితులపై సిఎం చంద్రబాబుకు ప్రధాని నరేంద్రమోడీ ఫోన్ చేసి ఆరా తీసారు.ఆయనకు చంద్రబాబుకు రాష్ట్రంలో వరద పరిస్థితులను వివరించారు.కీలకంగా విజయవాడ వరదలో ముంచెత్తి ఉందని తెలిపారు.గుంటూరులోను ఇదే పరిస్థితి ఉందని వివరించారు.తమకు కేంద్రం నుంచి సహయక దళాలు,హెలికాప్టర్లు,పవర్‌బోట్లు కావాలని ప్రధానికి సిఎం చంద్రబాబు విజ్ఞప్తి చేసారు. విజయవాడ నగరానికి భారీగా నష్టం వాటిల్లిందని వివరించారు. పలు జిల్లాల్లో గ్రామాలకు, గ్రామాలకు రహదారి వ్యవస్థ లేకుండా పోయిందని తెలిపారు.వరద నీరు జాతీయరహదారులపై చేరినందున వాహనాల రాకపోకలు నిలిచాయని తెలిపారు.కేంద్రం సోమవారం నాటికి సహయక బృందాలు,పవర్‌బోట్లు,హెలికాప్టర్లు పంపిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు.ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ వరదలపై ఆ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డితో ఫోన్లో మాట్లాడారు.

## ట్రాక్‌లు ధ్వంసం

>> కాలంలో రైల్వే ట్రాక్ ధ్వంసం అయిన సందర్భాలలో అనేక రైళ్లు పట్టాలు తప్పిన ఉదంతాలున్నాయి. ఈ విషయాన్ని ముందుగానే తెలుసుకున్న రైల్వే, పోలీసు సిబ్బంది ఆయా ప్రాంతాలలో గస్తీకాయడంతో ప్రమాదం తప్పింది. చిన్న స్టేషన్ అయిన కేసముద్రంలో అర్థరాత్రి వేళ నిలిచిపోయిన ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణీకులకు పోలీసులు ఆహారం, నీరు అందించి ఊరట కల్పించారు. కేసముద్రం ప్రాంతంలో రైల్వే ట్రాక్ ధ్వంసం అవడంతో ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ ఘటన ఇలావుంటే ఎపిలోని విజయవాడ సమీపంలో గల రాయనపాడు రైల్వే స్టేషన్ భారీ వర్షాట కారణంగా పూర్తిగా మునిగిపోయింది. ఈ స్టేషన్‌లో రైల్వే ట్రాక్ పై ఆరు అడుగుల ఎత్తు నుంచి వరద నీరు ప్రవహించడంతో విజయవాడ నుంచి వైజాగ్ వెళ్లే రైళ్లను రద్దు చేశారు. ఈ స్టేషన్‌కు అంతకు ముందు వచ్చిన రైళ్లలోని ప్రయాణీకులు వరదనీటితో బెంబేలెత్తిపోయారు. అయితే ఈ విషయాన్ని గమనించిన అధికారులు రైలు ప్రయాణికులను బోట్లలో సమీపంలోని బస్ స్టేషన్లకు తరలించి అక్కడి నుంచి విజ యవాడకు తీసుకువెళ్లారు. రాయనపాడులో సంభవించిన మెరుపు వరదల వల్ల చైన్నై న్యూఢిల్లీ మధ్య నడిచే తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలును అక్కడే నిలిపివేశారు. ఇందులోని ప్రయాణీకులను పడవల ద్వారా విజయవాడకు తరలించి అక్కడి నుంచి ప్రత్యేక రైలులో మరోమార్గం ద్వారా చెన్నైకి తరలించారు. కాగా తెలుగు రాష్ట్రాలలో భారీ వర్షాల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లను రద్దు చేయగా ఇంకొన్నింటిని ఆలస్యంగా నడుపుతోంది.

## నీటి కుంటలో మునిగి ముగ్గురు విద్యార్థులు మృతి

### బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం: మంత్రి స్వామి

**పెద్దారవీడు,సెప్టెంబరు 1,ప్రభాతవార్త** : సరదాగా ఈతకు వెళ్లి ముగ్గురు విద్యార్థులు నీట మునిగి మృతి చెందిన విషాదకర సంఘటన పెద్దారవీడు మండలం పిఎస్ కొత్తపల్లిలో ఆదివారం సాయంత్రం జరిగింది. పిఎస్ కొత్తపల్లి గ్రామానికి చెందిన కొంత మంది విద్యార్థులు సరదాగా ఆటలాడుకోవడానికి సమీప ప్రాంతానికి వెళ్లారు. అయితే కుంటలో నీరు నిండుగా ఉండటంతో సరదాగా ఈత కోసం ముగ్గురు విద్యార్థులు దిగారు. కొత్తపల్లి శివ(10),కొత్తపల్లి మను(8), అర వీటి ఏడుకొండలు(9) నీటిలో మునిగిపోయి మృతి చెందారు. వీరిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో కళ్ళెదుటే తమ మిత్రులు మృతి ఒడిలో చేరుతుండటంతో కేకలు వేశారు. వారితో పాటు వెళ్లిన విద్యార్థులు కేకలు వేసుకుంటూ గ్రామంలోకి పరుగులు తీశారు. అయితే గ్రామస్తులు వచ్చేలోపే విద్యార్థులు విగత జీవులుగా మారారు. తమ కళ్లెదుటే క్షణాల్లో మాయమైన కుమారుల మృతిని జీర్ణించుకోలేని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ముగ్గురు విద్యార్థుల దుర్ఘటనతో పిఎస్ కొత్తపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**విద్యార్థుల మృతి వార్త కలిచివేసంది : మంత్రి స్వామి**

పెద్దారవీడు మండలం పిఎస్ కొత్తపల్లి నీటి కుంటలో మునిగి ముగ్గురు మృతిచెందిన సంఘటన తనను ఎంతోకలిచివేసిందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి ఆవేదన వ్యక్తంచేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థులు నీటి కుంటలో పడి చనిపోవడం బాధాకరమన్నారు.బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి స్వామి భరోసా ఇచ్చారు.

నీటి కుంటలో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని యర్రగొండపాలెం టిడిపి ఇంచార్జి ఎరిక్షన్‌బాబు భరోసా ఇచ్చారు.


THE GOVERNMENT OF BODOLAND
Results of 01/09/2024
M.R.P. ₹.2/-

FUTURE SERIES Dr No:9
1st Prize Rs.100000/- 425783
2nd Prize Rs.7000/- 44907
3rd Prize Rs.3500/-
18512 19284 22581 28772 33145
41116 73567 82251 85651 98387
4th Prize Rs.200/-
0660 0903 0962 1579 4855
4919 6370 8709 9128 9391
5th Prize Rs.100/-
0032 2807 3607 5132 6865
7430 7585 8607 9028 9487
6th Prize Rs.50/-
0151 2163 3625 4885 6788 8713
0265 2247 3656 4991 7252 8721
0327 2299 3810 5025 7281 8978
0351 2317 3819 5028 7350 9142
0731 2636 4009 5047 7517 9162
0817 2645 4117 5059 7606 9217
0920 2675 4283 5130 7639 9248
1115 2694 4315 5178 7668 9353
1174 2844 4330 5292 7669 9502
1199 2861 4499 5436 7688 9541
1368 3063 4548 5781 7795 9589
1448 3234 4570 5830 8093 9595
1683 3312 4620 6064 8148 9633
1795 3328 4667 6122 8267 9770
1855 3503 4729 6389 8530 9813
1983 3531 4799 6634 8559
2140 3544 4878 6695 8710

SINGAM SERIES Dr No:9
1st Prize Rs.100000/- 090633
2nd Prize Rs.7000/- 98308
3rd Prize Rs.3500/-
01339 11175 15696 21580 35324
38589 46331 47908 56065 81893
4th Prize Rs.200/-
0709 0758 3511 3558 6569
7038 7312 7794 7936 8530
5th Prize Rs.100/-
0107 0432 2510 2736 2842
2898 3973 6935 7105 7161
6th Prize Rs.50/-
0016 1845 3117 5094 6704 8781
0053 1852 3380 5175 6956 8856
0410 1928 3443 5229 6981 8871
0678 1947 3467 5243 7342 8952
0754 2049 3582 5326 7557 9035
0770 2226 3668 5602 7766 9058
0815 2244 3898 5701 7819 9068
0889 2261 4004 5899 7851 9100
0890 2351 4422 5961 8252 9197
0921 2413 4466 6039 8310 9551
0970 2422 4498 6098 8434 9578
1312 2633 4501 6150 8457 9719
1342 2688 4617 6434 8503 9773
1344 2809 4685 6467 8556 9794
1364 2897 4860 6544 8560 9904
1621 3001 4901 6601 8721
1753 3097 4912 6694 8772

KUIL SERIES Dr No:9
1st Prize Rs.100000/- 898849
2nd Prize Rs.7000/- 21896
3rd Prize Rs.3500/-
16828 17868 32911 45421 59874
61450 66235 74850 85570 94507
4th Prize Rs.200/-
0961 1006 3031 3521 5823
6236 6630 7271 8940 9635
5th Prize Rs.100/-
1798 2774 3952 5107 5291
6556 7071 8067 8745 8956
6th Prize Rs.50/-
0027 2346 3780 5019 6342 8640
0186 2476 3866 5245 6392 8946
0595 2493 3882 5259 6618 9006
0619 2558 3915 5310 6620 9134
0916 2620 4032 5348 7197 9172
0925 2636 4107 5484 7447 9219
0966 2646 4143 5517 7547 9250
0995 2709 4232 5652 7725 9376
0997 2933 4433 5690 7775 9407
1153 3000 4446 5777 7886 9458
1197 3018 4497 5829 7930 9519
1289 3151 4621 5840 8050 9694
1412 3252 4860 6039 8173 9752
1825 3310 4881 6139 8227 9943
1834 3316 4925 6269 8329 9984
1917 3414 4959 6274 8530
2287 3501 4967 6304 8586

ROSA SERIES Dr No:9
1st Prize Rs.100000/- 318522
2nd Prize Rs.7000/- 61184
3rd Prize Rs.3500/-
04788 22457 42499 44074 47552
49249 76273 82037 84683 87381
4th Prize Rs.200/-
0858 4196 4381 4603 4846
6190 7944 8405 8978 9088
5th Prize Rs.100/-
0674 0945 4653 5706 5863
7183 7779 8136 9563 9643
6th Prize Rs.50/-
0044 2365 3492 5813 7601 8614
0094 2542 3645 5921 7625 8766
0204 2644 3652 5929 7649 8792
0355 2649 3669 6001 7697 9137
0483 2697 3793 6211 7719 9362
0510 2701 3971 6281 7769 9382
0550 2743 3984 6284 7809 9449
0638 2748 4140 6386 7910 9473
0941 3108 4159 6464 7964 9487
0958 3198 4432 6627 8067 9532
0981 3241 4740 6911 8085 9552
1156 3247 4768 7160 8202 9620
1256 3300 4799 7200 8210 9695
2025 3349 4877 7210 8281 9731
2236 3355 4935 7297 8306 9822
2308 3380 5245 7358 8425
2311 3485 5248 7470 8501

DEAR SERIES Dr No:9
1st Prize Rs.100000/- 429746
2nd Prize Rs.7000/- 85561
3rd Prize Rs.3500/-
12204 31373 34795 38814 49004
52141 64797 65956 74904 88491
4th Prize Rs.200/-
0405 0587 2316 2540 2723
2974 4035 4068 7477 9957
5th Prize Rs.100/-
0125 0127 2555 2668 4780
5534 6915 7613 9464 9635
6th Prize Rs.50/-
0205 1986 3709 5447 7005 8699
0384 2385 3718 5562 7013 8705
0447 2406 3866 5690 7351 8936
0450 2570 4046 5915 7424 8991
0493 2692 4462 6009 7454 9036
0614 2905 4469 6107 7557 9102
0776 2961 4554 6132 7626 9186
0842 3045 4808 6373 7814 9375
0858 3077 4960 6381 7915 9493
0937 3163 5025 6391 8035 9537
1004 3254 5040 6493 8161 9623
1323 3294 5091 6595 8265 9753
1452 3296 5264 6611 8349 9757
1480 3335 5307 6624 8406 9760
1679 3391 5359 6658 8444 9937
1777 3483 5389 6790 8558
1978 3602 5401 6849 8615

THANGAM SERIES Dr No:9
1st Prize Rs.100000/- 873834
2nd Prize Rs.7000/- 03116
3rd Prize Rs.3500/-
03233 26723 38321 40271 42975
49503 62347 65743 67949 83347
4th Prize Rs.200/-
0986 1899 3832 6512 7607
8010 9218 9319 9566 9981
5th Prize Rs.100/-
0853 1003 2178 3816 4211
5596 6745 8868 9185 9969
6th Prize Rs.50/-
0125 2048 4158 5604 6866 8313
0174 2074 4166 5621 6995 8440
0370 2108 4187 5658 7100 8570
0485 2330 4554 5815 7193 8618
0731 2359 4563 5993 7223 8637
0737 2395 4700 6036 7407 8738
0958 2517 4830 6168 7433 8874
0985 2627 4852 6247 7575 8921
1142 2675 4934 6298 7587 8996
1259 2694 4971 6424 7695 9025
1272 2816 5008 6438 7707 9372
1301 2972 5009 6518 7747 9494
1426 3066 5149 6572 7772 9520
1439 3313 5211 6647 7774 9795
1777 3687 5369 6752 7887 9935
1780 3948 5498 6768 8277
1962 4097 5563 6864 8306

THE GOVERNMENT OF BODOLAND
Results of 01/09/2024
M.R.P. ₹.2/-

ABBLE SERIES Dr No:9
1st Prize Rs.100000/- 523633
2nd Prize Rs.7000/- 24326
3rd Prize Rs.3500/-
01242 47218 49365 52200 66983
70183 71144 78723 96730 97217
4th Prize Rs.200/-
2125 2403 3666 3918 4515
4743 4893 7478 8992 9835
5th Prize Rs.100/-
0813 1071 1132 1763 2364
5381 5856 5948 6599 6853
6th Prize Rs.50/-
0091 1480 3529 5315 6784 8440
0273 1483 3663 5387 6842 8586
0373 1503 3854 5403 7190 8747
0482 1828 3865 5467 7207 8786
0584 2000 3891 5468 7219 8801
0602 2018 4023 5524 7316 9106
0711 2250 4149 5759 7490 9128
0891 2269 4241 5945 7506 9195
0996 2402 4274 5995 7750 9415
1142 2583 4332 6074 7815 9471
1145 2681 4356 6358 7844 9552
1170 3068 4431 6445 7864 9795
1238 3226 4671 6497 7953 9813
1252 3252 4850 6510 8007 9963
1367 3360 4976 6543 8017 9967
1441 3406 4979 6765 8187
1458 3429 5017 6766 8319

NALLANERAM SERIES Dr No:9
1st Prize Rs.100000/- 984401
2nd Prize Rs.7000/- 22122
3rd Prize Rs.3500/-
12590 20363 31402 32968 36639
39362 52276 60942 74771 87838
4th Prize Rs.200/-
0105 1381 3389 6307 6336
6923 7025 7244 9032 9956
5th Prize Rs.100/-
0816 2331 2825 3011 3174
3362 4582 5117 6325 8368
6th Prize Rs.50/-
0038 1862 3515 4517 6889 8755
0049 1871 3601 4729 6916 8889
0056 1905 3672 4892 7017 9048
0166 2061 3729 4929 7106 9172
0211 2067 3747 5061 7391 9277
0221 2135 3749 5064 7413 9410
0388 2202 3812 5277 7555 9454
0411 2632 3861 5382 8007 9484
0602 2639 3907 5440 8061 9527
1093 3077 4038 5506 8173 9573
1174 3104 4243 5636 8349 9574
1390 3186 4302 5659 8458 9609
1395 3242 4309 5678 8474 9715
1464 3290 4317 6138 8567 9731
1534 3457 4346 6248 8572 9901
1681 3467 4424 6352 8685
1731 3509 4514 6516 8724

KUMARAN SERIES Dr No:9
1st Prize Rs.100000/- 128715
2nd Prize Rs.7000/- 09605
3rd Prize Rs.3500/-
05053 06884 12416 28616 40413
51678 67316 68628 68663 79319
4th Prize Rs.200/-
0923 1926 2841 3514 3535
3887 5566 6378 6972 9309
5th Prize Rs.100/-
0281 1053 1505 3236 3629
6014 6174 6283 6486 9442
6th Prize Rs.50/-
0115 1852 3245 5766 7199 8858
0202 1885 3357 5882 7264 9000
0380 1906 3573 5911 7511 9103
0415 1911 3602 5936 7563 9171
0536 1921 3743 5996 7646 9212
0605 1990 4438 6010 7663 9253
0633 2056 4551 6115 7728 9312
0824 2117 4812 6306 7729 9362
0871 2159 4879 6528 7779 9443
0922 2266 4931 6604 8206 9450
0997 2368 5037 6652 8248 9487
1428 2446 5072 6769 8394 9560
1482 2637 5190 6790 8485 9749
1611 2985 5192 6793 8575 9854
1739 3066 5467 6897 8578 9884
1741 3092 5669 7144 8624
1816 3093 5757 7145 8835

VISHNU SERIES Dr No:9
1st Prize Rs.100000/- 485497
2nd Prize Rs.7000/- 97577
3rd Prize Rs.3500/-
03328 19142 31594 33524 41717
61336 61413 73030 91770 98448
4th Prize Rs.200/-
0587 1501 2067 2384 2838
4563 4989 6544 7255 8811
5th Prize Rs.100/-
4193 4469 4963 5222 6768
6926 7749 8181 8610 9990
6th Prize Rs.50/-
0054 1709 3190 5533 7155 8534
0073 1806 3219 5636 7176 8701
0158 1808 3406 5785 7222 8745
0177 1911 3476 5809 7473 8863
0400 2039 3534 5860 7527 8907
0655 2052 3594 5877 7549 9002
0868 2114 4328 5879 7608 9144
0947 2144 4347 5963 7747 9248
1092 2176 4506 6174 7973 9300
1162 2437 4583 6190 8005 9470
1248 2489 4684 6192 8042 9509
1368 2516 4733 6200 8058 9518
1470 2623 4801 6350 8247 9745
1479 2657 4929 6383 8368 9818
1486 2682 5006 6793 8485 9891
1487 2809 5025 6830 8490
1668 3037 5203 6915 8522

SWARNALAXMI SERIES Dr No:9
1st Prize Rs.100000/- 843740
2nd Prize Rs.7000/- 87959
3rd Prize Rs.3500/-
19422 21245 32648 43215 54346
65258 65884 76786 87779 98353
4th Prize Rs.200/-
2126 2318 2323 2394 4481
4568 4719 5047 5486 5797
5th Prize Rs.100/-
0333 3955 5012 5163 7123
7416 7728 8531 8607 9581
6th Prize Rs.50/-
0131 1881 3530 5185 6127 8038
0208 1985 3786 5332 6179 8046
0241 2319 3870 5354 6203 8264
0460 2387 3880 5405 6230 8377
0494 2462 4244 5439 6231 8652
0737 2515 4251 5506 6452 8714
0741 2553 4331 5509 6509 9107
0844 2571 4386 5642 6643 9114
0853 2757 4499 5674 7380 9132
0949 2781 4544 5764 7484 9263
1100 2816 4554 5768 7522 9292
1131 3026 4581 5863 7532 9529
1153 3136 4617 5888 7601 9575
1169 3170 4638 5934 7623 9585
1247 3378 4705 5957 7698 9843
1693 3396 4828 6012 7756
1872 3423 5109 6051 8007

LION SERIES Dr No:9
1st Prize Rs.100000/- 218971
2nd Prize Rs.7000/- 64863
3rd Prize Rs.3500/-
18418 29470 31153 31481 42323
42756 53650 75396 86796 97624
4th Prize Rs.200/-
0729 0863 1932 3077 4894
5368 7266 7412 7741 8620
5th Prize Rs.100/-
0045 0532 1359 2389 5028
7648 7662 8920 9699 9895
6th Prize Rs.50/-
0205 1192 3021 4528 6398 8821
0275 1319 3200 4551 6598 9045
0368 1379 3424 4711 6708 9057
0437 1570 3460 4742 7164 9206
0496 1665 3472 4775 7214 9489
0518 1670 3491 4799 7318 9492
0530 1857 3687 5237 7539 9584
0620 1870 3743 5484 7602 9633
0667 1951 3826 5487 7632 9693
0761 1956 3999 5662 7817 9716
0764 2002 4005 5735 8190 9835
0805 2097 4053 5848 8206 9836
1028 2099 4214 5872 8278 9842
1054 2227 4278 5891 8321 9867
1101 2341 4281 5921 8376 9928
1150 2513 4316 6065 8574
1170 2679 4318 6396 8781


## నీలంసాగర్ డ్యాంకు భారీగా వరద నీరు

### ముమ్మరంగా రెండు జలవిద్యుత్ కేంద్రాలు ఉత్పత్తి



శ్రీశైలం డ్యాం పది గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

**శ్రీశైలంప్రాజక్టు, సెప్టెంబర్ 1,ప్రభాతావార్త:** శ్రీశైలం నీలం సాగర్ డ్యాం కృష్ణమ్మ ఉప్పొంగుతుంది. భారిగా వరద నీటితో జలకళను సంతరించుకుంది. భారి వర్షాలు కురియడంతో ఎగువన ఉన్నా జలశయాలు నిండిపొంగిపోర్లుతున్నాయి. రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యం మేరకు ఉంచుకోని అదనపు నీటిని దిగువ జలశయాలకు నీటిని క్రస్ట్‌గేట్లద్వారా విడుదల చేయడం జరుగుతుంది. శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద నీటి ఉధృతి మరింత పెరగడంతో జలశయం 10 రెడియల్ క్రస్ట్‌గేట్ల స్పిల్‌వే గుండా 4,06,242 క్యూసెక్కుల నీటిని దిగువ సాగర్‌కు విడుదల చేయడం జరుగుతుంది. ఒక్కొక్క క్రస్ట్‌గేటును 10 అడుగుల ఎత్తుమేరకు తేరచి నీటిని విడుదల చేస్తున్నారు. అదే విధంగా కుడిగట్టు జలవిద్యుత్ కే ంద్రం నుండి విద్యుత్ ఉత్పత్తి అనంతరం 30,181 క్యూసెక్యుల నీరు,ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రం నుండి 37,882 క్యూసెక్యుల నీటిని విడుదల చేయడం జరుగుతుంది.డ్యాం స్పిల్‌వే,రెండు విధ్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుండి మొత్తం 4,74,305 క్యూసెక్యుల నీరు విడుదల చేయడం జరుగుతుంది. శ్రీశైలం రిజర్వయర్ నీటిమట్టం ఆదివారం 6గంటల సమయానికి 884.90 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 214.3638 టియంసిలుగా నమొదు అయింది.గడచిన ఇరవైనాలుగు గంటల్లో ఏపి జలవిద్యుత్ కేంద్రంలో 14.577 మీలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు.

## ఎన్డీఆర్ఎఫ్ బృందాల రాక

>>న్నట్లు కేంద్ర హోం కార్యదర్శి తెలిపారన్నారు. సహాయక చర్యలకు ఆరు హెలికాప్టర్లు వచ్చే అవకాశం ఉందన్నారు.సోమవారం నుంచి హెలికాప్టర్‌లు సహయక చర్యల్లో పాల్గొంటాయని సిఎం చంద్రబాబు తెలిపారు.ఇబ్బందుల్లో ఉన్నవారందరిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని చంద్రబాబు స్పష్టం చేసారు.గతంలో ఎన్నడు లేని రీతిలో కృష్ణా,గుంటూరు జిల్లాల్లో భారీ వర్షం కురిసిందన్నారు. సహయకచర్యల కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులను శాఖ చర్యల కోసం విజయవాడ పిలిపిస్తున్నామన్నారు. సహాయకచర్యల కోసం టోల్‌ఫ్రీనెంబర్లుతో 112,107 కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేసామన్నారు. ముంపు ప్రాంత ప్రజలకు విజయవాడలోని అన్ని పంక్షన్‌హాళ్లలో పునరావాసం కల్పించామన్నారు. అక్షయపాత్ర ద్వారా భోజనం అందిస్తామన్నారు. నల్గొండ,ఖమ్మంలో పడుతున్న వర్షాలు కృష్ణా ఉపనదుల ద్వారా నీరు కృష్ణకు వచ్చి చేరుతుందన్నారు.వరదబాధితులందరికి సహయక చర్యలు అందుతాయన్నారు.

## మునిగిన రైలు మార్గాలు

>> అనేక రైళ్లను భద్రతా కారణాల దృష్ట్యా రద్దు చేయడంతోపాటు అనేక రైలు సర్వీసులను హైదరాబాద్, గుంటూరు, గుంతకల్లు రైల్వే డివిజన్లమీదుగా మళ్లించామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ నెంబర్‌లను ఏర్పాటు చేశామన్నారు. సికింద్రాబాద్ 040-27786140, 040- 27786170, హైదరాబాద్ 9676904334, 27782660, విజయవాడ 756305697, ఖమ్మం 087422224541, 7815955306, 27782985, వరంగల్లు 906332808, 27782751, ఖాజీపేట 0879-2576430, 27782660, రాజమండ్రి 0883-2420541, 0783-2420543, ఒంగోలు 7815909469, తెనాలి 08644 227600, నెల్లూరు 7815909469, గూడూరు 08624250795, గుడివాడ 7815909462, బీమవరం టౌన్ 7815909462, తుని 7815909479, గుంటూరు 9701379072, నరసరావుపేట 9701379978, నడికూడి 9701379968, 7989875492, నల్గొండ 9791379966, 9030330121, మిర్యాలగూడ 8501978404, నంద్యాల 9440289105, 7702772080, దొనకొండ 7093745898. స్టేషన్లలో హెల్ప్‌లైన్‌లుఏర్పాటు చేశారు.

## బాధితుల తరలింపు

>> మొత్తం 17 బృందాలు,7జిల్లాల్లోని 22 ముంపు ప్రాంతాల్లో సహయక చర్యలు చేపట్టామన్నారు. ఎటువంటి అత్యవరసర పరిస్థితులనైన ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దీనికి అవసరమైన అయిదుబోట్లు,ఒక హెలికాప్టర్ సిద్ధంగా ఉంచామన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అధిక వర్షాల కారణంగా ఏర్పడిన పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ అధికారలతో సమన్వయంతో సహయక చర్యలు చేపట్టాలని నిర్దేశించారన్నారు.

### వారం - వర్జ్యం

తేది : 02-09-2024, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
శ్రావణమాసం, దక్షిణాయనం,
వర్షఋతువు, కృష్ణపక్షం,
అమావాస్య పూర్తి
మఖ రా. 12.19
వర్జ్యం ఉ. 11.03-12.50
దు.మ. 12.41-1.31
2) మ. 3.11-4.01
రాహుకాలం - ఉ. 7.30-9.00

### వార్తాఫలం

**మేషం :** పనులలో జాప్యం జరిగినా చివరికి పూర్తిచేస్తారు. వివాదాలకు దూరంగా వుండండి.

**వృషభం :** ఆర్థిక లావాదేవీలు ఊరటకలిగిస్తాయి. దీర్ఘకాలిక ఋణబాధలు తొలుగుతాయి.

**మిథునం:** ఆకస్మిక ప్రయాణాలు లభిస్తాయి. సొంత ఆలోచనలతో ముందుకు సాగడం మంచిది.

**కర్కాటకం :** ప్రత్యర్థుల పై పట్టు సాధిస్తారు. వృత్తి వ్యాపారాలలో లాభాలు సాధిస్తారు.

**సింహం :** ఉద్యోగులకు ఏర్పడిన చికాకులు తొలుగుతాయి. భాగస్వామ్య వ్యాపారాలు ప్రారంభిస్తారు.

**కన్య:** రాజకీయ, కళా, పారిశ్రామిక రంగాలవారికి ప్రోత్సాహకరంగా వుంటుంది. ధనలాభం.

**తుల :** చేపట్టిన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా వుండును.

**వృశ్చికం:** ప్రత్యర్థులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు. వివాహ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**ధనుస్సు:** వృత్తి - వ్యాపారాలో ఎదురైన ఆటుపోట్లు తొలగించుకుంటారు. ప్రయాణాలు.

**మకరం:**నూతన భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. కాంట్రాక్టులు దక్కించుకుంటారు.

**కుంభం :** అనుకోని అతిథులనుండి ఆహ్వానాలు అందుతాయి. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**మీనం :** కుటుంబ సభ్యులనుండి సహాయసహకారాలు అందుతాయి. శుభవార్తలు వింటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

2-9Pg3exHMNWJQEK.qxd:2-9Pg3exHMNWJQEK.qxd 01/01/01 8:54 AM Page 1



# 30యేళ్ల సిఎం చంద్రబాబు

## ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టి మూడు దశాబ్దాలు

**విజయవాడ, సెప్టెంబరు 1,ప్రభాతవార్తప్రతినిధి:** సీబీఎన్ ఆయన పొట్టిపేరు,రాజకీయాల్లో అది విశ్వవిఖ్యాతం,పరిపాలనలో అపర చాణక్యానికి నిదర్శనం.ఆయనే చంద్రబాబునాయుడు, విద్యార్థి దశనుంచి గమనిస్తే 50యేళ్ల దగ్గర, దగ్గర రాజకీయ జీవనం ఆయనది,అధికార పక్షనేత,విపక్షనాయకునిగా ఆయన ఒకే వైఖరి ఒక్కటే.మొక్కవోని ధైర్యం,స్థయిర్యం.ఇప్పటికి నాలుగు పర్యాయాలు ముఖ్యమంత్రి పదవిని చేపట్టినేటి 30ఏళ్ళు ఈ అనితర సాధ్యనేత తొలిసారి 1995 సెప్టెంబర్1 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు తొలిసారి ప్రమాణ స్వీకారం చేసారు.అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను గద్దెదించి అధికారం చేపట్టారు.అది రాజకీయంగా ప్రజలను మెప్పించి మరి అధికారంలో అడుగుపెట్టారు. అత్యంత జనాదరణ ఉన్న ఎన్టీఆర్‌ను పక్కన పెట్టి ప్రజలు చంద్రబాబును ముఖ్యమంత్రిగా అంగీకరించడం ఆయన రాజకీయ చతురతకు నిదర్శనం,ఇప్పటి వరకు 14 ఏళ్ళు ముఖ్య మంత్రిగా,15 ఏళ్ళు ప్రతిపక్షనేతగా చంద్రబాబు వ్యవహరించారు.తెలంగాణా ఏపీతో విడిపో యాక ఆంధ్రప్రదేశ్ 2014లో ఆయన తొలి ముఖ్యమంత్రిగా వ్యవహరించారు,2019-24 మధ్య విపక్షనేతగా నిలిచారు.తొలి సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత 30ఏళ్ళ అధికార పాలనా వ్యవస్థలో ఆయన ఓ విశిష్టతను చూపించారు. అయిదేళ్ళ విపక్ష నేతగా ఉండి. మూడునెలల కితం అధికారం చేపట్టిన చంద్రబాబు ఆయనకున్న గ్రేట్ అడ్మినిస్ట్రేటర్, పొలిటికల్ సీఈవో అనే బిరుదులకు తగినట్లుగానే రాష్ట్రాన్ని దేశంలో నెంబరు1 నిలిపేందుకు శక్తివంచనల లేకకుండా శ్రమిస్తున్నారు.రెండు నెలలలో కేంద్రాన్ని ఒప్పించి రాష్ట్రాభివృద్ధి రూ.15వేల కోట్లు నిధులు ఇచ్చేందుకు బడ్జెట్‌లో ప్రతిపాదింప చేసారు.రాష్ట్రంలో అత్యధిక కాలం సీఎంగా చేసిన రికార్డు సీబీఎన్‌దే!

# రైల్వేలో మోగిన ఎన్నికల నగారా

### దేశ వ్యాప్తంగా రైల్వే కార్మిక సంఘాల గుర్తింపునకై ఎన్నికలు

### పోలింగ్ డిసెంబర్ 4 నుంచి 6 వరకు

### డిసెంబర్ 12న కౌంటింగ్, ఫలితాలు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** భారతీయ రైల్వేలో కార్మిక సంఘాల గుర్తింపుకై ఎన్నికల నగారా మోగింది. దేశ వ్యాప్తంగా భారతీయ రైల్వే చరిత్రలో మూడోసారి రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల నిర్వహించేందుకు రైల్వే బోర్డు ఎస్‌బిఐ కమిటీ కన్వీనర్ రాజీవ్ గాంధీ నోటిఫికేషన్ జారీ చేశారు. జోనల్ రైల్వేలు, మెట్రో రైల్వే ఉత్పత్తి కర్మాగారాలలో నిర్వహించే ఎన్నికల నోటిఫికేషన్‌ను జారీ చేస్తాయని ఆయన తన ఆదేశాల్లో పేర్కొన్నారు. నామినేషన్ల దాఖలుకై అక్టోబర్ 25 చివరి తేది, నవంబర్ 11న నామినేషన్ల పరిశృలన, నవంబర్ 14న నామినేషన్ల ఉపసంహఖరణకు చివరి తేదీ. కాగా డిసెంబర్ 04 నుంచి 06 వరకు వరుసగా మూడు రోజులపాటు పోలింగ్ ప్రక్రియను నిర్వహిస్తారు. డిసెంబర్ 10న రీ పోలింగ్ అనంతరం, డిసెంబర్ 12న ఎన్నికల కౌంటింగ్, ఫలితాలను వెల్లడిస్తామని రైల్వే బోర్డు అధికార వర్గాలు తెలిపాయి.

# హిడెన్ కెమెరాలు బ్లూమీడియా సృష్టే

### కుంభకోణాల నుంచి పక్కదారి పట్టించేందుకే లేనిపోని ఆరోపణలు

### రాష్ట్రంలోని విద్యార్థులంతా నా బిడ్డల్లాంటివారే

### జగన్ మాదిరి తల్లీ,చెల్లిని రోడ్లపైకి గెంటేసే రకంకాదు

### మంగళగిరి నియోజకవర్గ పర్యటనలో మంత్రి నారా లోకేష్ ధ్వజం



**మంగళగిరి,సెప్టెంబర్ 1,ప్రభాతవార్త:** గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల బాత్రూమ్‌లలో హిడెన్ కెమెరాలు బ్లూమీడియా సృష్టి మాత్రమేనని, అక్కడ కెమెరాలు ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు లభించలేదని రాష్ట్ర విద్య,ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.మంగళగిరి నియోజకవర్గంలో ముంపు ప్రాంతాలను పరిశీలించిన అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నేతల సినీనటి వేధింపుల కేసు,మద్యం కుంభకోణం,భూ అక్రమాలు వరుసగా బయల్పడుతుండడంతో వాటినుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకే హిడెన్ కెమెరాల నాటకానికి తెరలేపారని ధ్వజమెత్తారు. విద్యాశాఖ మంత్రిగా రాష్ట్రంలో చదివే విద్యార్థులంతా నా బిడ్డల్లాంటి వారేనని,వారిని క్షేమంగా కాపాడుకునే బాద్యత పూర్తిగా తమదేనని అన్నారు.గుడ్లవల్లేరులో నలుగురు విద్యార్థుల మధ్య జరిగిన ఒక వ్యక్తిగత అంశం ఈ గొడవకు కారణమైందని,సంబంధిత విద్యార్థిని డిటెయిన్ చేసి ఇప్పటికే అదుపులోనికి తీసుకున్నామన్నారు.నూజివీడు ట్రిపుల్ ఐటిలో ఆహారం కలుషితమైందని తెలిసిన వెంటనే డైరెక్టర్‌ను విధులనుంచి తొలగించామని,ముగ్గురు ఉన్నతాధికారులతో పర్యవేక్షక కమిటీని నియమించామని తెలిపారు.జగన్మోహనరెడ్డి మాదిరిగా తాను తల్లీ,చెల్లిని రోడ్లపైకి గెంటేసే రకం కాదని, విద్యార్థినులను తన తోబుట్టువులుగా భావించి కంటికి రెప్పలా కాపాడతానని స్పష్టంచేశారు. నాడు-నేడు పేరుతో జగన్ ప్రభుత్వం వేలకోట్లు ఖర్చుచేసినట్లు తప్పుడు లెక్కలు చెబు తోందని,అదే నిజమైతే రాష్ట్రంలో ప్రభుత్వ పాఠ శాలల్లో గత అయిదేళ్ళలో 10లక్షల మంది విద్యార్థులు ఎందుకు తగ్గారని నిలదీశాడు. డిజిటల్ క్లాస్‌రూమ్‌లు జగన్ కొత్తగా ఏమీ కనిపెట్టలేదని,అవి అంతకుముందే ఉన్నా యన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించకుండా రంగులు వేసి వందలకోట్లు దిగమింగారని దుయ్యబట్టారు. విద్యార్థులకు సరఫరాచేసే గుడ్లు,చిక్కీలు, ఆయాల జీతాలు కూడా బకాయి పెట్టి వెళ్ళారని,వాటన్నింటిని ఒక్కొక్కటిగా తాము విడుదల చేస్తున్నామని తెలిపారు.రాష్ట్రంలో ప్రైవేటు స్కూళ్ళకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని,ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తామని మంత్రి నారా లోకేష్ స్పష్టంచేశారు.

# నూజివీడు ట్రిపుల్ ఐటి విద్యార్థుల అస్వస్థతపై మంత్రి లోకేష్ అసహనం

**విజయవాడ, సెప్టెంబరు1, ప్రభాతవార్తప్రతినిధి:** నూజివీడు త్రిపుల్ ఐటీలో కలుషితాహారం తిని పెద్ద సంఖ్యలో విద్యార్థులు అనారోగ్యానికి గురైన ఉదంతాన్ని రాష్ట్ర విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా పరిగణించారు. ఎక్స్ వేదికగా ఆయన ఈ అంశంపై స్పందిస్తూ విద్యార్థుల ఆహారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌ను ఆ భాధ్యతల నుండి తప్పిస్తూ నిర్ణయం తీసు కున్నట్లు వెల్లడించారు,ఆయన స్థానంలో వరంగల్ నిట్ ఆచార్యుడైన చంద్రశేఖర్‌ను గత ప్రభుత్వం డైరెక్టర్‌గా నియమించినట్లు తెలిపారు. ట్రిపుల్ ఐటీ విధ్యార్థులు వారి తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పాదుకొల్పే చర్యల్లో భాగంగా పర్యవేక్షణకు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. కళాశాల విద్య కమీషనర్ పోలా భాస్కర్,ఉన్నత విద్యామండలి ఇన్‌ఛార్జి చైర్మన్ రామ్మోహనరావు, ఏలూరు కలెక్టర్ వెట్రి సెల్వీ ఇందులో సభ్యులుగా ఉంటారు. ఆహార నాణ్యత కొన్ని సున్నితమైన అంశాలపై ఫిర్యాదుల స్వీకరణ,ఇతరత్రా సమస్యల సత్వర పరిష్కారానికి ఈ కమిటీ ప్రణాళికను రూపొందించాలని మంత్రి లోకేష్ సూచించారు.తీ సభ్య కమిటీకి భాధ్యతలు వెల్లండించారు.విద్యార్థులకందిస్తున్న ఆహార నాణ్యత,పారిశుద్ధ్యం,మెస్‌లో పరిశుభ్రత చర్యల కోసం ప్రామాణిఒక ఆపరేటింగ్ ప్రోటోకాల్ అమలు,వసతిగృహాల్లో మెరుగైన ప్రమాళణాల అమలుకు చర్యలు తీసుకోవడాన్ని ఈ కమిటీ పరిశీలించనుంది.ట్రిపుల్‌ఐటీ అవసరాల మేరకు చిన్న చిన్న మరమ్మత్తులు చేయడం,లైంగిక వేధింపులపై ఫిర్యాదుల పరిష్కారానికి అంతర్గత కమిటీ వేయడం,ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా విచారణ చేపట్టి సత్వరం చర్యలు తీసుకోవడం,ప్రతి డిపార్ట్‌మెంట్ స్థాయిలో తగినయంత్రాంగాన్ని ఏర్పాటు చేసి డ్రగ్,పొగాకు రహితంగా తీర్చిదిద్దడంపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించనుంది. విధ్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించడం,జీవన నైపుణ్యానికి చర్యలు తీసుకోవడం,కళాశాల వెల్‌నెస్ టీం ఏర్పాటును కమిటీ పరిశీలిస్తుంది. వెల్‌నెస్ టీంలో విధ్యార్థి సంక్షేమ డీన్,ఇద్దరు సీనియర్ అధ్యాపకులు సభ్యులుగా,ప్రతి విభాగంనుండి విద్యార్థి, మానిట్లు, తల్లిదండ్రులు ప్రతినిధులుగా ఉంటారు.

# హాస్టల్ పిల్లలు జాగ్రత్త

## బిసీ వెల్ఫేర్ సెక్రటరీకి మంత్రి సవిత ఆదేశం




**సచివాలయం, సెప్టెంబర్ 1,ప్రభాతవార్త :** భారీగా వర్షాల నేపధ్యంలో అప్రమత్తంగా ఉండాలని, బిసి సంక్షేమ హాస్టళ్ళ పిల్లలను జాగ్రత్తగా చూసుకో వాలని బిసి వెల్ఫేర్ సెక్రటరీ పోలా భాస్కర్‌ను మంత్రి సవిత ఆదేశించారు.ఈ మేరకు ఆదివారం ఫోన్‌లో వెల్ఫేర్ సెక్రటరీని మంత్రి అప్రమత్తం చేశారు.రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపధ్యంలో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు.హాస్టళ్ళను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.కాచి వడపోసి చల్లార్చిన నీటిని మాత్రమే విద్యార్థులకు ఇవ్వాలన్నారు.ఆహారం కూడా వేడిదే అందివ్వాలని మంత్రి సవిత ఆదేశించారు .ముఖ్యంగా వర్షపునీరు లీకేజి ఉన్న భవనాల నుంచి విద్యార్థులను సురక్షిత భవనంలోనికి తరలించాలన్నారు.వర్షం పూర్తిగా తగ్గిపోయిన తర్వాత ఆయా హాస్టళ్ళ నాణ్యత పరిశీలించి, సురక్షితం అనుకుంటేనే విద్యార్థు లను వెనక్కి రప్పించాలని ఆదేశించారు. విద్యా ర్థులకు జ్వరం,ఇతర అనారోగ్య లక్షణాలు కని పించగానే వైద్య సేవలు అందించాలన్నారు. వీలైతే వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని సెక్రటరీ మంత్రి ఆదేశించారు.విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం చెయొద్దని, ఇదే విషయమై జిల్లా అధి కారులను,క్షేత్రస్థాయిలో ఉన్న వార్డన్లను అప్ర మత్తం చేయాలన్నారు.అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫోన్లో సెక్రటరీ పోలా భాస్కర్‌ను మంత్రి సవిత ఆదేశించారు.

**వర్షాలపై నేతన్నలను అప్రమత్తం చేయండి**

భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని చేనేత కార్మికులను అప్రమత్తం చేయాలని చేనేత,జౌళి శాఖ కమీషనర్ రేఖారాణిని ఫోన్‌లో మంత్రి సవిత ఆదేశించారు.వర్షాలపై వాతావరణ శాఖాధికారుల రిపోర్టును ఎప్పటికప్పుడు కిందిస్థాయి అధికారులతో నేతన్నలకు తెలియజేయాలన్నారు. వరదలు,వర్షాల వల్ల ఎక్కడైనా నష్టాలుంటే తక్షణమే నివేదికలు అందించాలని కమీషనర్ రేఖారాణిని మంత్రి సవిత ఆదేశించారు.



ప్రవాస భారతీయులకు స్వాగతం పలుకుతున్న కోలా ఆనంద్, తదితరులు



రేణిగుంటలో విదేశీ విమానం

# రేణిగుంట విమానాశ్రయానికి వచ్చిన విదేశీ విమానం

## విమానంలో వచ్చిన వారికి స్వాగతం పలికిన బీజేపీ, టీడీపీ నేతలు

**రేణిగుంట, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** రేణిగుంట (తిరుపతి) విమానాశ్రయానికి ఆదివారం మధ్యాహ్నం విదేశీ నుంచి విమానం వచ్చింది. అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎక్కువ దూరం ప్రయాణించిన తొలి ప్రత్యేక విదేశీ విమానం కావడం విశేషం. ఈ విమానం బెహరీన్ నుంచి భారత కాలమానం ప్రకారం ఉదయం 7.30 గంటలకు బయలుదేరి రేణిగుంట విమానాశ్రయానికి మధ్యాహ్నం 12.11 గంటలకు చేరుకుంది. సుమారు 4.43 గంటలకు ప్రయాణంచేసి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న తొలి విదేశీ విమానంగా విమానాశ్రవర్గాలు అంటున్నాయి. విమానంలో ప్రవాస భారతీయులు రవిచంద్రన్‌పిళ్లై, ఆయన సతీమణి తో పాటు రవీంద్రపిళ్లై, రేణిగుంట చేరుకున్నారు. విమానాశ్రయంలో వారికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనందకుమార్, టీడీపీ నేత రేణిగుంట పుర ప్రముఖులు ధర్మరాజులు, ఆయన సోదరుడు గోపాలకృష్ణ(శీను) వారి మిత్ర బృందం ఘనంగా స్వాగతం పలికారు. విదేశీ విమానం రేణిగుంట విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయిందని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ మన్నె శ్రీనివాసరావు తెలిపారు. విమానం సేఫ్‌గా ల్యాండ్ అవడానికి సహకరించిన సీఐఎస్ఎఫ్, కస్టమ్స్,ఇమ్మిగ్రేషన్, గ్లోబల్ గ్రౌండ్ హాండ్లింగ్ అధికారులకు అభినందనలు తెలియజేశారు.

# 2.50లక్షల లడ్డూలే దర్శనం భక్తులు కొనుగోళ్లు

### లక్ష లడ్డూలు టోకెన్ లేకుండానే విక్రయాలు

### ప్రతి భక్తునికి తగినన్ని లడ్డూలిస్తాం

### టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చౌదరి



**తిరుమల,సెప్టెంబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం తరువాత అంతటిపవిత్రంగా భక్తులు భావించే లడ్డూప్రసాదాలు 2.50లక్షలవరకు మాత్రమే దర్శనం చేసుకున్న వాళ్లు అందుకుంటున్నారని టిటిడి ఇఒ జె. శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెల్లడించారు. మరో లక్షలడ్డూలు ఎలాంటి దర్శనం టోకెన్ లేకుండా కొనుగోలు చేస్తున్నారని గుర్తించామన్నారు. ప్రతిరోజూ 3.50లక్షల లడ్డూలు భక్తులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. సాధారణంగానే తిరుమలకు వచ్చిన ప్రతి భక్తుడు తమవెంట స్వామివారి లడ్డూప్రసాదాలను తీసుకెళ్ళి తమ కుటుంబసభ్యులకు, బంధువులకు, స్నేహితులకు పంచిపెట్టడం సంప్రదాయంగా భావిస్తున్నారని, అయితే తిరుమలకు రాకుండానే కొందరు తమ స్వప్రయోజనాల కోసం వివాహాలు, ఇతర కార్యక్రమాల్లో దేవుని ప్రసాదాలను పంచుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలా లక్ష లడ్డూలు కూడా భక్తులకు చేరేందుకు తాము నూతన ఒరవడికి శ్రీకారం చుట్టామని ఇఒ వెల్లడించారు. ఆదివారం సాయంత్రం తిరుమల అన్నమయ్య భవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ ఎస్.శ్రీధర్‌తో కలసి మీడియాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ స్వామివారి దర్శనానికి వెళ్ళని భక్తులు నేరుగా లడ్డూప్రసాదాలను కొనుగోలుచేసేందుకు వారి ఆధార్‌కార్డు ఆధారంగా ఒక్కొక్కరికి 2లడ్డూలు మాత్రమే విక్రయించాలని ఆదేశాలిచ్చామన్నారు. భక్తులు ప్రతిరోజూ కొండపైనే ఉండి లడ్డూలు తీసుకోరని, పక్కదారి పట్టకుండా భక్తులకే లడ్డూలు అందించేలా కొన్ని విధానాలు అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే దళారులు లడ్డూలను అధిక ధరలకు విక్రయించారనే ఫిర్యాదులు తమకు అందాయన్నారు. దాని ఆధారంగా లడ్డూలను దేవుని దర్శనం చేసుకున్న భక్తులకు మాత్రమే ఒక ఉచిత లడ్డూతోబాటు అదనంగా ఆరు లడ్డూలు విక్రయించేలా చూస్తున్నామని, ఈ విషయాన్ని పోటు అధికారులకు, కౌంటర్లలో పనిచేసే కార్పొరేషన్ సిబ్బందికి స్పష్టమైన సూచనలు చేశామన్నారు. లడ్డూలు దళారులు కొనుగోలుచేయకుండా, పక్కదారి పట్టకుండా ఉండేందుకు చూస్తున్నా మని, దీనిపై వస్తున్న వదంతులను నమ్మవద్దని ఇఒ విజ్ఞప్తి చేశారు. తిరుమలలోని లడ్డూ వితరణశాలలోని కౌంటర్లలో పనిచేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది భారీ సంఖ్యలో లడ్డూలు విక్రయించినట్లు టిటిడి విచారణలో గుర్తిం చామన్నారు. ప్రస్తుతం అమలుచేస్తున్న విధానం ద్వారా టిటిడి ఐటి వ్యవస్థ సహకారంతో గత మూడురోజులుగా, భక్తుల ఆధార్‌కార్డు నమో దుతో విక్రయిస్తున్న లడ్డూలు ఎవరికి ఇస్తు న్నారు, దర్శనం చేసుకోనివారు ఎన్ని లడ్డూలు తీసుకుంటున్నారు తదితర విషయాలను నమోదు చేయిస్తున్నా మన్నారు. ఇప్పటికే లడ్డూ దళారులను గుర్తించామని, సివిఎస్ఒ,పోలీసులు వారిపై నిఘా ఉంచారన్నారు. తిరుమలతోబాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న సమాచార కేంద్రాల్లో లడ్డూలు అక్కడి భక్తులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తద్వారా భక్తులు దళారీల బారినపడకుండా ఉండటానికి వీలవుతుందని ఇఒ తెలిపారు. స్వామివారిని దర్శించుకోకుండా నేరుగా లడ్డూకౌంటర్లకు వెళ్ళే భక్తులకు ఆధార్‌కార్డు ఆధారంగా రోజువారీగా రెండు లడ్డూలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

# తిరుమల సమాచారం



## 11న అనంతపద్మనాభ వ్రతం

### శాస్త్రోక్తంగా చక్రస్నానం

**తిరుమల,సెప్టెంబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ఈనెల 11వతేదీ అనంతపద్మనాభవ్రతం వైభవంగా జరగనుంది. ఇందులో భాగంగా ఆరోజు ఉదయం 6గంటలకు శ్రీవారి సుదర్శనచక్రత్తాళ్వార్‌ను ఆలయం నుండి ఊరేగింపుగా స్వామివారి పుష్కరిణి వద్దకు తీసుకొస్తారు. అక్కడ అర్చకులు శాస్త్రోక్తంగా వేద మంత్రాలతో స్నపన తిరుమంజనం అభిషేకం నిర్వహిస్తారు. ఈ వ్రతంలో భూభారాన్ని మోస్తున్న అనంతుడిని, ఆదిశేషుడిని శయ్యగా చేసుకుని పవళించి వున్న శ్రీమహావిష్ణువును పూజించడం ప్రత్యేకత.

## 18న తిరుమలలో గరుడసేవ



**తిరుమల,సెప్టెంబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో శ్రీనివాసుడికి అత్యంత కమనీయమైన, ప్రాధాన్యతవున్న గరుడవాహనసేవ 18వతేదీ బుధవారం జరగనుంది. పౌర్ణమి సందర్భంగా ఆరోజు రాత్రి 7గంటలకు ఈ గరుడవాహనసేవ మొదలవుతుంది. ప్రతి ఏడాది శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో గరుడసేవ నిర్వహించడం పరిపాటి. అయితే ప్రతినెలా పౌర్ణమికి గరుడసేవ జరుగుతుంది. ఈనెల 18వతేదీ పౌర్ణమిన గరుడసేవ నిర్వహిస్తున్నారు.

## స్వామివారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి

### ఎపి మంత్రులు శ్రీనివాస్, సంధ్యారాణి





**తిరుమల,సెప్టెంబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటే శ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని స్వామివారిని వేడుకున్నట్లు రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్, సంధ్యారాణి తెలిపారు. ఆదివారం ఉదయం కుటుంబంతో కలసి వీళ్ళు ఆలయంలోనికి చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి ఆశీస్సులతో తెలుగుప్రజలు సంతోషంగా ఉండాలి





**తిరుమల,సెప్టెంబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆశీస్సులతో తెలుగుప్రజలు సంతోషంగా వుండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు, హైకోర్టు జ్యుడీషియల్ రిజిస్ట్రార్ కమలాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌దర్శనాల సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.

అనంతరం రంగనా య కులమండపంలో వేదపండితులు వేదా శీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో సినీనటి హన్సిక



**తిరుమల,సెప్టెంబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సు లందుకున్నానని సినీనటి హన్సిక తెలిపారు. ఆదివారం ఉదయం ఆమె తిరుమలేశుని ఆలయం వద్దకు చేరుకున్నారు. ఇక్కడ టిటిడి అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు,శ్రీవారి చిత్రపటం అందజేశారు.

# రిటైనింగ్ వాల్ ఉన్నా ముంపు తప్పలేదు



ఆందోళన చేస్తున్న పేరెల్లి ఎలీషామాదిగ, తదితరులు

**విజయవాడ, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్మించిన రిటైనింగ్‌వాల్లో వున్న లోపాలవల్ల కరకట్ట ప్రాంత ప్రజల ఇళ్ళన్నీ ముంపుకు గురయ్యాయంటూ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా మాదిగ ఆరోపించారు. ఆదివారం ఆయన కృష్ణలంక కరకట్ట ప్రాంతంలో పర్యటించి అక్కడ ప్రజల వెతలు తెలుసుకుని అనంతరం ఆందోళన చేపట్టారు. ఫేజ్1ను రిటైనింగ్ వాల్ చంద్రబాబు నాయుడు చేపట్టినంతమేర బాగుందని, అనంతరం రు.125కోట్లతో 2వఫేజ్ నిర్మాణం చేసిన జగన్ ప్రభుత్వం లోపాలమయంగా నిర్మాణం చేయడంతో కరకట్ట ప్రాంతప్రజలకు వరద ముప్పు తప్పలేదని ఆరోపించారు. ఆ రిటైనింగ్ వాల్ నిర్మించిన కాంట్రాక్టర్‌పై విచారణజరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొగల్‌రాజపురంలో కొండచరియలు విరిగిపడి మృతిచెందిన వారికి రు.25లక్షలు, గాయపడిన వారికి రు.5లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. గుడ్లవల్లేరు బాలికలహాస్టల్లో హిడెన్‌కెమేరాల వివాదంపై సమగ్ర విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

వార్త

ఇచ్చింది మరచిపోవడం, పుచ్చుకున్నది జ్ఞాపకముంచుకోవడమే స్నేహం.

-మహాత్మాగాంధీ

# చర్చలుండవ్..ఇక చర్యలే!

సరిహద్దుల్లో ఉగ్రవాదం, చొరబాట్లపై ఇక చర్చ లుండవని మన విదేశాంగమంత్రి తెగేసి చెప్ప డంతో సరిహద్దుల్లో ఉద్రిక్తతలకు కంటికి కన్ను, పంటికి పన్ను విధానమే ఇక తప్పదన్న సంకేతాలు ఇచ్చినట్లయింది. పాకిస్థాన్‌లో ఉగ్రవాదం ఒక ఫ్యాక్టరీలా నడుస్తోందని, పైగా అందుకు పాక్ అంతర్ సర్వీసుల సంస్థ ఐఎస్ఐ ఇప్పటికీ ప్రోత్సహిస్తూ వారికిశిక్షణ కూడా ఇచ్చి భారత్‌లోకి పంపిస్తుందన్న ఆరోపణలు కూడా లేక పోలేదు. జమ్ముకాశ్మీర్‌లో మరో 20 రోజుల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో మన విదేశాంగ మంత్రి జైశంకర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకు న్నాయి. దీనికితోడు ఎన్నికలు రావడంతో అక్కడి ప్రాం తీయ పార్టీలుకూడా భారత్, పాకిస్థాన్‌ల మధ్య శాంతి యుత వాతావరణం ఏర్పాటుకు కృషిచేస్తామని చెప్పుకుం టున్నారు.ఎవరికి వారే సరిహద్దు ఉగ్రవాదంపై తమతమ భాష్యాలు చెప్పుకుంటూ ఓటర్లను రాబట్టుకునే ప్రయత్నా లు చేస్తున్నారు. పిడిపి అధినేత్రి మాజీ సీఎంమెహబూబా ముఫ్తీ అయితే భారత్ పాకిస్థాన్‌మధ్య దౌత్యసంబంధాలు, సంఘర్షణ పరిష్కారం, విశ్వాసం పెంపొందించే చర్యలు, ప్రాంతీయ సహకారం సాధించేందుకు కృషిచేస్తామని, వాణిజ్య, సామాజిక పరివర్తనంవైపు కూడా కృషిజరుగు తుందన్న హామీలు గుప్పించారు. మరో ప్రాంతీయ పార్టీ కాంగ్రెస్‌తో అవగాహనకు వచ్చిన నేషనల్ కాన్ఫరెన్స్ మాజీ సీఎంలు ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లాలు కూడా పాకిస్థాన్‌తో చర్చలు జరపాలని అభిలషించారు. ఈక్రమంలో విదేశాంగమంత్రి చేసిన స్పష్టమైన వ్యాఖ్యలు ప్రత్యేకించి ఈ రెండు పార్టీలకు కనువిప్పు కలిగించి ఉండాలి. ఎలాంటి సరిహద్దు ఉగ్రవాదం అయినా సరే మేం సిద్ధమని, అందుకు బాలాకోట్ సంఘటన ఒక్కటే మా సామర్థ్యానికి నిదర్శనం అని మంత్రిచేసిన స్పష్టీకరణ ఒకవిధంగా పాక్‌కు హెచ్చరికలే అని చెప్పాలి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎలాంటి సంఘటనలకు తావి వ్వకుండానే ఈ వ్యాఖ్యలు చేసినట్లుగా మనం అర్థంచేసు కోవాలి. ఉగ్రవాదాన్ని రాజ్యాధికార సాధనంగా వినియో గించే వ్యక్తులు సంస్థలతో భారత్‌దోస్తీ చేయాలనుకోవడం కేవలం భ్రమ మాత్రమేనన్నారు. భారత్ నిష్క్రియాపరం గా ఉందని భావిస్తే అది పొరపాటేనని సంఘటనలపై అవసరమైన మేరకు ప్రతిస్పందన విధిగా ఉంటుందని ఆయన చేసిన వ్యాఖ్యలు పాక్‌పాలకులకు అర్థం కానివేమీ కావు. ఇటీవలికాలంలో సరిహద్దుల్లో ఎక్కువ ఉగ్రదాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. పాకిస్థాన్‌కు సరిహద్దుల్లో ఉన్న పూంఛ్, రాజౌరి సెక్టార్లతోపాటు అనంతనాగ్ ప్రాం తాల్లో కూడా ఈ దాడులు జరుగుతున్నాయి. సరిహద్దు ల్లోనే పాక్ ఐఎస్ఐ ఈ ఉగ్రశిబిరాలకు శిక్షణ ఇచ్చి మరీ భారత్‌పైకి ఉసిగొలుపుతున్నదని నిష్కర్షగా చెప్పాల్సిన అవసరం ఉంది. లష్కరే తాయిబా, జైషేముహ్మద్ సంస్థ లు స్థానికంగానే ఉన్న యువకులను ప్రేరేపిస్తూ వారికి శిక్షణ ఇచ్చి మనపైకే ఉసిగొలుపుతున్నారు. మనకంట్లో మనవేలుతోనే పొడుచుకునే విధంగా చేయాలన్నది పాక్ కుట్ర. ఇప్పటికీ ఆ శిక్షణలున్నట్లు తెలిసిందే. అందుకుప్రత్య క్ష ఉదాహరణ వాఘా సరిహద్దువద్ద జమ్ముకాశ్మీర్ వేర్పా టువాద ఉద్యమనాయకుడు సయ్యద్ ఆలి గిలానీ ఫోటో ఉన్నపెద్దపెద్ద బ్యానర్లు ఏర్పాటుచేయడమే. గడచినరెండు నెలలుగా సరిహద్దుల్లో ముఖ్యంగా పంజాబ్, జమ్ముకాశ్మీర్ వైపునుంచే ఈ చొరబాట్లకు పాల్పడుతున్నారు. అందుకు ఇటీవల చోటుచేసుకున్న ఎదురుకాల్పులే నిదర్శనం. వీరో చితంగా ఎదుర్కొంటూ మనసైనికులు ప్రాణత్యాగాలుచేస్తు న్నారు. అదే సమయంలో విదేశీ ఉగ్రమూకలను మట్టు బెట్టడంలో కూడా మన దళాలు మడమతిప్పని పోరాటం చేస్తున్నాయి. ఇప్పటికే పాక్ చేస్తున్న కుట్రలు, చొరబాటు చర్యలను భారత్ అనేక పర్యాయాలు అంతర్జాతీయ వేది కలపై స్పందించింది. పాకిస్థాన్‌ను ఒకదశలో ఏకాకిని చే యాల్సిందేనని కూడా ప్రపంచదేశాలను కూడగట్టే ప్రయ త్నంచేసింది. అయితే ఇందుకు ఆదినుంచి కూడా మనకు మరో అనుకూల శత్రువుగా మారుతున్న చైనా మోకాలడ్డు తూ వస్తోంది. పాకిస్థాన్‌పై ఏ విధమైన ప్రతిపాదనను తెచ్చినా చైనా నేనున్నానంటూ ఆదేశానికి అభయం ఇ స్తోంది. అయినప్పటికీ కూడా మెజార్టీ దేశాల మద్దతును కూడగట్టుకోగలిగాం. ఇటీవలికాలంలో జరిగిన పరిణామా ల నేపథ్యంలోనే పాకిస్థాన్‌తో ఇక చర్చల శకం ముగిసిం దని, ఎలాంటి చర్యకైనా భారత్ సిద్ధంగానే ఉందని నర్మ గర్భంగా విదేశాంగమంత్రి చేసిన వ్యాఖ్యలు ఆదేశానికి ఇప్పటికైనా తెలిసుండాలి. జమ్ముకాశ్మీర్‌లో సరిహద్దు వివా దాలతో పాకిస్థాన్‌తో భారత్ సంబంధం అస్థిరంగా ఉన్న మాట నిజమే. ద్వైపాక్షిక, అంతర్జాతీయ వేదికల్లో సీమాం తర ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతిస్తోందని, ఆర్థిక, రవాణా మద్దతులపైనా, నిధులసాయంపైనా భారత్ పదేపదే అంత ర్జాతీయ వేదికలపై లేవనెత్తింది. గత మార్చిలో విదేశాంగ మంత్రి తన సింగపూర్ పర్యటనల్లో కూడా ఉగ్రవాదకార్య కలాపాలకు పాకిస్థాన్ ఇంచుమించుగా పరిశ్రమస్థాయిలో ప్రోత్సహిస్తోందని, అందువల్లనే ఉగ్రవాదంపై ఎలాంటి ఉపేక్షణాత్మక వైఖరి ఉండదనికూడా మంత్రి వెల్లడించా రు. భారత్‌లో పుల్వామా వద్ద జరిగిన 19 మందిని బలి గొన్న సైనికుల దాడిఫలితంగా భారత్ నిర్వహించినమెరు పుదాడుల్లో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌పరిధిలో ఉగ్రశిబిరాలను ధ్వంసం చేసిన సంఘటనలతో పాకిస్థాన్ ఒకవిధంగా మెత్తబడినా మళ్లీ ఇటీవలి కాలంలో తన ఐఎస్ఐని ఉత్తే జపరిచినట్లు ఇటీవలి సంఘటనలు తేటతెల్లంచేస్తున్నాయి. అయితే భారత్‌ను తక్కువగా అంచనావేసుకుంటున్న పాకి స్థాన్ అందుకు భారీమూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కూడా గుర్తించకపోతే తన మిత్రులు కూడా తనను ఆదు కోలేని స్థితిని తెచ్చుకుంటుందని నిర్ద్వందంగా చెప్పగలం.



ఈ ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. అయితే అందుకు అవలంబించే విధానం లోపభూయిష్టంగా ఉండరాదు.

ఎల్లెన్ గ్లాస్గో



తమలో తమకు అభిప్రాయ బేధాలున్నాయనుకోండి ఆ ఇంట్లో వాళ్లు ఒకటిగా ఉండలేరు.

అబ్రహం లింకన్

# యువత భవిష్యత్తుకు కార్యాచరణ ఎక్కడ?

**రాష్ట్ర యువకుల యువశక్తిని రాష్ట్ర పరిస్థితుల్లో భాగస్వాములను చేయాలంటే, ద్వితీయ శ్రేణినగరాల్లో సైతం అంకుర పరిశ్రమలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ ఔత్సాహికులైన యువకులకు ప్రోత్సాహాన్ని, సహాయ సహకారాలను అందించినట్ల యితే రాష్ట్ర రూపురేఖలతోపాటు, ఈ ప్రాంత ప్రతిబిడ్డ ఆర్థికంగా, సామాజికంగా ముందుకుపోవడానికి ఆస్కారం ఉంటుంది. దాదాపుగా అరకోటికి దగ్గరగా చేరుకుంటున్న నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు, ప్రైవేట్, స్వయం ఉపాధిపై స్పష్టమైన విధానాన్ని గనుక అమల్లోకి తెచ్చినట్లయితే, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించి, ప్రజలు సుఖసంతోషాలను పొందడానికి ఆస్కారం ఉంది.**

చిట్టెడ్డి కృష్ణారెడ్డి

గత రెండు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల యువకులు ఉపాధి కోసం, నాణ్యమైన జీవన విధానం కోసం ఎదు రుచూపులు చూస్తూనే ఉన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ అనేక అవస్థలు పడుతూ డిగ్రీలు పొందినప్ప టికీ వారి భవిష్యత్తుకు దారిచూపే మార్గాలు లేకపోవడంతో యువత నిరాశ నిస్పృహలకు, మానసిక ఆందోళనకు నిరం తరం గురవుతున్నారు. లక్షలసంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ రాష్ట్ర ఆర్థిక ఖజానాను సమతుల్యత విధానంలో ఖర్చు చేయడంలో విఫలమై, ఉద్యోగాలు భర్తీ చేస్తే జీతాలకునిధుల కొరత ఏర్పడుతుందని భయం కూడా ప్రభుత్వానికి ఉన్నట్టు కనిపిస్తుంది. కానీ యువశక్తిని రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకునే విధంగా ఉపాధి కార్యక్రమా లకు శ్రీకారం చుట్టి యువతకు ప్రోత్సాహాన్ని ఇచ్చినట్లయితే నిరుద్యోగ సమస్య పరిష్కరించడమే కాకుండా రాష్ట్రం సర్వ తో ముఖాభివృద్ధికి మెరుగైన అవకాశాలుండేవి. నేడు నిరు ద్యోగులు కథనరంగమై పల్లెపల్లెనా, పట్టణాలలో ఉద్యమిస్తు న్నప్పటికీ, వాటికి రాజకీయ రంగు పులిమి నిరుద్యోగ సమ స్యను చాలా తేలికగా, పక్కదారి పట్టిస్తున్నారు. గత రెండు దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్రంలోనూ నిరుద్యోగులు కదం తొక్కినా తగిన ఫలితం దక్కలేదు. నేడు స్వరాష్ట్రంలో సైతం అదే పరిస్థితి దాదాపుగా ఉండటం నిరుద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ రెండు దశాబ్దకాలంలో ఉన్న త చదువులు చదివిన మొదటితరం యువకులు, సరైన ఉపాధి లభించకపోవడంతో, విద్యావ్యవస్థపైనే ప్రతికూల అభిప్రాయాన్ని ఏర్పరచుకునే ప్రమాదం కనబడుతోంది. అంతేకాకుండా రాబోయే తరాలు కూడా ఉన్నత విద్యలను చదవడానికి ఆసక్తి చూపించకుండా వెనుకబడిపోయే పెను ప్రమాదం సైతం లేకపోలేదు. కావున ఉపాధి కల్పన కోసం ప్రభుత్వ ఉద్యోగుల క్యాలెండర్‌తోపాటు ప్రైవేట్ ఉద్యోగాల కల్పన విషయంలోనూ, స్వయం ఉపాధి కల్పన విషయం లోనూ, ఒక దీర్ఘదర్శిని ప్రణాళికను ప్రజలముందు అత్యంత వేగంగా తీసుకురావాల్సిన అవసరం ప్రభుత్వంపైన ఉంది. నిరుద్యోగ యువత కేవలం పట్టణాల్లోనే కాకుండా గ్రామా ల్లో సైతం భారీ సంఖ్యలో ఉన్నారు. వారందరికీ మార్కెట్ అనుగుణంగా స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేసి వ్యాపార రంగంలో భాగస్వామ్యమయ్యే విధంగా సహా య సహకారాలు అందించినట్లయితే ఉపాధి అవకాశాలు చాలా మెరుగుపడతాయి. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో కొత్త రాష్ట్రం అనేక సవాళ్లు అనే వాదంతో, నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపించడం వాయిదా వేయడం జరిగింది. ఆ తర్వాత సైతం జిల్లాల పునర్విభజన ద్వారా ఈ ప్రాంత వాసులకు, పాత ఉద్యోగులతోపాటు మరికొన్ని కొత్త ఉద్యోగ అవకాశాలు కలుగుతాయి అన్న ఆనందంతో ఉద్యోగుల కోసం ఎదురుచూసే పరిస్థితిఉంది. కానీ ఆ తర్వాత కాలంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ఒకవైపు, న్యాయ పరమైన చిక్కులు మరోవైపు ఎదురుకావడంతో, నిరుద్యోగు ల బతుకులు ఛిద్రం అయ్యాయి. గత పాలకుల వైఖరిపై విరక్తితో ప్రత్యామ్నాయ నాయకత్వానికి మద్దతు తెలిపి, కొత్త ప్రభుత్వానికి అవకాశం ఇచ్చి, నేడు అది కొలువుదీరిన ప్పటి కీ, ఆ నిరుద్యోగులకు నేటికీ సరైన భరోసా లేక ఆందోళన పడుతున్నవైనం నేడు కళ్లముందు కనబడుతోంది. నిరుద్యోగ సమస్యను ముందుండి నడిపించే నాయకులకు రాజకీయ ఉద్యోగాలు వచ్చాయి. కానీ నిరుద్యోగులకుమాత్రం ఉద్యో గాలు రాకపోవడం చాలాబాధాకరం. అన్నిరాజకీయ పక్షాలు గత రెండుదశాబ్దాలుగా నిరుద్యోగుల సమస్యను రాజకీయంచేసి, పాలకపక్షంపై వ్యతిరేక వైఖరిని తీసుకువచ్చి, లబ్ధిపొం దడానికి మాత్రమే చేసినట్టుగా ఆ పోరాటాల



ఫలితాలు కని పిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు గరిష్ఠంగా దాదాపుగా రెండు లక్షలమందికి మాత్రమే ఉపాధిని కల్పించ గలవు అనేది కఠోరమైన వాస్తవం. కానీ నేడు దాదాపుగా 35నుంచి 40లక్షలపైగా నిరుద్యోగులు ఉపాధికోసం ఎదు రుచూస్తున్న వైనం కళ్లముందు కనబడుతోంది. ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే జీవితాలకు భరోసానివ్వగలుగుతాయని నమ్మకాన్ని బలంగా నాటుతూ, లక్షలాది మంది యువకుల యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలను ఎప్పటికప్పుడు భర్తీచేస్తూ, ఉద్యోగాలు కల్పించడంతోపాటు, మిగిలిన లక్షలాది మందికి స్వయం ఉపాధితో, వ్యవస్థాపకు లుగా మారడానికి అవసరమైన సహాయ సహకారాలను పెద్దఎత్తున అందించాల్సిన అవసరం ఉంది. వ్యవస్థాపకులు గా కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టడానికి, ఆలోచనలకు అంకురార్పణ చేయడానికి, అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చడంలోనూ, అవగాహన, ప్రోత్సాహకాలను అం దించడంలో ప్రభుత్వానికి స్పష్టమైన ఆలోచన కానీ, ఒక విధానం కానీ లేకపోవడం చాలా బాధాకరం. నిరుద్యోగులు నేడు ఉద్యోగాల క్యాలెండర్ను విడుదల చేసి ఒక స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని కోరుతున్నప్పటికీ పాలకపక్షం ఇది ఒక రాజకీయమైనా సమస్యగానే చూడటం వల్ల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతుంది. రెండు దశాబ్దాల కాలంలో యువత వయసు కొవ్వొత్తిలా కరిగిపోతూ ఆనాటి యువకులు, నేడు మధ్యవయసు దాటి, నిరాశ నిస్పృహల తో చాలీచాలని బతుకులను వెళ్లదీస్తూ కడు దయనీయ పరిస్థితిని ఎదుర్కోవడానికి, రాజకీయ పరిస్థితులే కారణాలు అనటంలో ఎటువంటి సందేహం లేదు. ప్రభుత్వ ఉద్యోగా లకు సంబంధించి ఆచరణ యోగ్యమైన క్యాలెండర్‌ని యువ తకు అందిస్తూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం వివిధ రంగాలలో అవలంబించే విధంగా, అవస రమైన కోర్సులను అభివృద్ధి చేసి, చిన్న నగరాలలో సైతం శిక్షణ తరగతులను నిరుద్యోగ యువతకు అందించే విధంగా కార్యక్రమాలను చేయవలసిన అవసరం ఉంది. తదనుగుణం గా రాష్ట్ర యువశక్తికి అపారమైన నైపుణ్యాలనుపెంపొందిస్తూ యువకులను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దడానికి హైదరా బాద్ నగరంలో టీ హబ్, మహిళలను వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దడానికి 'వీ హబ్' లాంటి వాటికి అత్యధిక ప్రాధాన్య తనిస్తూ నిరుద్యోగ యువకులలో అవగాహన కల్పిస్తూ, వారి ఆలోచనలకు పదును పెట్టుకోవడానికి పెద్దఎత్తున సహకా రాన్ని అందించినట్లయితే, నిరుద్యోగ సమస్య తీరడమే కా కుండా రాష్ట్ర ప్రగతిలో కీలకపాత్ర పోషించడానికి అవకాశం ఉంటుంది. రాష్ట్రంతో ప్రతి ద్వితీయశ్రేణి నగరాలలో సైతం వ్యవసాయ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలలో శిక్షణ కేం ద్రాలను పెద్దఎత్తున ఏర్పాటు చేయవలసిన అవసరంఉంది. అదే విధంగా మార్కెట్లో ఉపాధి అవకాశాలను కల్పించగలిగే కోర్సులను గుర్తించి పల్లెల్లో ఉన్న నిరుద్యోగులకు సైతం శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసి మెరుగైన జీవితాన్ని పొందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు చేయాల్సిన అవసరం ఉంది. ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడానికి రాష్ట్రంలోని మేధావులతోపాటు, దేశంలోని వివిధ రంగ ప్రముఖులతో మేధోమథనం ఏర్పాటుచేసి శీఘ్రమే కార్యాచ రణను ప్రకటించినట్లయితే నిరుద్యోగ సమస్య సద్దుమనగ డమే కాకుండా ప్రజాశ్రేయస్సు మెరుగుపడుతుంది అనటం లో సందేహం లేదు. కానీ నిరుద్యోగం సమస్య కేవలం ప్రభుత్వ ఉద్యోగుల కోసం మాత్రమే చేస్తున్న పోరాటంగా చిత్రీకరించడం ఒక పెద్ద కుట్రగా భావించాల్సిన అవసరం ఉంది. ఈ కుట్రలోనే నిరుద్యోగులు చిక్కినట్టుగా కనబడు తోంది. నేడు ప్రతి చిన్న, పెద్ద పట్టణాలలో సైతం కోచింగ్ ఇన్స్టిట్యూట్లో శిక్షణ పేరుతో వేలకు వేలు ఫీజులు వసూలు చేయడం జరుగుతుంది. ప్రైవేట్ శిక్షణాసంస్థలు చాలా వరకు ఎటువంటి అనుమతులు లేకుండా నడుపుతున్నప్పటికీ ప్రభుత్వం చూసి చూడనట్టు వదిలివేయడంతో నిరుద్యోగులు ఆర్థికంగా ఎంతో ఇబ్బందులపాలవుతున్నారు. రాష్ట్ర యువ కుల యువశక్తిని రాష్ట్ర పరిస్థితుల్లో భాగస్వాములను చేయా లంటే, ద్వితీయ శ్రేణినగరాల్లో సైతం అంకుర పరిశ్రమలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ ఔత్సాహికులైన యువకు లకు ప్రోత్సాహాన్ని, సహాయ సహకారాలను అందించినట్ల యితే రాష్ట్ర రూపురేఖలతోపాటు, ఈ ప్రాంత ప్రతిబిడ్డ ఆర్థికంగా, సామాజికంగా ముందుకుపోవడానికి ఆస్కారం ఉంటుంది. దాదాపుగా అరకోటికి దగ్గరగా చేరుకుంటున్న నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు, ప్రైవేట్, స్వయం ఉపాధిపై స్పష్టమైన విధానాన్ని గనుక అమల్లోకి తెచ్చినట్ల యితే, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించి, ప్రజలు సుఖసంతోషాలను పొందడానికి ఆస్కారం ఉంది. ●

# ఆహారపు అలవాట్లే ప్రజారోగ్య ప్రదాతలు!

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

దేశ ప్రధాన సమస్యలో పేదరికం, అధిక జనాభా, అ విద్య, ప్రజారోగ్యం, ఆర్థిక, సామాజిక అసమానతలు లాంటి పలు సమస్యలతోపాటు ఆహార అభద్రత సంక్షోభం అనాదిగా వెంటాడుతున్నాయి. నేడు ఆహార భద్రత సాధన లో కొంత మెరుగైన ఫలితాలను సాధించిన భారతంలో పోషకాహార భద్రత మాత్రం అందని ద్రాక్షే అవుతున్నది. ముఖ్యంగా పోషకాహార లోప విషవలయంలో చిక్కిన బాల భారతం రాబోయే నవతరానికి ప్రమాద ఘంటికలు మోగి స్తున్నది. ఆహార లభ్యతతో ఆరోగ్యం సిద్ధించదని, పోషకా హార లభ్యతే సమాజ ఆరోగ్యానికి సంరక్షణ గొడుగుగా ఉపకరిస్తుందని మనకు తెలుసు. పోషకాహారంతోనే ఆరోగ్య వంతమైన సమాజం నిర్మింపబడుతుందని, పోషకాహార ప్రయోజనాలను అన్నివర్గాల ప్రజలకు వివరించడానికికేంద్ర, మహిళ, శిశుఅభివృద్ధి మంత్రిత్వశాఖ ఫుడ్అండ్ న్యూట్రిషన్ బోర్డు సౌజన్యంతో 1982 నుంచి ప్రతి యేటా సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు 'జాతీయ పోషకాహార వారోత్స వాలు (నేషనల్ న్యూట్రిషన్ వీక్) నిర్వహించడం ఆనవాయి తీగా మారింది. సెప్టెంబర్ మాసాన్ని 'జాతీయ పోషకాహార మాసం'గా కూడా పాటిస్తూ భవిష్యత్తుకు ఇంధనం అనే అంశాన్ని తీసుకుని ప్రచారం చేయడం జరుగుతున్నది. జాతీయ పోషకాహార వారోత్సవాలు 2024 'ప్రారంభం నుంచే సరైన పోషకాహారం అందిద్దాం (ఫీడింగ్ స్మార్ట్ రైట్ ఫ్రమ్ స్టార్ట్) అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పి స్తున్నారు. ప్రజారోగ్యసాధనకు పునాది పోషకాహారమే. పోష కాహారం తీసుకోవడంతో గుండెజబ్బులు, గుండెపోటు, మధు మేహం, కేన్సర్ లాంటి జబ్బులు దూరం అవడమే కాకుం డా సంపూర్ణ మానసిక శారీరకంగా కూడా సిద్ధిస్తుంది. ఇండి యాలో ఐదేళ్లలోపు బాలల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు దీర్ఘ కాలం పాటు పోషకాహార కొరల్లోచిక్కి శరీరక ఎదుగుదల లోపంతో బాధపడుతున్నట్లు తెలుస్తున్నది. పోషకాహార లోపం, పేదరికం, అవిద్య, సురక్షిత నీటి కొరత, పరిసరాల





అశుభ్రత లాంటి సమస్యల కారణంగా బాలల శారీరక, మానసిక ఎదుగుదల కుంటుపడుతున్నది. సాధారణ ప్రజ లతోపాటు మహిళలు, గర్భిణీలు, కుటుంబ పెద్దలు, నిరక్ష రాస్యులు వంటి వర్గాలతోపాటు పోషకాహార లోపం పట్ల విద్యాలయాల్లో తప్పనిసరిగా అవగాహనలు కల్పించాలి. పోషకాహార అంశాలను పాఠ్యాంశాల్లోచేర్చడం ఎంతో మేలు ను చేస్తుంది. ప్రజల, స్వచ్ఛంద సంస్థలు, పౌర సంఘాలు, ప్రభుత్వ శాఖలు, ప్రజారోగ్యవ్యవస్థల సమన్వయంతో పోష కాహార ప్రయోజనాలను గ్రామీణ స్థాయికి చేర్చడంజరగాలి. సమతుల పోషకాహారంలో ఎదుగుదలకు అవసరమైన పిండి పదార్థాలు, ఒమెగా–3 కొవ్వులు, మాంసకృత్తులు, నీరు, విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు లాంటివి తప్పనిసరిగా సరైన పాళ్లలో అవసరం అవుతాయి. ఈ పదా ర్థాలు సమపాళ్లలో ఉన్న ఆహారాన్ని మాత్రమే 'సమతుల ఆహారంగా పిలుస్తారు. బాలల్లో వయసుకు తగిన పొడవు, చురుకుదనం, శక్తికలిగి ఉండడానికి పోషకాహారం దోహదప డుతుంది. వ్యాధినిరోధక శక్తిసమకూరడం, మానసిక స్థితు ల్లో సమతుల్యత, జీవితకాలం పెరగడం, దీర్ఘకాలిక జబ్బు లకు దూరంగా ఉండటం, క్రియాశీలత పెరగడం, వృత్తిలో సాఫల్యతలు, ఏకాగ్రత పెరగడం, ఎల్లవేళల ఆరోగ్యం సిద్ధిం చడం, సంపూర్ణ ఆరోగ్యంతో ఆర్థిక చిక్కులు దూరంకావడం, దేశాభివృద్ధిలో పాలుపంచుకోవడం లాంటి పలు పోషకాహార ప్రయోజనాలు కలుగుతాయని తెలుసుకోవాలి. జాతీయ పోష కాహార వారోత్సవాల వేదికగా పోషకాహార ప్రయోజనాలను సామాన్యులకు అవగాహన పరచడానికి పలు సభలు, సమా వేశాలు, సదస్సులు లాంటివి నిర్వహిస్తున్నారు. అన్నిరకాల పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, అతిగాపాలిష్ చేయని బియ్యం, గోధుమలు, డ్రైఫ్రూట్స్, ఓట్స్, కీరదోసకాయలు ఇలా వివిధ రకాల పోషకాహారాలను తీసుకోవడానికి ప్రయ త్నాలను చేయాలని సూచిస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్స్, నిల్వ ఉంచిన ప్యాకెట్ ఫుడ్స్, శీతలపానీయాలు, నూనెలో ఫ్రై చేసిన పదార్థాలు, కొవ్వులు తక్కువగా ఉన్న ఆహారం, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించాలి. బాలలు, గర్భిణులు, శిశువులకు పోషకాహారం అందిస్తే ఆరోగ్యకర భవిత నిర్మితమవుతుందని నమ్ముదాం. ●

# ప్రజావాక్కు



## ధరలను నియంత్రించాలి

గత రెండు, మూడు నెలలనుండి మార్కెట్‌లో నిత్యావసర వస్తువులు ప్రత్యేకంగా కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. మార్కెట్‌కి పోయి సంచిలో ఒక పావు భాగం కొనే విధంగా ఉంటున్నాయి. తక్కువధరకు లభించే కూర గాయలే లేవు. దీనితో ఉల్లి, అల్లం ధర ఇంకా తగ్గలేదు. వ్యాపారులు నాసిరకం కూరగాయలకు కూడా అదే ధర చెప్తున్నారు. ఉద్యోగులకే ఇది భారంగా ఉన్నప్పుడు స్వల్ప జీతగాళ్లు ఏవిధంగా పోషకాహారం తినగలరు. పెరిగిన ధరలతోజీవితంగడపలేకఅప్పులుచేయడంతప్పడం లేదు. ధరలనియంత్రణ, కూరగాయలసాగు, రైతులకు ప్రోత్సా హం కలిగించడం అవసరం. మార్కెట్‌లో రోజూ అమ్మే ధరలపై స్థానిక మున్సిపల్ మార్కెట్ కమిటీ పూర్తి నిఘా తప్పనిసరిపెట్టాలి. వీటివల్ల కొంతైనామంచి జరుగుతుంది.

-బి. మేఘనాథం, విశాఖపట్నం

## టీచర్లను ఆరోగ్య పథకంలో చేర్చాలి

ఎపి మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్లను ఎన్టీఆర్ ఉద్యోగి ఆరోగ్య పథకం, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పథకంలో చేర్చాలి. హెల్త్‌కార్డులు అందించడం ద్వారాఅవసరమైన వైద్య సేవలు పొందేందుకు ప్రభుత్వం ఇచ్చిన 010పద్దు ప్రక్రియ నుపూర్తి చేసి అమలు చేయాలి. ఎపిజిఎల్ఐ గ్రూపు ఇన్సూ రెన్స్‌ను ప్రభుత్వం వర్తింపచేసే చర్యలు పూర్తి చేయాలి.

-బి.సురేష్, శ్రీకాకుళంజిల్లా

## వ్యవసాయరంగానికి తోడ్పాటు ఇవ్వాలి

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ రంగం వెన్నెముక వంటిది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందినట్లయితే దేశ ఆర్థిక వ్యవస్థ మూడు పువ్వులు, ఆరు కాయలుగా ముందుకు సాగుతుంది. దేశ జనాభాలో 45 శాతం మం దికిపైగా ప్రజానీకంనేటికి జీవనోపాధి కోసం వ్యవసాయం పైనే ఆధారపడుతున్నారు. అందుకు భిన్నంగా దేశంలో వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోయింది. ఇం దుకోసం దేశంలో రైతురాజ్యం నెలకొల్పేందుకు చిత్తశుద్ధి తో కృషి జరగాలి. ఇందుకోసం అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయశాస్త్రనిపుణులతో సమాలోచనలు చేసి, రైతు ప్రయోజనాలను పరిరక్షించే, వ్యవసాయాన్ని లాభసాటి చేసే నిర్దిష్ట కార్యక్రమాన్ని రూపొందించాలి. దాన్ని చిత్తశుద్ధితో అమలు చేయడానికి జిల్లావారీ యం త్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ప్లాస్టిక్‌పై నిషేధం అమలయ్యేదెప్పుడు?

వాతావరణానికి, పర్యావరణానికి ప్లాస్టిక్ చేస్తున్న హాని మాట లతో చెప్పడం సాధ్యంకాదు. మానవాళితో పాటు భూమి మీద సమస్త జీవరాశి భవిష్యత్‌ను ఇది సవాల్ చేస్తోంది అని ఐక్య రాజ్యసమితి రెండు దశాబ్దాలక్రితమే మానవాళిని హెచ్చరించిం ది. అయినా ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించేందుకు ప్రపంచ దేశాలు చేపడుతున్న చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఒట్టావాలో గతవారం ప్లాస్టిక్ వినియోగంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఎలాంటి కార్యాచరణ పథకంపై ఉమ్మడి కార్యాచరణ కుదరలేదు. 192 దేశాలకు చెందిన ప్రతినిధులు వారంరోజులపాటు సమావేశమై సుదీర్ఘంగా జరిపిన చర్చల్లో ప్లాస్టిక్ నిషేధం గురించి కాదు కదా, కనీసం ఉత్పత్తులపై పరిమితంగా ఆంక్షలు విధించే విష యంలోనూ ఏకాభిప్రాయం కుదరలేదు. దానితో ఈ సమ స్యపై ప్రపంచ దేశాలన్నీ ఉత్తుత్తిపై కబుర్లే అని తేటతెల్లమైపోయింది.

- కె.సిద్విక్, పాల్వంచ

## అవినీతి అరికట్టలేమా?

రాష్ట్రంలో అనేకసంఘటనల్లో అత్యున్నత అధికార స్థాయిలో ఉన్నవారుఅవినీతి అభియోగాలపై సిబిఐకి చిక్కారు. వారికి దొర క్కుండా ఇంత కన్నా అవినీతిపరులు ఉన్నారు. దీనికి మూల కారణం విపరీతమైన వస్తువులు, ఆస్తి, హోదా. తోటి స్వార్థపరు లతో పోలిక చేసుకోవడం, పరిపాలనలో అన్ని స్థాయిలలో పారదర్శకత లోపించడం, రుజువైన వాటికి శిక్ష పడిన, ధనం వెచ్చించివాటి నుండి తప్పుకునే అతితెలివి. జీవితంలో మనం ఏమి చేస్తే సమాజానికి కొంతైనా మేలుకలుగుతుందో అది కొరవడి దానికి భిన్నంగా ధనార్జనే ఆశయంగా ప్రతి పని విజ్ఞత కోల్పోయి వ్యవహరించడమే ఇందుకు కారణం.

-ఎన్. రాజు, హైదరాబాద్

## రోడ్ల ఆక్రమణలను అరికట్టాలి

మున్సిపల్ పట్టణాలలో ప్రధాన రోడ్లకు ఇరుపక్కల పండ్ల వ్యాపారులు, ఇతర చిరుత వ్యాపారులు వ్యాపారాలు నిర్వహి స్తూ తీవ్రమైన ట్రాఫిక్ సమస్యకు కారమణమవుతూ ఉన్నారు. ఇదిలా ఉంటే గృహాల యజమానులు కొందరు రోడ్ల వెంటనే తాగునీటి నల్లాగుంటలు, సంపులునిర్మిస్తున్నారు. మరికొందరు రోడ్ల వెంటకార్లు నిలుపుతుండడంతో రోడ్ల విస్తీర్ణం తగ్గి తీవ్ర మైన ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. రోడ్ల విస్తీర్ణం తక్కువగా ఉన్నచోట్ల రోడ్డుపక్కల కార్ల షెడ్లునిర్మించకూడదు.

-ఎన్.రామకృష్ణ, హైదరాబాద్

**ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail: editpage@vaartha.com

# సంకీర్ణ సవాళ్లతో సతమతమవుతున్న మోడీ?

సట్ల మురళీకృష్ణ

సువిశాల భారతదేశానికి నరేంద్రమోడీ ముచ్చటగా మూడవసారి భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టి మొదటి వంద రోజుల పాలనకు దగ్గరవుతున్నారు. మూడు నెలల క్రితం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్నో ఎదురు దెబ్బలు, శరాఘాతాల మధ్య నరేంద్ర మోడీ భారత ప్రధా నిగా జూన్ 9న పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో మాదిరి కాకుండా ప్రస్తుతం ఆయన సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్నారు. ఎన్నికలకు ముందు నాలుగు వందల స్థానాలను అలఓకగా సాధిస్తామని విస్పష్టంగా ప్రక టించిన నరేంద్రమోడీ, ఎన్నికల ప్రచారంలో లక్ష్యసాధన కోసం బహుముఖ ప్రజ్ఞ కనపరిచి, అహోరాత్రులు శ్రమించి నా ప్రజలు ఆయనను సంకీర్ణ ప్రభుత్వానికే పరిమితం చేశా రు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగా, ఆయన పాలన సంతోషంగా ఏకపక్షంగా సాగడం లేదన్నది ఆయనకు స్వల్ప కాలంలోనే తెలిసి వచ్చింది. అందుకు ఉదాహరణ ఇటీవల జరిగిన కేంద్రప్రభుత్వ నియామకాల్లో 45 జాయింట్ సెక్రె టరీలు, డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లను నియమించేందుకు కేంద్రప్రభుత్వం యుపిఎస్సీ ద్వారా ఉద్యోగ ప్రకటన విడు దల చేసింది. మూడు రోజుల్లోనే ప్రకటనను వెనక్కి తీసుకో వడం వెనుక మిత్రపక్షాల ఒత్తిడి కీలకంగా మారింది. కేంద్ర మంత్రిత్వశాఖలో మధ్యస్థాయి నియామకాలకు సంబంధించి సివిల్ సర్వీస్ అధికారులను కాకుండా బయట నుంచి వ్యక్తు లను నియమించుకునేందుకు యుపిఎస్సీ ప్రకటన విడుదల చేయడమే దానికి ప్రధాన కారణం. ప్రధాని నిర్ణయాన్ని ఎన్డీయే మిత్రపక్షాలు తప్పుపట్టాయి. జనతాదళ్ (యు) లోక్ జనశక్తి (రామ్ విలాస్ పాశ్వాన్) పార్టీలు కేంద్ర సర్కారుపై అసంతృప్తిని వ్యక్తంచేసి ప్రకటన వెనక్కి తీసుకునేలా ఒత్తిడి చేశాయి. ఈ నియామకాల ప్రకటన రాజ్యాంగం కల్పించిన దళితుల, ఓబిసి ఆదివాసుల రిజర్వేషన్ల హక్కులను కాల రాయడమేనని అసంతృప్తిని వ్యక్తం చేశాయి. మిత్రపక్షాలతో ఓటు విపక్షాల ఒత్తిడికి తలొగ్గిన కేంద్రప్రభుత్వం మూడు రోజుల్లోనే యూపిఎస్సీ ద్వారా విడుదల చేసిన ప్రకటన వెనక్కి తీసుకుంది. గతంలో పది సంవత్సరాలు ప్రధాని విధాన నిర్ణయాల విషయంలో అధ్యక్ష తరహా విధానాలకు సరిసమానంగా వ్యవహరించి తన ఇష్టానుసారం పాలన చేశారు. ప్రస్తుతానికి ఉద్యోగుల ప్రకటన వెనక్కి తీసుకోవ డం కేంద్ర ప్రభుత్వానికి చేదు అనుభవమే. ఇప్పుడు ఆయన ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సాధ్యం కాదని ఈ ఉదాంతం చెప్పకనే చెప్పినట్లయింది. ఇకపై ప్రతి విధానపర మైన నిర్ణయాల్లో ఆయన సంకీర్ణ ధర్మాన్ని పాటించాల్సి ఉంటుందని తెలిసి వచ్చింది. గతంలో మాదిరి కాకుండా పరిస్థితి ఇప్పుడు పూర్తి భిన్నంగా మారిందని ప్రధాని ఇప్ప టికే గ్రహించి ఉంటారు. చూద్దాంలే అనుకున్న ఉద్యోగ ప్రకటనకు అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఆయన వెనక్కి తగ్గక తప్పలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన తన స్వీయ వ్యవహారన తీరులో మార్పులు చేసుకోవడం అనివార్యంగా కనిపిస్తోంది. మున్ముందు ప్రధాన మంత్రి మిత్రపక్షాలను పరిగణనలోకి తీసుకొని ముందుకు సాగడం ఆయన నైజా నికి విరుద్ధమే అయినప్పటికీ, రాజీమార్గంలో ప్రయాణించా ల్సిన పరిస్థితులు ఎప్పటికప్పుడు ఏర్పడుతున్నాయి. ప్రస్తు తం ఉత్తర భారతదేశం ఓటర్లు మతంకంటే పౌర సమస్య లకే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చినట్లు ఇటీవలి పార్లమెంటు ఎన్నికల్లో ఆపార్టీకి బోధపడింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే వివాదాస్పదంగా మారిన కాశీ, మధుర అంశాలను ప్రస్తుతా నికి కేంద్ర ప్రభుత్వం అటకెక్కించే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. మతపరమైన విషయాలకు కాకుండా వాటి స్థానంలో రాజకీయ ఆర్థిక, అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల ని ఎన్డీయే మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్ర బాబు సూటిగానే చెప్పినట్లు ఢిల్లీ సెంట్రల్ హాల్లో గుసగుస లు వినిపిస్తున్నాయి. 2023లో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఎన్ని కల్లో బిజెపితో పొత్తుపెట్టుకున్న చంద్రబాబు ముస్లిం ప్రయో జనాలకు వ్యతిరేకంగా తమ పార్టీ ఎటువంటి నిర్ణయాన్ని తీసుకోబోదని ముస్లింలకు హామీ ఇచ్చి తమవైపు తిప్పుకు న్నారు. ఈ నేపథ్యంలో బిజెపి మత రాజకీయాలను ముఖ్య మంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంతమాత్రం మత రాజకీయాలను సమర్థించరనికళ్లముందు కనపడుతున్న కఠినవాస్తవం. అటు ఉత్తర భారతదేశం ఓటర్ల మైండ్ సెట్ మారి, హిందుత్వానికంటే పౌర సమస్యలకే ప్రాధాన్యత నివ్వటం, ఇటు మత రాజకీయాలను ప్రోత్స హించని మిత్రపక్షాల మద్దతు ప్రభుత్వ మనుగడకు కీలకం కావడంతో మోడీ ప్రభుత్వం ఐదుసంవత్సరాలు హిందుత్వా న్ని అంటి అంటనట్లు వాడుకోవడం మినహా మరొక గత్యం తరం లేదు. సంకీర్ణ ప్రభుత్వానికి మొదటిసారి నాయకత్వం వహిస్తున్న ప్రధాని బేషజాలకు పోకుండా ఒక్కసారి గతం లోకి వెళ్లి 1989నుండి 2014వరకు జరిగిన సంకీర్ణ ప్రభు త్వాలను మననం చేసుకుంటే మంచిది. అందులో ముఖ్యం గా పివి నరసింహారావు, అటల్‌బిహారీ వాజ్‌పేయి, మన్మో హన్ సింగ్ ప్రభుత్వాలు సంకీర్ణధర్మాన్ని పాటిస్తూ దేశాభి వృద్ధికి ఏవిధంగా కృషిచేశాయో అర్థంచేసుకోవచ్చు. ముఖ్యం గా పివి నరసింహారావు ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలు చేపట్టి సాహసోపేతమైన నిర్ణయాలతో దేశ ఆర్థిక రంగాన్ని పరుగులు పెట్టించారు. ప్రధాని సైతం మత విద్వేషాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా పౌర సమస్యలు తీర్చే విధంగా సమర్థవంతంగా సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపించి భారత దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపించాలి. ●




విజయవాడ వార్త



# జల ప్రళయం

**-బుడమేరు ఉగ్రరూపం**
**-పాతికేళ్ళ తర్వాత మరోసారి బుడమేరు విశ్వరూపం**
**-చిగురుటాకులా వణికిన బెజవాడ శివారు ప్రాంతాలు**
**-రెండు గంటల్లోనే ముంచుకొచ్చిన ముంపు**
**-కట్టుబట్టలతో మిలిగిన పేదలు**

విజయవాడ ప్రభాతవార్త : గత రెండు నెలలుగా ప్రపంచం నలుమూలలా ఏదో ఒక చోటు జల ప్రళయం విరుచుకుపడుతూనే ఉంది. మొన్న దుబాయిని వానలు ముంచెత్తితే.... ఆ తర్వాత కేరళలో వయనాడ్ ప్రళయం. మొన్న బంగ్లాదేశ్ వరదలు,మరో వైపున ఉత్తర భారతదేశం అంతటా అనేక పట్టణాలు వరదల ధాటికి అతలాకుతలం అవుతూనే ఉన్నాయి. కానీ విజయవాడ ప్రజలు మాత్రం ఆ దుర్గమ్మ చెంతన ఉన్నామన్న ధీమాతో నిశ్చింతగా ఉన్నారు. కానీ, ప్రకృతిని నాశనం చేస్తే ఆ ప్రకృతి విలయం ఏ విధంగా ఉంటుందో విజయవాడ ప్రజలకు పూర్తిగా అర్థమయ్యే రీతిలో ఈ ఆ దుర్గమ్మ బుడమేరు రూపంలో ఒక్కసారిగా తన విశ్వరూపం చూపించింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం బెజవాడ వాసులను ఉక్కిరిబిక్కిరి చేయగా,బుడమేరు రూపంలో శివారు ప్రాంతాలను ముంచెత్తింది. విజయవాడ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 33 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదై విజయవాడను బెంబేలెత్తించింది. శనివారం ఉదయం కురిసిన వర్షాలకు విజయవాడ పాతబస్తీలోని పూర్తిగా జలమయం కాగా, చాలా ప్రాంతాల్లో ఇళ్ళు వర్షపునీటితో పూర్తిగా నీటమునిగాయి. విజయవాడ శివారు ప్రాంతాలైన సింగ్‌నగర్, పాయకాపురం, అంబాపురం, రాయనపాడు, నున్న ప్రాంతాలతో పాటు భారతీనగర్, రామవరప్పాడు ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపై మూడు నాలుగు నుంచి ఐదు అడుగుల మేర నీరు చేరి, పలుచోట్ల ఇళ్ళలోకి నీరు చేరి ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఉదయానికి వర్షపు నీరు తగ్గుముఖం పట్టి యధాస్థితికి చేరకుంటూ ఉంది. దీంతో ఆదివారం ఉదయం అందరూ ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో బుడమేరు ఉప్పెన రూపంలో విరుచుకుపడి పేదలు నివసిస్తున్న విజయవాడ శివారు ప్రాంతాలను పూర్తిగా ముంచి వేసింది. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకూ సాధారణంగా ఉన్న విజయవాడ శివారు ప్రాంతాలు అరగంటలో ఒక్కసారిగా రూపురేఖలు మారిపోయాయి. రాయనపాడు నుంచి మొదలైన ఉప్పెన ఒక్కసారిగా గొల్లపూడి, భవానీపురం,జక్కంపూడి, విజయవాడ పాలప్రాజెక్టు ఏరియా, చిట్టినగర్, అంబాపురం, పాయకాపురం, సింగ్‌నగర్, గుణదల శివారు ప్రాంతాలను ముంచెత్తింది. ఉదయం తొమ్మిది గంటలకు ఆయా ప్రాంతాలకు వరద నీరు చేరుకోగా రోడ్లన్నీ జలమయమయ్యాయి. అందరూ మళ్ళీ వర్షపునీరు వస్తుందని భావిస్తూ వచ్చారు. ఇంతలోనే వర్షపునీరు అంతకంతకూ పెరుగుతూ వచ్చింది. ఇళ్ళలోకి వరద నీరు చేరుకుంటూ ఉండటంతో అందరూ సామాన్లను సర్దుకోవడం మొదలుపెట్టారు. కానీ, అనూహ్యంగా వరద నీరు ఒక్కసారిగా పెరిగిపోవడంతో ఎవరూ తమ సామాన్లను కూడా దాచుకునే పరిస్థితి లేకుండా పోయింది. భవనాలలో ఉండే వారు తమ ప్రాణాలను దక్కించుకునేందుకు ఇళ్ళపైకి చేరుకోగా పూరిళ్ళు, రేకుల షెడ్లలో ఉండే వారు కట్టుబట్టలతో సమీపంలో ఉండే భవనాల వారిని ఆశ్రయించి తలదాచుకున్నారు. బుడమేరు వరద ధాటికి జక్కంపూడి వైఎస్సార్ కాలనీ, అంబాపురం, పాయకాపురం, సింగ్‌నగర్, ప్రకాష్‌నగర్, వాంబేకాలనీ, ఆంధ్రప్రభకాలనీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ కండ్రిక కాలనీ, ఉడాకాలనీ ప్రాంతాలు మొత్తం నీట మునిగాయి. వేలాది ఇళ్ళు నీట మునిగాయి. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు కట్టుబట్టలతో మిగిలారు. ఉదయమే నీరు ఇళ్ళలోకి చేరుకోవడంతో ఉదయం నుంచి ఆహారం లేకుండా పోయింది. కనీసం మంచినీరు కూడా లేక ఆయా ప్రాంతాల ప్రజలు అలమటిస్తున్నారు. ఆదివారం రాత్రి వరకూ కూడా వారికి ఎలాంటి సహాయ సహకారాలు అందలేదు. నీరు తక్కువగా ఉన్న కొన్ని ప్రాంతాల వారికి కొన్ని స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల వారు ఆహారం సరఫరా చేయగా నీరు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోకి వారు కూడా చేరుకోలేక పోవడంతో అధికశాతం ప్రజల పరిస్థితి నీరు, ఆహారం అందక దయనీయంగా తయారైంది. ఉదయం నుంచి సహాయం కోసం ఎదురుచూస్తూ సెల్ ఫోన్లలో తమకు తెలిసిన వారి నుంచి సహాయం కోసం ఎదురుచూపులు చూడగా, ఉదయం నుంచి కరెంటు సరఫరా కూడా లేకపోవడంతో చాలా మంది వద్ద సెల్ ఫోన్లు కూడా మూగబోయాయి. రాత్రి పది గంటల వరకూ కూడా ఎటువంటి సహాయం అందలేదని పలువురు వాపోతున్నారు. బాగా లోతట్టు ప్రాంతాల ప్రజల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వరద పెరుగుతుందని అంచనా వేయలేక ప్రభుత్వం నుంచి సరైన సమాచారం లేక చాలా మంది ప్రజలు రేకుల షెడ్డులపైకి చేరి సాయం కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. మరి కొంత మంది ఇళ్ళలోనే తలదాచుకుంటూ ఉండగా కొన్ని ప్రాంతాల్లో పది అడుగులకు పైగా వరద చేరుకుంది. వరద అంతకంతకూ పెరుగుతూ ఉండటంతో చాలా చోట్ల ప్రజల పరిస్థితి అందోళనకరంగా ఉంది. తమ వారి సమాచారం తెలియక బయటి ప్రాంతాల్లోని వారి బంధువులు ఆందోళన చెందుతున్నారు.



**కృష్ణలంక ప్రజల తరలింపుకు సన్నహాలు :** కృష్ణ బ్యారేజీ నుండి క్రిందికి వరదనీరు ప్రవహించటంతో కృష్ణలంక ప్రజలను పునరావసు కేంద్రాలకు తరలించేందుకు అదికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. బ్యారేజీ నుండి 9లక్షల క్యూసెక్కుల మించి వరదనీరు ప్రవహించే అవకాశం ఉందని గుర్తించిన అదికారులు రాత్రికిరాత్రే పున:రావసుకేంద్రాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 3దశాబ్దాల తరువాత రికార్డు స్థాయిలో పొటెత్తిన వరదనీరు పెద్ద ప్రమాదాన్ని తెచ్చిపెట్టనున్నట్టు గుర్తించిన అధికారులు ఆదిశగా నష్టనివారన చర్యల్లో నిమగ్నమైయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గరుండి సహాయకచర్యలు పరిశీలిస్తున్నారు. సింగు నగర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించి భాదితులను ఓదార్చారు. పునరవసు కేంద్రాలలోని భాదితులకు ఆహార మరియు మంచినీటి బాటీళ్ళ పంపిణిని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలిసున్నారు. జల ప్రళయంతో వణికిన బెజవాడ ఏ మేరకు నష్టపోతుందో వేచి చూడాల్సి వుంది.







సింగ్ నగర్ వరద బాధితులను నీటిలోనే పరిశీలించిన సీఎం చంద్రబాబు



కనకదుర్గమ్మ వారిధి పై వరద ఉధృతి పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు మరియు విపత్తులశాఖ,హోంశాఖ మాత్యులు వంగలపూడి అనిత



సహాయక చర్యలపై అధికారులతో చర్చిస్తున్న సీఎం చంద్రబాబు

# సహాయక చర్యలు ముమ్మరం చేయండి : సీఎం

**- తుఫాను ప్రభావం తీవ్రంగా ఉన్న జిల్లాలకు రూ.3కోట్లు,ఇతర జిల్లాలకు రూ.రెండు కోట్లు తక్షణం సహాయం**
**-హుద్‌హుద్ తుఫాను సమయంలో అనుసరించిన విధానాలను అధ్యయనం చేయాలి,ఆ దిశలో సహాయకచర్యలు చేపట్టాలి**
**-భారీ వర్షాల ప్రభావంతో 10వరకు మరణించడం దురదృష్టకరం,వారందరి కుటుంబాలను ఆదుకుంటాం**
**-ప్రకృత్తి.విపత్తు నియంత్రణ సంస్ద కార్యాలయానికి వెళ్ళి వరద పరిస్దితులను సమీక్షించిన సీఎం చంద్రబాబు**

**విజయవాడ,సెప్టెంబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మరో మూడు రోజులు భారీ వర్షాలకు అవకావమున్నట్లు వాతావరణశాఖాధికారులు సూచిస్తుందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు.గతంలో ఎన్నడులేని రీతిలో విజయవాడ,గుంటూరు నగరాలు,ఇతర జిల్లాల్లో వర్షం ప్రజలకు భారీ నష్టకలిగించిందన్నారు.భారీ వర్షాలకు ఇప్పటి వరకు అందిన సమాచారాన్ని అనుసరించి 10మంది వరకు మరణించడం దురదృష్టకరమన్నారు.సహాయక చర్యలకు జిల్లాకు రూ.3కోట్లు, తీవ్రత తక్కువున్న జిల్లాకు రూ.2కోట్లు చొప్పున తక్షణసాయం విడుదల చేయాలని ఆదేశించారు.హుద్‌హూద్ తుఫాను సమయంలో మనం అనుసరించిన విధానాలను మనం అధ్యయనం చేయాలి,అప్పటి మాదిరిగానే సహాయక చర్యలు అందజేయాల్సి ఉంది,తరుణ వ్యాధులు,ఇతర ఆరోగ్య సమస్యలు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య ఆరోగ్య సిబ్బంది ఎక్కడిక్కడ వైద్యసేవలు అందించాలన్నారు.అన్ని ప్రాంతాల్లో అలెర్ట్‌గా ఉండాలన్నారు.ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు.శ్రీకాకుళం నుంచి విశాఖ మధ్య తుఫాను తీరం దాటుతున్న నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. తీరగ్రామాలకు వర్షాలకు సంబంధించి సూచనలు వచ్చిన వెంటనే అధికారులు జాగ్రత్త పడాలన్నారు.నష్టం జరగకముందే జరుగకుండా శ్రద్ద తీసుకోవాలి ఇప్పటికైన కొండ చరియల ప్రాంత,లోతట్టు ప్రాంత నివాశితులను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలన్నారు.నిన్నంతా వర్షాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించిన చంద్రబాబు ఆదివారం ఉదయం నుంచే వర్షం వలన కలిగిన నష్టం,రవాణా వ్యవస్ద,విద్యుత్తు సరఫరా పునరుద్దరణంశాలపై అధికారులతో వర్చువల్ సమీక్షలు ప్రారంబించారు.పాఠశాలలకు మనం శెలవులు ప్రకటించిన నేపథ్యంలో ఉప్పలపాడు దగ్గర ఒక టీచరు,ఇద్దరు విద్యార్దులు వరద నీటిలో కొట్టుకుపోయిన ఘటనను తీవ్రంగా పరిగణించాలన్నారు.ఎక్కడా ఇటువంటి ఘటనలు జరుగకూడదు,ఈ అంశంపైన విచారణ జరపాలన్నారు..భారీ వర్షాలు,వరదల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయి అప్రమత్తతో ఉంటే ప్రజల ఇబ్బందులను తగ్గించవచ్చని సిఎం చంద్రబాబు సూచించారు. ఇరిగేషన్,రెవిన్యూ శాఖలు సమన్వయంతో చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లపై భారీ స్థాయిలో నీరు చేరి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోందన్నారు. వీటిపై దృష్టి పెట్టాలని పరిస్థితికి అనుగుణంగా ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించాలన్నారు. వాగులు,వంకల వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని ఆదేశించారు. భారీ వర్షాలు,వరదల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్దాయి అప్రమత్తతో ఉంటే ప్రజలు ఇబ్బందులను తగ్గించవచ్చును.ఇరిగేషన్,రెవెన్యూశాఖలు సమన్వయంతో చెరువుల పరిస్దితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలి. పట్టణ ప్రాంతాల్లో రోడ్లపై భారీ స్దాయిలో నీరు చేరి ట్రాఫిక్ ఇబ్బంది కలుగుతోందన్నారు0. వీటిపై దృష్టి పెట్టాలన్నారు.పరిస్దితికి అనుగుణంగా ట్రాఫిక్ మళ్ళింపులు చేపట్టి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు.వర్షాలు,వరదలు కారణంగా మంచినీరు,ఆహరం కలుషితం అయ్యే అవకాశం ఎక్కువ ఉంది.దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు.అల్లూరి జిల్లాలో కలుషిత ఆహర ఘటన జరిగింది.వీటిపై అధికారులు సీరియస్‌గా దృష్టిపెట్టాలి.బాధితులకు మెరుగైన వైద్యసాయం అందించాలన్నారు.ముఖ్యంగా ఏజెన్సీలలో జ్వరాల బారిన పడిన గిరిజనులకు వైద్యం అందేలా చూడాలన్నారు.ముఖ్యంగా ఏజెన్సీలలో జ్వరాల బారిన పడిన గిరిజనులకు వైద్యం అందేలా చూడాలన్నారు.ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలు,వాగులు దాటేందుకు ప్రజలను అనుమతించవద్దు,ఈ విషయంల కఠినంగా వ్యవహరించాలన్నారు.వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా వివిధ శాఖల అధికారులు నిత్యం సంప్రదింపులు జరుపుకుని సమన్వయంతో పనిచేయాలన్నారు.తద్వారా ప్రజలకు సత్వర సాయం అందుతుంది.క్రైసిస్ మేనేజ్మెంట్ శాఖ ద్వారా ఎప్పటికప్పుడు వర్షాలపై సమాచారం ఇవ్వాలన్నారు.భారీ వర్షాలు, వరదలపై ఆయా ప్రాంతాల ప్రజల ఫోన్లకు అలెర్ట్ మేసెజ్‌లు ఇవ్వాలి.విజయవాడలో కొండ చరియలు కూలి మరణించిన వారి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.వరద ఉధృతంగా ఉన్న ప్రాంతాల్లో సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి,వరద బాధితులను సురక్షప్రాంతాలకు తరలించాలన్నారు.వారి అక్కడ అన్ని సహాయకచర్యలుండాలి.వైద్య ఆరోగ్య సేవలు ఉండాలన్నారు.విద్యుత్తు సరఫరాకు ఇబ్బంది ఉండకూడదని స్పష్టం చేసారు.ప్రతి కుటుంబానికి కచ్చితంగా నాణ్యమైన ఆహారం అందించాలన్నారు.ఇక రైళ్ళు,బస్సులు రాకపోకలు ఆయా స్టేషన్లలో నిలిచివున్న ప్రయాణికులకు అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు.వారికి ప్రత్యామ్నయ ప్రయాణ సదుపాయాలు కల్పించాలన్నారు.అక్కడా వైద్యసేవలు అందుబాటులో ఉండాలన్నారు,ఏపీలో భారీ వర్షాలపై చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి,డీజీపీ,మంత్రులు,జిల్లా కలెక్టర్లు.ఎస్పీలు ఆయా శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా వర్షాలపై పరిస్దితిని ముఖ్యమంత్రి సమీక్షించారు. భారీ వర్షాలరీత్యా ఎక్కడిక్కడ అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సూచనలు చేయాలన్నారు. అవసరమైనసహాయక చర్యలకు ప్రభుత్వ సిబ్బంది ఉండాలని చెప్పారు. మ్యాన్‌హోల్,కరెంట్ తీగలు తెగిపడే అవకాశం ఉన్నందున ప్రమాదాలు జరుగకుండా చూడాలన్నారు. భారీ వర్షాలున్న ప్రాంతాల్లో విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని ఆదేశించారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్,డీజీపీ సిహెచ్ ద్వారకా తిరుమలరావులతో సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు పరిస్దితిని సమీక్షిస్తున్నారు.సీఎం చంద్రబాబు నేటి మధ్యాహ్నం ప్రకృత్తి.విపత్తు నియంత్రణ సంస్ద కార్యాలయానికి వెళ్ళి అక్కడ నుంచి వరదలు తదితర పరిస్దితులను సమీక్షించారు.



**తీరం దాటిన వాయుగుండం,లోతట్టు ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలి :** బంగళాఖాతంలో ఏర్పడిన తుఫాను ఉత్తర ఆంధ్రప్రదేశ్- దక్షిణ ఒడిషా నడుమ 12.30-2.30ల మధ్య తీరం దాటింది,దీని ప్రభావంతో సోమ,మంగళవారాల్లోను పలు చోట్ల మాదిరి నుంచి భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉంది.శ్రీకాకుళం,విజయనగరం, మన్యం, అల్లూరి కాకినాడ,నంద్యాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది,ఏలూరు,కృష్ణా,ఎన్టీఆర్,గుంటూరు, బాపట్ల,పల్నాడు,కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుండి కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది,విశాఖపట్టణం, అనకాపల్లి, కోనసీమ,తూర్పుగోదావరి,పశ్చిమగోదావకి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయి. వైఎస్ఆర్,చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తెలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల సంస్ద ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు.

**తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రులు,అధికారులు :** తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రులు,అధికారులు పర్యటిస్తున్నారు.వారికి అవసరమైన సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు.కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలకు వెళ్ళి ఆయా కుటుంబాలకు చేయూతను అందిస్తున్నారు.సీఎం చంద్రబాబు ఆదేశాలను అనుసరించి సహాయక చర్యలు నిర్వహిస్తున్నారు.

## రాయల్ ఎన్‌ఫీల్డ్ నుండి ది 2024 క్లాసిక్ 350

విజయవాడ, సెప్టెంబర్ 1, ప్రభాత'వార్త' : ఐదు వేరియంట్లతో, ఏడు అబ్బురపరిచే రంగుల్లో కొత్త 2024 క్లాసిక్ అప్‌డేటెడ్ రాయల్ ఎన్‌ఫీల్డ్‌ను సెప్టెంబర్ 1 నుండి దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. హెరిటేజ్, హెరిటేజ్ ప్రీమియం, సిగ్నల్స్, డార్క్, క్రోమ్ వంటి ఐదు కొత్త వేరియంట్లతో లభిస్తుందన్నారు.

## యూనియన్ బ్యాంక్‌తో టొయోటా కిర్లోస్కర్ ఎంఓయు

**విజయవాడ, సెప్టెంబర్ 1, ప్రభాత'వార్త' :** వినియోగదారులకు సమగ్రమైన మెరుగైన వాహన ఫైనాన్సింగ్ పరిష్కారాలను అందించడానికి తాము యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం చేసుకున్నట్లు టొయోటా కిర్లోస్కర్ మోటార్ ప్రతినిధులు ప్రకటించారు. కస్టమర్ల అవసరాలను తీర్చడానికి టొయోటా వాహనాలను మరింత మెరుగ్గా అందుబాటులోకి తేవడానికి ఆకర్షణీయమైన సులభమైన పరిష్కారాలనందించడమే లక్ష్యంగా 90శాతం ఫైనాన్స్ అందించడమే కాక యూనియన్ వెహికల్ స్కీంకింద సంవత్సరానికి 8.80 శాతం తో ప్రారంభమయ్యే వడ్డీతో 84 నెలల వరకు చెల్లించేలా ఈఎంఐ సదుపాయాన్ని అలాగే యూనియన్ పరివాహన్ స్కీంకింద వాణిజ్య వాహనాలకోసం 60 నెలల ఫైనాన్సింగ్ కల్పిస్తున్నామన్నారు.

## మృతురాలి కుటుంబానికి 5వేలు ఆర్ధికసాయం

**ఎ కొండూరు, సెప్టెంబరు 1, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామంలో రసాల మ్యాంగో మార్కెట్ అధిపతి ఎస్‌విఎస్ పిచ్చారావు (అబ్బాయిగారు) ఇటీవల విజయవాడ-తిరువూరు జాతీయ రహదారి-30పై హరిజనవాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మొక్కల కత్తి పుల్లమ్మ అనే దళిత మహిళ కుటుంబానికి రూ.5వేలు నగదు ఆర్థిక సాయం అందించి తన మానవత్వాన్ని సేవాభావాన్ని దాతృత్వాన్ని ఉదారస్వభావాన్ని చాటుకున్నారు. అబ్బాయిగారు ఈ మెట్ట మండల ప్రాంతంలో అనేక మంది పేద దళిత ఎస్టీ బిసి మైనార్టీ వర్గాలకు చెందిన వారికి ఎటువంటి ఆపద వచ్చిన వారికి అనేక విధాలుగా సాకారం అందించడం అలాగే పద విద్యార్థినీ విద్యార్థులకు పేద ఆడపిల్లల వివాహాలకు తన వంతు సాయం అందించడం అలాగే మ్యాంగో మార్కెట్ యార్డులో వివాహాధి శుభకార్యాలు పేదలు జరుపుకోటానికి తన యార్డును ఉచితంగా అందిస్తూ వారి సేవాభావం పట్ల పేద వర్గాల ప్రజలు ప్రశంసించారు. పేద దళిత వ్యవసాయ మహిళ కూలీ మృతి చెందగా ఆమె కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాకారం అందించి ఆ బాధిత కుటుంబానికి బాసటగా నిలవడం ఎంతైనా అబ్బాయి గారి మనవతా విలువలకు దర్పణం పట్టడం పట్ల మొక్కలకత్తి రాములమ్మ, సంఘపెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

## నేడు పాఠశాలలకు శెలవు

ఎ కొండూరు, సెప్టెంబరు 1, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా॥జి.సృజన ఆదేశాల మేరకు బంగళాఖాతంలో తీవ్ర తుఫాన్ కారణంగా ఎ కొండూరు మండలంలో సోమవారం ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు మండల విద్యాశాఖాధికారులు ఎం.రాజశేఖర్, ఈఎల్‌సి కేశవరావు ఆదివారం మీడియాకు తెలిపారు.

## వెదుళ్ల వాగు ఉధృతం

తిరువూరు, సెప్టెంబరు 1, ప్రభాతవార్త : తిరువూరు మండలం మల్లెల గ్రామంలో వెదుళ్ల వాగు పొంది వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో అప్రమత్తమైన పోలీస్ శాఖ మరియు రెవెన్యూ శాఖ అధికారులు, కానిస్టేబుల్ కాంతారావు, విఆర్‌వో జయరాజు, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి'లు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## ముంపు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

### - రేషన్ సకాలంలో అందించాలి : ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



**సత్తెనపల్లి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** ముంపు గ్రామాల ప్రజలను సకాలంలో సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి రేషన్ అందేలా చూడాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, శానిటైజేషన్ సక్రమంగా చేయాలన్నారు. ఈ రాత్రికి వరద పెరిగే అవకాశం ఉన్నందున వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా బాధితులకు అండగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అధికారులంతా గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. సిద్ధంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే కన్నా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్టీ లక్ష్మీనారాయణ సూచించారు.

## తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

**అమరావతి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** మండలంలోని పెద్దమద్దూరు గ్రామంలో అకాల వర్షాలు, తుఫాన్ కారణంగా ఎస్సీ కాలనీ, యానాదుల నివాస గృహాలు నీటమునిగాయి. దీంతో ఆయా కాలనీవాసులు నిరాశ్రయులయ్యారు. వారికి పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు అఖిల భారత పంచాయితీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, ఏపి పంచాయితీ పరిషత్ రాష్ట్ర ఛైర్మన్ డ్డాక్టర్ జాస్తి వీరాంజనేయులు చేతుల మీదుగా ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.



ఈ సందర్భంగా జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలిసారి బాధ్యతలు స్వీకరించి సెప్టెంబర్ 1 నాటికి 30 ఏళ్ళు పూర్తైందన్నారు. రాజకీయ జీవితంలో 1995 సెప్టెంబర్ 1 న చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి పేద ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు పొదిలి శ్రీనివాసరావు, గ్రామ పంచాయితీ సభ్యులు జాస్తి వెంకటేశ్వరరావు, బుడ్డి హరిబాబు, బూత్ కన్వీనర్లు అనీల్‌కుమార్, జాస్తి నరసింహారావు, పొదిలి నరసింహారావు, పొదిలి సాంబశివరావు, పొదిలి మదన్‌మోహన్, బుడ్డి శ్రీనివాసరావు, పత్తిపాటి బాబి, గ్రామ పార్టీ నాయకులు అత్తోట జార్జి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## లంక గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతానికి తరలింపు: కలెక్టర్

**అమరావతి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** గత రెండు రోజులుగా పల్నాడు జిల్లాలో కురుస్తున్న విస్తృత వర్షాల దృష్ట్యా అమరావతి మండలంలో మూడు లంక గ్రామాలలో నివసిస్తున్న 36 మందిని, 1150 జీవాలను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు చొరవతో ధరణికోట గ్రామంలోని సురక్షిత ప్రాంతానికి రెవిన్యూ సిబ్బంది తరలించారు. ధరణికోట గ్రామాన్ని ప్రస్తుతం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు.



## పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

**మాచర్ల, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** మాచర్లలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఆదివారం వర్షం తగ్గుముఖం పట్టినా వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా ఆయా ప్రాంతాలకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. ఎన్నడూ లేని విధంగా చంద్రవంక వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో మాచర్ల అర్బన్ సీఐ ప్రభాకరరావు జేసీపీ సాయంతో వరద నీటిని దారి మళ్లించే పనులు చేపట్టారు.



## ప్రజలను అప్రమత్తం చేసిన రెవెన్యూ సిబ్బంది, పోలీసులు

**చిలకలూరిపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** మండలంలోని వేలూరు గ్రామంలోకి వెళ్లుటకు, మరియు కోమటినేనివారిపాలెం నుంచి గోవిందాపురం వెళ్లుటకు మధ్యలో కుప్పగంజి వాగు తీవ్రంగా ప్రవహిస్తుండటంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చిలకలూరిపేట తహసిల్దార్ మహ్మద్ హుస్సేన్ ముందస్తు చర్యలు చేపట్టారు. అందులో బాగంగా వాగు చప్టాల వద్ద గ్రామ విఆర్‌ఓలను, విఆర్‌ఎలను, పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేసి ప్రజల రాకపోకలను కట్టడి చేశారు.



## వరద నష్టం సత్వర సహాయంపై ఎమ్మెల్యే జీ.వీ సమీక్ష



**వినుకొండ, సెప్టెంబర్1, ప్రభాతవార్త:** అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ప్రజలకు అత్యవసర సహాయక సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్ నుంచి స్థానిక అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్, పశు సంవర్ధక శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. గ్రామాల్లో మందులతో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడ ఏ సమస్య తలెత్తినా తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## పవన్‌కళ్యాణ్ ఆలోచనలు యువతకు ఆదర్శం : మాజీ ఎమ్మెల్యే మక్కెన

**వినుకొండ, సెప్టెంబర్1, ప్రభాతవార్త:** జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా జరిగాయి. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కొంజేటి నాగశ్రీను ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాల నందు మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో తెదేపా నాయకులు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మక్కెన మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ ఆశయాలు, ఆలోచనలు ఎంతో గొప్పవని రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో ఆయన సేవలు ఎంతో అవసరమని చెప్పారు. జన్మదిన వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని పవన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటువంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, ప్రజల మద్దతు, భగవంతుని ఆశీస్సులు పవన్‌కు పుష్కలంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, పవన్ అభిమానులు పాల్గొన్నారు.



## ఘనంగా అంకాళమ్మ తల్లి బోనాలు

**వినుకొండ, సెప్టెంబర్1, ప్రభాతవార్త:** పట్టణంలోని ఇందిరానగర్ నందు వడియరాజుల సంఘం ఆధ్వర్యంలో అంకాళమ్మ తల్లి బోనాలు కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెదేపా



నాయకులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మక్కెన మాట్లాడుతూ బోనాలు కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకున్నారు. సంఘం సభ్యులు మక్కెనను శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి, సన్మానించారు.

## పూడికతీతలు, ఆక్రమణల తొలగింపుతోనే సమస్యలకు పరిష్కారం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, సెప్టెంబర్1, ప్రభాతవార్త:** జనావాసాల్లో చోటుచేసుకున్న అక్రమణల తొలగింపు, డ్రైనేజీలలో పూడిక తీతతోనే భారీవర్షాల సమయంలో ముంపు సమస్యల నుంచి శాశ్వత పరిష్కారం లభిస్తుందని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి అన్నారు. ఇందుకు పట్టణంలో సాధించిన ఫలితాలే నిదర్శనమని తెలిపారు. గత నెలరోజులుగా ఆక్రమణలు తొలగిస్తుంటే అభ్యంతరాలు చెప్పినవారే ఇప్పుడు ఫలితాలు చూసి అభినందిస్తున్నారని ప్రత్తిపాటి ఆనందం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలో వరద ప్రభావిత ప్రాంతాలలో ఆయన పర్యటించారు. గడియారస్తంభం సెంటర్, కళామందిర్ సెంటర్, మార్కెట్ సెంటర్ వద్ద వరదనీరు నిల్వ ఉన్న ప్రాంతాలను, డ్రైనేజీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ గత 50 సంవత్సరాలలో ఇంత వర్షపాతం ఎప్పుడూ నమోదు కాలేదని, వాటికి తోడు గత పాలకుల నిర్లక్ష్యం, పట్టణాల అభివృద్ధిని గాలికి వదిలేయడంతో ఎక్కడ నీరు అక్కడ నిలిచిపోయిందన్నారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్లనే రాష్ట్రమంతా కొన్ని ప్రాంతాలు నీట



మునిగాయన్నారు. గత రెండు నెలలుగా సిఎం చంద్రబాబు, పురపాలకశాఖ మంత్రి నారాయణ చొరవతో పూడికతీతల కోసమే మున్సిపాలిటీలకు నిధులు కేటాయించడం, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పంచాయితీలకు కొంత నిధులు ఇవ్వడంతో పనులు జరిగి కొన్ని ప్రాంతాలలో ముంపు బారినుంచి తప్పించుకున్నా మన్నారు. ఈ సందర్భంగా డ్రైన్లలో పూడికతీత కార్యక్రమం నిర్వహించిన మున్సిపల్ కమీషనర్ చుక్కల గోవిందరావును అభినందించారు. పనిచేసే ముఖ్యమంత్రి, పురపాలక మంత్రి ఉంటే ఫలితం ఎలా ఉంటుందో చిలకలూరిపేట ప్రజలు స్వయంగా చూశారని అన్నారు. ఆక్రమణల తొలగింపులో పట్టణంలో కొంతమంది బాధపడ్డా, మెజారిటీ ప్రజలు సంతోషాన్ని వ్యక్తపరుసు _న్నారని అన్నారు. పూడికతీతలు మొత్తం పూర్తయిన తరువాత మార్కింగ్ ఇస్తారని, ఎవరూ నష్టపోకుండా ఉపాధి కోల్పోకుండా అందరికి సహాయం చేయడం జరుగుతుంద న్నారు. పూడికతీతవలన అంటువ్యాధులు, విషజ్వరాలు రాకుండా పట్టణ ప్రజలు అన్నిరకాలుగా కూడా ఫలితాలను చూస్తారని అన్నారు. పట్టణంలో ఏ డ్రైనేజి చూసిన బ్రహ్మాండంగా పారుతుందని ప్రత్తిపాటి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులకు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది: ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, సెప్టెంబర్1, ప్రభాతవార్త:** ఆర్య వైశ్యులకు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీమంత్రి, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు, స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కళ్యాణమండపం



నూతన కమిటి ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ సెక్రటరీ గుర్రం సాంబశివరావు అధ్యక్షత వహించారు. తొలుతగా నూతన కమిటి సభ్యులు అధ్యక్షులుగా డాక్టర్ అర్వపల్లి వెంకట సురేష్‌బాబు, కార్యదర్శిగా చేవూరి కృష్ణమూర్తి, కోశాధికారిగా యం రాజీవ్ మరియు కార్యవర్గ సభ్యులచే ప్రత్తిపాటి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు రాష్ట్రంలో పెద్ద మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అని, అయితే చిలకలూరిపేట ఆర్యవైశ్యులకు మద్ది లక్ష్మయ్య అని కొనియాడారు. ఇప్పుడు వారిద్దరూ మనమధ్య లేకపోయినా వారిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మద్ది లక్ష్మయ్య తరువాత మద్ది వెంకటేశ్వరరావు ఆర్యవైశ్యులకు పెద్దగా ఉన్నారని, ప్రస్తుతం కళ్యాణ మండపానికి వారు గౌరవ అధ్యక్షులుగా ఉన్నారని తెలిపారు. కళ్యాణ మండపంతో పాటు దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని అధ్యక్షుడు డాక్టర్ ఆర్యపల్లి సురేష్‌బాబుకు సూచిం చారు. అనంతరం నూతనంగా కళ్యాణ మండపంలో మెంబర్ షిప్ తీసుకున్న సభ్యులను ప్రత్తిపాటి సత్కరించారు. కార్యదర్శిగా ప్రమాణస్వీ కారం చేసిన చేవూరి కృష్ణమూర్తి కళ్యాణ మండంపం అభివృద్ధికి ప్రత్తిపాటి సమక్షంలో రూ 5లక్షలు ప్రకటించారు. ఆయనతో పాటు అనేకమంది దాతలు ముందుకు వచ్చి డొనేషన్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, డిప్యూటి కలెక్టర్ వుప్పుటూరి మదన్‌మోహన్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొప్పురా వూరి పటేల్, ఛీప్ ఆర్గనైజర్ మురికిపూడి ప్రసాద్, కో ఆర్డినేషన్ కమిటి సభ్యులు బచ్చు వెంకటేశ్వ రరావు, కనమర్లపూడి రమేష్, రాచమల్లు సూర్యా రావు, తవ్వా నాగమల్లేశ్వరరావు, కొత్త కోటేశ్వర రావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆత్మకూరి శ్రీనివాస రావు, పూజా కమిటి సభ్యులు అమరా రమాదేవి, కొత్తకుమారి, కూనలప్రమీల, కనమర్ల పూడి లక్ష్మీతిరుమల, కళ్యాణమండపం కమిటి సభ్యులు, సాధారణ సభ్యులు, పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

## పొరుగుసేవల ఉద్యోగి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, సెప్టెంబర్1, ప్రభాతవార్త:** పట్టణంలో శనివారం పెదనందిపాడు రోడ్‌లో గల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అనుమానస్పద స్థితిలో మృతిచెందిన పొరుగు సేవల ఉద్యోగి కె వసంతరావు కుటుంబాన్ని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం పరామర్శించారు. మొదటగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వసంతబాబు భౌతికకాయాన్నిసందర్శించి అతడి కుటుంబ సభ్యులను ప్రత్తిపాటి పరామర్శించారు. వసంతరావు అనుమానస్పద మృతి కేసులో ఎటువంటి రాజకీయ జోక్యం ఉండదని కుటుంబ సభ్యులకు తెలిపారు. కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని అక్కడే ఉన్న సిఐ పి రమేష్‌ను ఆదేశించారు. అనంతరం వసంతరావు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటితో పాటు జనసేన పార్టీ సమన్వయకర్త తోట రాజారమేష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మెమో నెంటర్ 1214 రద్దుచేయాలని ప్రత్తిపాటికి వినతిపత్రం అందజేత

**చిలకలూరిపేట, సెప్టెంబర్1, ప్రభాతవార్త:** భవననిర్మాణ కార్మికులు సమస్యల పరిష్కారానికి అడ్డంగా ఉన్న మెమో నెంబర్ 1214ను వెంటనే రద్దుచేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, పలు సమస్యలను ప్రత్తిపాటి దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ఆదివారం మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుని ఆయన నివాసంలో భవననిర్మాణ సంఘ నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కార్మికులకు అనేక సమస్యలు ఉన్నమాట వాస్తవమేనని, ప్రస్తుతం చంద్రబాబునాయుడు ప్రభుత్వాన్ని గాడిలో పెట్టే పనిలో ఉన్నారని, భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రత్తిపాటి వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భవననిర్మాణ కార్మికులు సంఘం పల్నాడు జిల్లా షేక్ సిలార్ మసూద్, యడ్లపాడు భవననిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రావు, ఆంజనేయులు, సిపియం నాయకులు పేరుబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్లు అరెస్టు

**రెంటచింతల, సెప్టెంబరు 1 ప్రభాతవార్తః** మండల కేంద్రమైన రెంటచింతలలో శనివారం రాత్రి పేకాట ఆడుతున్న 13 మందిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ. 13,900లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పంట నష్టం జరగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలి: ఏవో

**గురజాల, సెప్టెంబరు 1 ప్రభాతవార్తః** వర్షాల ధాటికి పంట నష్టం జరగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో సంధ్యారాణి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని పంట పొలాలను ఆమె పరిశీలించి రైతులకు



పలు సూచనలు చేశారు. పొలాల్లో నీరు నిలబడ కుండా చూసుకోవాలన్నారు. నీరు నిలబడితే పత్తి పైరు ఎర్రబారే అవకాశం ఉందన్నారు. 90 రోజులలోపు పత్తి పొలంలో ఎకరానికి బూస్టర్ డోస్‌గా 30 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. అలాగే మల్టీ-కె (13.0.45) గ్రాములు, లేదా పోలిఫిడ్ (19ః19ః19) 10 గ్రాములు లేదా యూరియా 20 గ్రాములు, 10 గ్రాములు మెగ్నీషియం సల్ఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారితోపాటు బోరాక్స్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పత్తి పైరుకు పూత, గూడ రాలుతుంటే ప్లానోఫిక్ 1మి.లీలు 4.5 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేస్తే మంచిదన్నారు. పంట పొలాల్లో నాలుగైదు రోజులపాటు నీటి నిల్వ ఉన్న పైరుకు ఆకుమచ్చ, బ్యాక్టీరియా తెగుళ్ల ఆశించే అవకాశం ఉందని, అటువంటి పైరుకు సీవోసీ 30 గ్రాములు, ప్లాంటమైసిన్ 1 గ్రాము 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేస్తూ కాయకుళ్లు ఉన్న చోట ప్రోపికోనాజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. వర్షం ఆగేంత వరకు రైతులు పంట పొలాలపై దృష్టి సారించాలన్నారు. పంటలలో జరుగుతున్న మార్పులను గమనించి తగిన సూచనలను పొంది పంటలను కాపాడుకోవాలని ఏవో సంధ్యారాణి కోరారు.

## ఘనంగా రక్తదాన శిబిరం

**పిడుగురాళ్ల, సెప్టెంబరు 1 ప్రభాతవార్తః** జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకొని గురజాల శాసనస భ్యుడు యరపతినేని శ్రీనివాసరావు నేతృత్వంలో జనసేన మండల అధ్యక్షుడు కామిశెట్టి రమేష్ ఆధ్వర్యాన ఆదివారం పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వంద మందికి పైగా జనసైనికులు, మెగా అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు, జనసేన నేతలు మునగా వెంకట్, బడిదల శ్రీనివాసరావు, కటకం అంకారావు, దూదేకుల కాసిం, ఉప్పిడి నరసింహారావు, కామిశెట్టి అమరలింగేశ్వరరావు, ఉమామహేష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, నియోజకవర్గ అధికార ప్రతినిధి వడ్డవల్లి సాంబశివరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పనితి రవి, నియోజకర్వగ తెలుగు యువత అధ్యక్షుడు నెగరికంటి శివ, కోట హరి, జనసేన నేతలు, మెగా అభిమానులు పాల్గొన్నారు.



## పంట పొలాలను పరిశీలిచిన ఏవో

పిడుగురాళ్ల, సెప్టెంబరు 1 ప్రభాతవార్తః మండలంలోని కామేపల్లి, కోనంగి గ్రామాల్లో అధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తి, వరి పొలాలను ఆదివారం ఏవో శ్రీనివాసరెడ్డి పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పొలంలో నీటిని తీసివేసి పొలం ఆరేల చూడాలన్నారు. మల్టీ-కె (13.0.45) గ్రాములు, లేదా పోలిఫిడ్ (19ః19ః19) 10 గ్రాములు లేదా యూరియా 20 గ్రాములు, 10 గ్రాములు మెగ్నీషియం సల్ఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారితోపాటు బోరాక్స్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. బూస్టర్ డోస్‌గా 30 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. బోరాక్స్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఆకుమచ్చ, బ్యాక్టీరియా తెగుళ్ల ఆశించే అవకాశం ఉందని, అటువంటి పైరుకు సీవోసీ 30 గ్రాములు, ప్లాంటమైసిన్ 1 గ్రాము 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేస్తూ కాయకుళ్లు ఉన్న చోట ప్రోపికోనాజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. వరి పొలంలో నీటిని తీసివేసి 30 కిలోల యూరియా 15 కిలోల ఎంవోపీ అదనంగా వేసుకోవలన్నారు. బీఎల్‌బీ వచ్చే అవకాశం ఉన్నందున పొటాష్ తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. నేరుగా విత్తిన వరిలో నెల రోజులలోపు ఉన్న పంటలో మొక్కలు చనిపోయినట్లయితే అక్కడ ఒత్తుగా ఉన్న చోట మొక్కలు పీకి నాటుకోవాలన్నారు. లేదా నారు తెచ్చి నాటుకోవాలన్నారు. ఎలుకల ఉధృతి ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో శ్రీనివాసరెడ్డి సూచించారు.


## వర్షాల అనంతరం మిరప పంటలో జాగ్రత్తలు తీసుకోవాలి

**వినుకొండ, సెప్టెంబర్1, ప్రభాతవార్త:** అల్ప పీడనం కారణంగా కురిసిన అధిక వర్షాల అనంతరం మిరప పంట వేసిన రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని ఉద్యానశాఖ అధికారి షేక్. నబి రసూల్ తెలిపారు. పొలంలో అధికంగా ఉన్న నీటిని వెంటనే బయటకు పంపాలన్నారు. వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలి. మొక్కలు ఉరకెత్తి తలలు వాల్చినట్లయితే వెంటనే చేరుకోవడానికి లీటర్ నీటిని 10 గ్రాములు యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండుసార్లు పిచికారి చేయాలి. పై వాటితోపాటు ఎకరాకి 50 కిలోల యూరియా 25కిలోల ఎంవోపి, 200 కిలోల వేప పిండి వేయాలన్నారు. తెగుళ్ల నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారి చేయాలని సూచించారు.



## పునరావాస కేంద్రంలో నివాశితులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు

**అమృతలూరు, ఆగష్టు 31, ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పాడిన వాయుగుండం కారణంగా శుక్ర, శనివారాల్లో కురిసిన భారీ వర్షాలకు యలవర్రు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించిన యలవర్రు రోడ్డు ప్రక్కన నివశిస్తున్న 8కుటుంబాల సభ్యులకు(26మంది) మండల అధికారులు ఎలాంటి లోటు లేకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించారు. వారికి శనివారం సాయంత్రం బోజనం, ఆదివారం ఉదయం బ్రేక్‌పాస్ట్, మధ్యాహ్నం, సాయంత్రం బోజన ఏర్పాట్లు చేశారు. అమృతలూరు పిహెచ్‌సి ఆధ్వర్యంలో యలవర్రుకు చెందిన ఆశావర్కలు వారికి కావలసిన మందులను ఉచితంగా అందజేశారు.



## స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులైన చలపతిరావుకు పలువురు సన్మానం

**సత్తెనపల్లి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా సత్తెనపల్లి మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన న్యాయవాది మద్దినేని వెంకట చలపతిరావును ఆదివారం పలువురు ఘనంగా సన్మానించారు. మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరావు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్‌కుమార్, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగి షేక్.షరీఫ్, ప్రజా నాట్యమండలి నియోజకవర్గ కార్యదర్శి వల్లెం చెన్నకేశవులు తదితరులు సన్మానం చేసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత చలపతిరావు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.



## పత్తి పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

**సత్తెనపల్లి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** మండలంలోని నందిగామ గ్రామంలో అధిక వర్షాలకు నీట మునిగిన పత్తి పంట పొలాలను ఆదివారం పల్నాడు జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు సి.హెచ్.రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల నుండి కురుస్తున్న అధిక వర్షాల కారణంగా పత్తి, వరి పంటలలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు తెలియజేశారు. పత్తి పంట పొలంలో నీటిని తీసివేసి అంతర్ కృషి చేసి పొలం ఆరేలా చూడాలన్నారు. విత్తిన వరిలో నెల రోజులలోపు ఉన్న పంటలో మొక్కలు చనిపోయినట్లయితే అక్కడ ఒత్తుగా వున్న చోట మొక్కలు పీకి నాటుకోవాలన్నారు. ఎలుకల ఉధృతి ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి సబ్ డివిజన్ ఇన్‌చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు యస్.శ్రీధర్‌రెడ్డి, నందిగామ వ్యవసాయ సహాయకుడు గోపాలం గోపికృష్ణ, సత్తెనపల్లి మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ఆళ్ళ అమరేశ్వరరావు, నాయకులు తాతినేని రంగా, రైతులు పాల్గొన్నారు.



## కళ్ళు మరణం తర్వాత మాత్రమే దానం చేయవచ్చు

**పెదకూరపాడు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** కళ్ళు మరణం తర్వాత మాత్రమే దానం చేయవచ్చని, నేత్రదానాన్ని ఒక పవిత్ర బాధ్యతగా స్వీకరించాలని పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ జొన్నలగడ్డ చైతన్య అన్నారు 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకొని జనచైతన్య సమితి ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను ఆదివారం ఆసుపత్రిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ కొన్ని వేల మంది కంటి చూపు లేక చీకటిలో ఉండిపోతున్నారని వారందరికీ వెలుగులు ప్రసాదించాలంటే మరణానంతరం ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసి కంటి చూపు లేనివారికి ప్రసాదించాలని కోరారు. జనచైతన్య సమితి కార్యదర్శి అన్నవరపు స్టాలిన్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఏడాది నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. జనచైతన్య సమితి నిర్వాహకులు తుళ్ళూరి సాంబశివరావు మాట్లాడుతూ నేత్రదానం మనిషి మరణానంతరం మరో ఇద్దరికి చూపునిస్తుందని, కేవలం కంటిలోని కార్నియా పురాణం మాత్రమే మరణానంతరం సేకరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో గోగులపాటి సందీప్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



MN 7 PAGE-GNT:MN 7 PAGE-GNT 01/01/01 8:08 AM Page 1



# భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సారె సమర్పణ

పొన్నూరు, సెప్టెంబరు 1,ప్రభాతవార్త: శ్రావణమాసం పూర్తి కావస్తున్న నేపథ్యంలో పట్టణంలో వేంచేసియున్న గ్రామ దేవత తోటమ్మతల్లి అమ్మవారికి తెలగపాలెం నుంచి భక్తులు పెద్ద ఎత్తున సారెను సమర్పించారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని పెద్దలు తెలిపారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి పట్టుచీర, జాకెట్‌ముక్క, కుంకుమ, పసుపు, గాజులు, పూల దండలు తదితరాలను ఊరేగింపుగా జీబిసి రోడ్డు నుంచి



తోటమ్మతల్లి అమ్మవారి దేవాలయం వరకు వేడుకగా తీసుకెళ్ళారు. డోలు, సన్నాయి. తప్పెట్లు, తదితర వాయిద్యాలతో సారెను సమర్పించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అదేవిధంగా యూత్ కూడా ప్రత్యేకంగా డిజె సౌండ్ సిస్టమ్‌తో, కనక తప్పెట్లతో అమ్మవారికి వేడుక నిర్వహించారు. అర్బన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# దివంగత సీఎం వైఎస్సార్ వర్ధంతి ఘనంగా నిర్వహిద్దాం

### -వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు, సెప్టెంబరు 1,ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించుదామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి నాడు మామిళ్ళపల్లి గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. ఆ తర్వాత అక్కడి నుండి పట్టణంలోని పలు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. ఆ



మురళీకృష్ణ కార్యకర్తలకు సూచించారు. స్థానిక వైకాపా కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాట తప్పని మడమ తిప్పని నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. అలాంటి మహనీయుని అడుగు జాడల్లో నడుద్దామన్నారు. వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేస్తున్న ఎకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. వాడ వాడలా వైఎస్సార్ వర్ధంతి వేడుకలను నిర్వహించాలని కోరారు. వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ సోమవారం తర్వాత చింతలపూడి గ్రామంలోనూ. అక్కడి నుండి పచ్చలతాడిపర్రు, వెల్లలూరు తదితర గ్రామాల్లో నివాళులర్పించిన పిమ్మట చేబ్రోలు, పెదకాకాని మండలాల్లో కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంద న్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో అన్న సంతర్పణలు, పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి, అంబటి వెంకటేశ్వరరావు, మూకిరి జాకబ్‌పాల్, తాళ్ళపాలెం సర్పంచి వీరయ్య, పీర్‌సాహెబ్, గోపిశెట్టి వాసు తదితరులున్నారు.

# పట్టణ ప్రజల సమస్యల పరిష్కరిస్తా

### -మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

**పొన్నూరు, సెప్టెంబరు 1,ప్రభాతవార్త:** పట్టణ ప్రజల సమస్యలను తెలుసుకొని సత్వరమే పరిష్కరించే విధంగా చూస్తామని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు అన్నారు. మునిసిపల్ కమిషనర్ ఆదివారం పట్టణంలోని ముబారక్ నగర్‌లో పర్యటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముబారక్ నగర్‌కు వెళ్ళే రహదారిలో కల్వర్టు వద్ద ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్‌కు సంబంధించిన ఇనుప చట్రం కుంగిపోయింది. దీని స్థానంలో నూతన చట్రం ఏర్పాటు చేస్తామని




చెప్పారు. అదేవిధంగా డ్రెయిన్లలో చెత్తా చెదారం నిండి ఉందని, వాటిని తొలగించాలని టిడిపి నాయకులు కమిషనర్‌కు సూచించారు. అందుకు స్పందించిన కమిషనర్ రమేష్‌బాబు సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పఠాన్ ఫిరోజ్‌ఖాన్, తోటకూర నరేష్, పఠాన్ అహ్మద్‌ఖాన్ తదితరులున్నారు.

# పట్టణంలోని సమస్యలు పరిష్కరించండి

### -పట్టణాభివృద్ధి కమిటి సభ్యుల వినతి

పొన్నూరు, సెప్టెంబరు 1,ప్రభాతవార్త: పట్టణంలో డెంగ్యూ, తదితర విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో పట్టణంలో



శానిటేషన్ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ముప్పాళ్ళ రమేష్‌బాబు కు పట్టణా భివృద్ధి కమిటి సభ్యులు సూచించారు. అందుకు సంబంధించి ఆదివారం మునిసిపల్ కార్యాల యంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. డ్రెయిన్లలో మురుగు పారుదల సక్రమంగా పారుదల కాకపోవడంతో దోమల వ్యాప్తికి కారణంగా నిలిచిందన్నారు. యుద్ధప్రాతి పదికన డ్రెయిన్లలోని సిల్ట్ తీయించి ఆయిల్ బాల్స్ వదలటం, దోమల నివారణా మందులను పిచికారి చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్సులో తిష్ట వేసిన బినామీలను ఖాళి చేయించి, సంవత్సరాల తరబడి పేరుకుపోయిన మొండి బకాయిలను వసూలు చేయాలని కోరారు. మునిసిపల్ ఆదాయాన్ని పెంచి పట్టణ పౌరులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణాభివృద్ధి కమిటి అధ్యక్షుడు వట్టికూటి లీలాప్రసాద్, కన్వీనర్ షేక్ యాసిన్‌బాబా, వివేకా విద్యాసంస్థల అధినేత ఉప్పల సుకుమార్‌బాబు తదితరులున్నారు.

# ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 18వ రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు

**నరసరావుపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త :** కేసానుపల్లి గ్రామం వద్ద ఉన్న అంతర్జాతీయ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఆదివారం 18వ రాష్ట్రస్థాయి జూనియర్, సబ్ జూనియర్ ఫ్లోర్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఆటల పోటీలకు ఐఎంఏ అధ్యక్షులు, ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ ఛైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ పర్యవేక్షణలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గం రాష్ట్రస్థాయి పోటీలకు వేదిక కావడం సంతోషమన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పేరుకు తగిన విధంగానే చదువుతో పాటు ఆటల నిర్వహణలోనూ అంతర్జాతీయ ప్రమాణాలను పాటించడం



అభినందనీయమన్నారు. పాఠశాల ఆవరణలోని గ్రౌండ్, అత్యుత్తమ ప్రమాణాలతో రాష్ట్రస్థాయి పోటీలకు వేదిక కావడం ఆనందమన్నారు. నియోజకవర్గానికి ఇటువంటి పాఠశాలలు మణిహారం అన్నారు. అన్ని జిల్లాల నుండి క్రీడాకారులు రావడం జరిగిందన్నారు. క్రీడాకారులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు శుభాకాంక్షలను తెలియజేశారు. పాఠశాల ఛైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ మాట్లాడుతూ వేసవిలో జాతీయస్థాయి పోటీలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. బాలురు, బాలికలు వివిధ జిల్లాల నుండి వచ్చారని తెలిపారు. అండర్-14, అండర్-19 విభాగాలలో ఫ్లోర్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించేందుకు తమ పాఠశాలకు అవకాశం లభించిందన్నారు. ఫ్లోర్‌బాల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పి.సురేంద్ర, టిడిపి సీనియర్ నాయకులు వేములపల్లి వెంకటనరసయ్య, ఫ్లోర్‌బాల్ అసోసియేషన్ సభ్యులు ఆర్.దుర్గాప్రసాద్ తదితరులకు స్వాగతం చెప్పున్నట్లు ఛైర్మన్ నాగోతు ప్రకాష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నష్టపోయిన ప్రతి రైతును ఆదుకొంటాం

### -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు, సెప్టెంబరు 1,ప్రభాతవార్త: ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకొంటామని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మాచవరం, ములుకుదురు, చింతలపూడి, పచ్చలతాడిపర్రు, మునిపల్లె, వెల్లలూరు తదితర గ్రామాల్లో పర్యటించి నీట మునిగిన పొలాలను పరిశీలించారు. గత 40సంవత్సరాల కాలంలో ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదన్నారు. మొన్నటి దాక సాగునీటికి కోసం ఎదురు



చూసిన రైతులకు ఇప్పుడు పంటలు ముంపునకు గురయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో సాగునీటి కాలువల అభివృద్ధికోసం టిడిపి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అధికారులు పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి అందరికీ న్యాయం చేసే విధంగా చూడాలని ఎడిఎ కోటేశ్వరిని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంకట నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# యుపిఎస్‌కు వ్యతిరేకంగా నిరసన

**పొన్నూరు, సెప్టెంబరు 1,ప్రభాతవార్త:** ఎపిటిఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులపై బలవంతంగా రుద్దబోతున్న యూనిఫైడ్ సెన్షన్ స్కీం(యుపిఎస్)కు వ్యతిరేకంగా ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేశారు. గత ప్రభుత్వం వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేస్తామని గద్దెనెక్కి ఐదు సంవత్సరాలలో ఇచ్చిన హామీ అమలు చేయకపోవగా గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ జిపిఎస్‌ను బలవంతంగా అమలు చేశామన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా యుపిఎస్‌ను వచ్చే ఏప్రిల్ నుంచి 50శాతం పెన్షన్ అమలు చేస్తామని చెప్పడం లక్షలాది కేంద్ర ఉద్యోగులు,



ఉపాధ్యాయులను మోసం చేయడమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ విధానాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునగా వెంకటేశ్వరరావు, పొన్నూరుశాఖ మండలాధ్యక్షుడు ఎంఎం ఖుద్దూస్, ప్రధానకార్యదర్శి మల్లంపాటి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి జి.శివరామకృష్ణ, బాలక్రిష్ణ, అన్వర్‌బేగ్, జె.శ్రీను, ఎ.శ్రీనివాసరావు, భూషణం, మురళీ, మేకా శ్రీను, ఆదినారాయణ, తదితరులున్నారు.

# పోలేరమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**పొన్నూరు, సెప్టెంబరు 1,ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొండముది గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ అమ్మవారిని ఆదివారం ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే ధూళిపాళ్ళకు ఘనంగా స్వాగతం పలికారు. పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ధూళిపాళ్ళకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి అర్చకుల



వేదాశీర్వచనం చేయించారు. ఈ కార్యక్రమంలో బొర్రు రామారావు, మాదల వెంకటేశ్వరరావు, యలవర్తి వెంకటేశ్వరరావు, సుబ్బారావు తదితరులున్నారు.

# నీటమునిగిన కాలనీలు

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** నరసరావుపేట నియోజకవర్గంతో పాటు పలు పంచాయితీల పరిధిలో శివారు కాలనీలలో వర్షపునీరు భారీగా చేరింది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని లింగం గుంట్ల గ్రామ పంచాయితీ పరిధిలోనూ, రాజుపాలెం ఎస్.సి.కాలనీలోనూ వర్షపునీరు భారీగా వీధుల్లోకి చేరింది. ఇళ్ళల్లో నుండి బయటకు రావడం వీల్లే కుండా పోయిందని కాలనీవాసులు వాపోయారు. పంచాయితీ కార్యదర్శి



కె.వి.శివప్రసాద్ ఆయా కాలనీలలో పర్యటించి అధికారులకు సమాచారం అందించారు. మున్సిపాల్టి పరిధిలోని బాపనయ్యనగర్, ప్రకాష్‌నగర్ చివరి వీధుల్లోనూ మురుగునీరు చేరిందని నివాసితులు తెలిపారు. వారు బయటకు వెళ్ళేందుకు తగిన ఏర్పాట్లు చేశామని సెక్రటరీ ప్రసాద్ తెలిపారు. అదే విధంగా అంటువ్యాధులు ప్రభలకుండా తక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. కురుస్తున్న వర్షాలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సెక్రటరీ ప్రసాద్ నివాసితులను కోరారు.

# టిడిపి, జనసేన ఆధ్వర్యంలో బియ్యం, కూరగాయలు పంపిణీ

నరసరావుపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త : తెలుగుదేశం, జనసేన పార్టీల ఆధ్వర్యంలో వరద బాధితులకు ఆదివారం బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, జనసేన ఇన్‌ఛార్జి సయ్యద్ జిలానీ, టిడిపి నాయకులు కపలవాయి విజయ్‌కుమార్‌లు నిత్యావసర



వస్తువులను పంపిణీ చేశారు. జనసేన నాయకులు బెల్లంకొండ అనీల్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం కొణిదల పవన్‌కళ్యాణ్‌ల ఆదేశాల మేరకు నీటమునిగిన ప్రాంతాలలో పర్యటించి సేవా కార యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. బాధితులను ఆదుకునేందుకు తెలుగుదేశం, జనసేన పార్టీలతో పాటు బిజెపి నాయకులు ముందుకు రావడం సంతోషమన్నారు. నరసరావుపేట నియోజక వర్గంలో ఎక్కడా వరద ముంపు ప్రాంతాలు పెద్దగా లేవన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో కాలువలలో పేరుకుపోయిన సిల్ట్‌ను ముందస్తు చర్యల్లో భాగంగా పెద్ద ఎత్తున తొలగించడం జరిగిందన్నారు. అదే విధంగా అన్ని వీధులలో గత మూడు నెలలుగా కాలువలను శుభ్రం చేస్తున్నామన్నారు. ఈ కారణంతో ఎక్కడా మురుగునీరు రోడ్లపైకి రావడం జరగలేదన్నారు. చీకటికాలనీ వంటి ప్రాంతాలలో భారీగా కురిసిన వర్షంతో కొన్ని ఇబ్బందులు రావడంతో వారిని ఆదుకోవడం కోసం చర్యలు తీసుకున్నామన్నారు. పలు కుటుంబాల వారికి బియ్యం, కూరగాయల వంటి వాటిని సరఫరా చేశామన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తమకు తెలియజేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# సిపిఎస్ రద్దు చేయాలని ఎస్‌టియు నిరసన

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** సిపిఎస్ రద్దు చేయాలని ఎస్‌టియు ఆధ్వర్యంలో పల్నాడు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎల్.వి.రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీలలో ఇచ్చిన వాగ్ధానం నిలుపుకోవాలన్నారు. నాయకులు కోటేశ్వరరావు మాట్లాడుతూ పాత పెన్షన్‌ను మాత్రమే అంగీకరిస్తామని, ఇతర పద్ధతులను ఎస్‌టియు వ్యతిరేకిస్తుందన్నారు. 2004 సెప్టెంబర్ 1న సిపిఎస్ ఏర్పాటు చేశారని, ఆ రోజుని ఉద్యోగులకు వ్యతిరేక విద్రోహ దినంగా పాటిస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎం.సుభాని మాట్లాడుతూ పెన్షన్ బిక్ష కాదని, ఉద్యోగుల హక్కు అన్నారు. 35 ఏళ్ళ పాటు ప్రభుత్వంలో పని చేసి జీవితం చివరిలో పెన్షన్ లేకపోవడం అన్యాయమన్నారు. జె.గంగాధర్‌బాబు మాట్లాడుతూ చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, హర్యానా, కర్ణాటక రాష్ట్రాలలో సిపిఎస్‌ను రద్దు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరావు, షేక్.కరిముల్లా, ఎ.ఏమండీ, అక్కయ్య, రామలింగయ్య, భీష్మారావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

# వర్షంతో నకరికల్లులో దెబ్బతిన్న ఇల్లు

నకరికల్లు, ఆగస్టు 1 ప్రభాతవార్త : వర్షం కారణంగా నకరికల్లులోని పలు ఇల్లు దెబ్బతిన్నాయి. గ్రామంలోని ఎస్సీ కాలనీలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రెండు మట్టి మిద్దె ఇల్లు, ఒక పూరిగుడిసె పూర్తిగా దెబ్బతిన్నాయి. అయితే ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని స్థానికులు తెలియజేశారు. ప్రాణనష్టంతో పాటు పశునష్టం జరగకుండా నివాసితులను, పశువులను మరో ప్రాంతానికి తరలించినట్లు అధికారులు తెలియజేశారు. డి.నాగేశ్వరరావు, యాకోబు, డానియేలు తదితరుల ఇల్లు దెబ్బతిన్నాయని స్థానికులు తెలియజేశారు.

# ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపరుస్తాం

### - ఎమ్మెల్యే అరవింద్‌బాబు

**నరసరావుపేట, ఆగస్టు 1 ప్రభాతవార్త :** ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపరుస్తామని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యం సాధిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఆదివారం పలు రేషన్‌షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చే ప్రజా పంపిణీ వ్యవస్థ బలంగా ఉండాల్సిన అవసరం ఉంద న్నారు. ప్రతి కార్డుదారునికి సరుకులు అందించేలా చర్యలు తీసు కుంటామ న్నారు . పట్టణంలోని 6వ వార్డు లోనూ, ఇతర ప్రాంతాల లోనూ ఉన్న రేషన్ షాపులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. సరుకుల కోసం రేషన్ షాపుకు వచ్చిన



కార్డుదారు లను పలకరించా మన్నారు. వారికి ఏమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకోవడం జరిగింద న్నారు. టిడిపి హయాంలో కార్డుదారులకు ఎనిమిది రకాల సరుకులను అందించేవారమని గుర్తు చేశారు. గత వైకాపా ప్రభుత్వం కందిపప్పు, పంచదార వంటివి ఇవ్వలేదన్నారు. ఇళ్ళవద్దకే బియ్యం ఇస్తామని హడావుడి చేసి ఎందుకూ ఉపయో గపడనటువంటి వాహనాలను కొనుగోలు చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సరుకులు మొత్తం ఇచ్చే విధంగా ప్రణాళికలు అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు వివరించారు.

**చెత్త నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి :** చెత్త నిర్వహణపై అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధిని కనపరచాలని, నరసరావుపేట పట్టణాన్ని అభివృద్ధి కేంద్రంగా మార్చాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఆదివారం మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులతో కలిసి డంపింగ్ యార్డును పరిశీలించారు. చెత్తను ఆధునిక పద్ధతిలో నిర్వీర్యం చేయాలన్నారు. అవసరమైన చోట కంపోస్ట్ ఎరువుల కేంద్రాలు, సాలీడ్ మేనేజ్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వాసిరెడ్డి రవి తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు వచ్చిన నష్టం అత్యంత బాధాకరం : మాజీ ఎమ్మెల్యే శివకుమార్

**తెనాలి, సెప్టెంబర్ 1 (ప్రభాతవార్త :** ఖరీఫ్ వ్యవసాయం ప్రారంభంలో వెద పద్దతి సాగు వల్ల అప్పటి అకాల వర్షాలకు ఒకసారి నష్టపోయారని, మరోసారి వరినాట్లు తెచ్చి నాటిన రైతలకు అల్పపీడనం వల్ల కురిసిన భారీ వర్షాలు మరింత నష్టాన్ని కలుగజేశాయని, ఎకరాకు 20నుండి25వేల వరకు వరి సాగు చేసిన రైతులు నష్టపోయారని రైతుకు వచ్చిన కష్టం, నష్టం అత్యంత బాధాకరమని కూటమి ప్రభుత్వం వారిని తక్షణమే ఆదుకోవాలని మాజ మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. మండలంలోని కఠెవరం, కోపల్లె, గుడివాడ, ఎరుకలపూడి శివారుల్లోని వ్యవసాయ భూములను మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, వైసిపి శ్రేణులతో కలసి పరిశీలించారు. పంట పొలాల్లోకి తీవ్రంగా వచ్చిన వరదనీరు బయటకు పోవడానికి రెండు నుంచ మూడు రోజులు పట్టే పరిస్థితి ఉందని, ఈ క్రమంలో వరిసాగు వేసిన రైతులు బారీగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతు పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైందని మాజీ ఎమ్మెల్యే శివకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత వైసిపి పాలనలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు ప్రయోజనకరమైన పలు సేవలను చేపట్టామని, ప్రస్తుతం గ్రామాల్లో రైతులకు యూరియా కూడా లభించని పరిస్థితి ఉన్నట్లుగా తెలుస్తోందన్నారు. రాజకీయాలు ప్రస్తావించే అంశం కాదని, రైతును కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన అవసరం ఉందని శివకుమార్ రైతుకు న్యాయం చేయాలని కోరారు. ఆయన వెంట ఎంపిపి ధర్మరాజుల చెన్నకేశవులు, మాజీ ఎంపిపి చెన్నుబోయన శ్రీనివాసరావు, పలువురు వైసిపి నాయకులు ఉన్నారు.

# రైతులను, కౌలు రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి

### -రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివసాంబిరెడ్డి

**తెనాలి, సెప్టెంబర్ 1 (ప్రభాతవార్త :** భారీ వర్షాల కారణంగా తెనాలి డివిజన్‌లో నీట మునిగిన పంట పొలాలను చూస్తుంటే రైతు పరిస్దితి ఎంతో దయనీయంగా మారిందని తెలుస్తోందని కూటమి ప్రభుత్వం తక్షణమే రైతుకు భారీ వర్షాల కారణంగా వేసిన వరి నాట్లు కాస్త పూర్తిగా నీట మునిగిపోవడం బాధాకరమన్నారు. మొదటిసారి వెదపెట్టి రెండో సారి వరినాట్లు వేసి రైతు తీవ్రంగా దెబ్బతినే పరిస్దితి ఏర్పడిందని 50రోజుల పంట కాస్త నీటిపాలైందని రైతులు పెట్టిన పెట్టుబడి అంతా బూడిదలో పోసిన పన్నీరు అయ్యిందని ఇది అత్యంత బాధాకరమని అన్నారు. ప్రకృతి పరంగా రైతు అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటు న్న పరిస్థితిలో ప్రభుత్వాలు



అన్ని విధాలుగా సహయ సహకారాలు అందించాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రైతు సంఘం నాయకులతో కలసి మండలంలోని ఐతానగర్ గోలి డొంకరోడ్డు ప్రాంతంలోని పంట పొలాలను పరిశీలించారు. వారిని అన్ని విధాలుగా ఆదుకో వాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రత్యామ్నాయం నష్టపరిహారంతో పాటుగా ఎరువులు అందజే యాలని డిమాండ్ చేశారు. పొలాలు పరిశీలిం చిన వారిలో జయరావు, మేకల చిట్టిబాబు, ఈదర పూర్ణచంద్, పలువురు రైతులు ఉన్నారు.

# పొంగిపొర్లుతున్న వాగులు

**రాజుపాలెం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని బలిజేపల్లి, అనుపాలెం గ్రామాల పరిధిలోని వాగుల ఉధృతి అధికంగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. అదే విధంగా భారీ వర్షాలకు పలు గ్రామాల్లోని పంటలు నీటముని గాయి. పత్తి, కంది పంటలతో పాటు వరినారుమళ్ళు నీటమునిగాయి. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు



చేసిన పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు పంట చేతికి వచ్చే సమయంలో నష్టాన్ని కలుగజేశాయని పలువురు రైతులు చెప్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

# జొన్నాదుల బాలకృష్ణ ఆర్థికసాయంతో భోజనం ప్యాకెట్లు పంపిణీ

### -మంగళగిరి 3,4,5వార్డుల్లో 400మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ

**మంగళగిరి,సెప్టెంబర్ 1,ప్రభాతవార్త :** మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో గుంటూరు పార్లమెంట్ పద్మశాలి సాధికార కమిటీ సభ్యులు జొన్నాదుల బాలకృష్ణ ఆర్థిక సహకారంతో 400మందికి ఆదివారం మధ్యాహ్నం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు.గత మూడురోజులుగా భారీగా కురుస్తున్న వర్షాల వల్ల మంగళగిరి పట్టణంలోని 3,4,5వార్డుల్లో ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్న వారికి భోజనం ప్యాకెట్లు అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి



తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలోని వరద ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఎప్పటికప్పుడు అధికారులు,పార్టీ శ్రేణులను అలెర్ట్ చేస్తూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారన్నారు.ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని కోరారు.కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు,పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు పేరం ఏడుకొండలు,మాజీ శివాలయం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ భోగి కోటేశ్వరరావు,నల్లగొండ శివరామకృష్ణ,జొన్నాదుల వెంకట రామాంజనేయులు,బాపనపల్లి వాసు,తాడిబోయిన వెంకటేశ్వరరావు,మునగపాటి ప్రసన్న వెంకటేశ్వరరావు,స్టీఫెన్ పాల్గొన్నారు.

# 'సరిపోదా శనివారం' థాంక్స్ మీట్



**నేచురల్ స్టార్ నాని,** క్రియేటివ్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయ బ్లాక్ బస్టర్ మూవీ 'సరిపోదా శనివారం'. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్‌గా, ఎస్.జె సూర్య పవర్‌ఫుల్ రోల్ నటించిన ఈ చిత్రాన్ని డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డివివి దానయ్య, కల్యాణ్ దాసరి హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో నిర్మించారు. ఆగస్ట్ 29న తెలుగు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్‌తో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని, హౌస్‌ఫుల్ కలెక్షన్స్ ఫుల్‌గా రన్‌అవుతోంది. ఈ సదర్భంగా చిత్ర యూనిట్ థాంక్స్ మీట్ నిర్వహించింది. ప్రెస్‌మీట్‌లో నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ, 15 రోజులుగా టీంలో ఎవరికీ నిద్రలేదు. అప్పుడు పని చేసే ఒత్తిడితో నిద్రలేదు. ఈ మూడు రోజులుగా సక్సెస్ ఎక్స‌యిట్మెంట్‌తో నిద్రలేదు. రిలీజ్ రోజు నుంచి ఎన్నో అభినందనలు, ప్రసంశలు వస్తున్నాయి. సినిమాని మీరంతా ఆదరిస్తారని తెలుసు. థియేటర్‌లో అందరితో కలిసి ఆడియన్స్ ఎనర్జీ చూసినప్పుడు మేము ఇంకా తక్కువగా అంచనా వేశామనిపించింది. సినిమా బావుంటే తెలుగు ఆడియన్స్ తలమీద పెట్టుకుంటారని మరోసారి ప్రూఫ్ చేసినందుకు థాంక్‌యూ సోమచ్. ఇంత వర్షంలో కూడా అన్నీ చోట్ల హౌస్‌ఫుల్స్ అవుతున్నాయంటే వి హేవ్ గ్రేటెస్ట్ ఆడియన్స్ ఇన్‌ది వరల్డ్. ఆడియన్స్ అందరికీ థాంక్స్. లాంగ్‌రన్ వుండబోతోంది. హెవీ రైన్స్ వుండి ఈ వీకెండ్ చూడకపోతే ఎలాని భయపడకండి, సినిమా మీ చుట్టే వుంటుంది మీ దగ్గరలోనే ఉంటుంది. చాలా స్పెషల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే స్టోరీ. సాయికుమార్, శివాజీ రాజా చాలా ముఖ్యమైన పాత్రలు పోషించారు. బాయ్స్‌కి ప్రియాంక బాలెన్స్ చేసింది. సూర్య పెర్ఫర్మార్మెన్స్‌ని ఆడియెన్స్ ఎంజాయ్ చేస్తున్నారు. ఆయనకి బిగ్ థాంక్స్. ఈ సినిమాకి పని చేసిన అందరికీ పేరు పేరున థాంక్ యూ. సెప్టెంబర్ 5న సరిపోదా శనివారం సెలబ్రేషన్స్ ఈవెంట్ వుంటుంది. ఈ శనివారంతో సరిపోదు నెక్స్ట్ శనివారం నెక్స్ట్ శనివారం అలా వెళుతూనే వుంటుంది మీ అందరి సపోర్ట్, బ్లెస్సింగ్స్‌తో వి హేవ్ వెరీ వెరీ బిగ్ బ్లస్టర్ ఇన్ అవర్ హ్యాండ్స్ థాంక్‌యూ ఆల్. అని అన్నారు.

హీరోయిన్ ప్రియాంక అరుల్ మోహన్ మాట్లాడుతూ, 'సరిపోదా శనివారం 'కు ఆడియెన్స్ ఇచ్చిన రెస్పాన్స్‌కు చాలా థాంక్స్. చారు మీ మనసులో నిలిచిపోతుంది. ఇది నా ఫేవరేట్ క్యారెక్టర్. మీ లవ్ సపోర్ట్ ఎప్పుడూ ఇలానే వుండాలి. ఇప్పుడే స్టార్ట్ అయ్యింది. 100 డేస్ సకెస్ కూడా ఇలానే సెల బ్రేట్ చేసుకోవాలి. థాంక్ యూ సోమచ్ అన్నారు.

డైరెక్టర్ వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ, నా మీద నమ్మకం కంటే నామీద నాని వున్న నమ్మకం ఎక్కువ . అంత ఫ్రీడం దొరికింది కాబట్టి ఇలాంటి మంచి సినిమా రాగలిగింది. ఇలాంటి స్కేల్ వున్న సినిమాని హ్యాండిల్ చేయగలని నమ్మి బడ్జెట్ పెట్టిన దానయ్యకి థాంక్‌యూ. ప్రియాంక కథకు బెస్ట్ బెస్. చారులత క్యారెక్టర్ చాలా ఎంజాయ్ చేసి రాశాను. సాయికుమార్ ప్రతి సీన్‌లో ఏదో ఒక పని చేయిస్తూనే వున్నాను. శివాజీరాజా నా లక్కీ ఛాన్స్. సూర్యగారి పాత్రకు వస్తున్న రెస్పాన్స్ ఆనందాన్ని ఇస్తుంది. నేను రాసిదానికంటే అద్భుతంగా చేశారు. అందరికీ పేరుపేరున థాంక్స్. అద్భుతమైన సక్సెస్ ఇచ్చిన ఆడియన్స్‌కి థాంక్స్ అన్నారు.

దానయ్య మాట్లాడుతూ. ప్రేక్షలకు నాని అభిమానులకు పేరుపేరున థాంక్స్. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లోనే ఈ సినిమా పెద్ద సక్సెస్ అవుతుందని చెప్పాను. ఈ రోజు రిజల్ట్ కూడా అలానే వుంది. సినిమాని ఇంత బాగా తీసిన వివేక్‌కి థాంక్‌యూ. ఈ సినిమాకి పని చేసిన వారందరికి పేరు పేరున ధన్యవాదాలు అని అన్నారు.

యాక్టర్ సాయికుమార్ మాట్లాడుతూ. ఈ శనివారం మా సూర్య కూల్‌గా వున్నారు. దీనికి కారణం మీరంతా ఇచ్చిన సక్సెస్. ఈ సందర్భంగా అందరికీ థాంక్‌యూ. వివేక్ ఓ మంచి సినిమా అందించాలని అహర్నిషలు కష్టపడ్డాడు. హౌస్‌ఫుల్ కలెక్షన్లతో రన్ అవుతోంది. అందరికీ పేరు పేరున ధన్యవాదాలు.

యాక్టర్ శివాజీ మాట్లాడుతూ, ఈ సినిమా షూటింగ్‌లో చాలా ఎంజాయ్ చేశాను. నా నలభై ఎళ్ల కెరీర్‌లో సినిమా పిచ్చి వున్న వాళ్లందరితో పనిచేశాను. నాని, వేవక్, దానయ్య, సూర్య, అందరికీ సినిమా అంటే పిచ్చి. అందుకే సినిమా అద్భుతంగా వచ్చింది. అందరికీ థాంక్‌యూ అన్నారు.

# 'డీమాంటీ కాలనీ2'


## ఘన విజయాన్ని అందించిన తెలుగు ఆడియెన్స్‌కు థ్యాంక్స్ : హీరో అరుల్ నిధి



**హారర్ థ్రిల్లర్** 'డీమాంటీ కాలనీ2' సినిమాకు ఘన విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. హీరో అరుల్ నిధి. గత నెల 23న -'డీమాంటీ కాలనీ2' తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వచ్చింది. ఈ సినిమాను ఎన్ శ్రీనివాస రెడ్డి సమర్పణలో శ్రీ బాలాజీ ఫిలింస్ బ్యానర్‌పై ప్రొడ్యూసర్స్ బి సురేష్ రెడ్డి, బి. మానస రెడ్డి తెలుగు ప్రేక్షకుల మందుకు తీసుకొచ్చారు. 'డీమంటీ కాలనీ2' బాక్సాఫీస్ వద్ద సక్సెస్ సాధించిన నేపథ్యంలో తాజా ఇంటర్వ్యూలో సంతోషాన్ని వ్యక్తం చేశారు హీరో అరుల్ నిధి.

- డీమాంటీ కాలనీ 2 సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చాలా సంతోషంగా ఉంది. తెలుగులో మా సినిమా స్కేల్‌తో చూస్తూ చాలా పెద్ద సక్సెస్ ప్రేక్షకులు ఇచ్చారు. ఇక తమిళంలో మా సినిమా వండర్స్ క్రియేట్ చేస్తోంది. మా తోపాటు విక్రమ్ తంగలాన్ సినిమా కూడా మంచి విజయాన్ని అందుకుంది.
- డీమాంటీ కాలనీ 2 సినిమాను తెలుగు ఆడియెన్స్ దగ్గరకు ప్రొడ్యూసర్ సురేష్ రెడ్డి బాగా తీసుకెళ్లారు. తెలుగులో మంచి ప్రమోషన్ చేశారు. మా కంటే ఎక్కువగా మా సినిమాను ఆయన బిలీవ్ చేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డికి థాంక్స్ చెబుతున్నాం. ఆయన వల్లే తెలుగులో మా సినిమా ఇంత పెద్ద సక్సెస్ అందుకుంది. తెలుగులో సక్సెస్ సెలబ్రేషన్స్ చేసేందుకు సురేష్ రెడ్డి మమ్మల్ని ఇన్వైట్ చేస్తున్నారు. ఇక్కడ కొన్ని అనివార్యమైన పనులతో హైదరాబాద్ రాలేకపోయాం. త్వరలోనే హైదరాబాద్ వచ్చి సక్సెస్ మీట్ నిర్వహిస్తాం.
- డీమాంటీ కాలనీ 2 పర్ఫెక్ట్ సీక్వెల్ అనే పేరు వస్తోంది. డీమాంటీ కాలనీ2తో పాటు 3,4 సినిమాలు రాబోతున్నాయి. ఈ ఫ్రాంచైజీలో డీమాంటీ కాలనీ 3 బిగ్ స్పాన్ మూవీ అవుతుంది. ఎన్నో ట్విస్టులు టర్న్‌లతో ఈ సినిమా ఉండబోతోంది. కొత్త కొత్త స్టోరీస్, క్యారెక్టర్స్ డీమాంటీ కాలనీ 3లో యాడ్ అవుతాయి. డీమాంటీ కాలనీ2 సక్సెస్ మాకు ఎంతో సంతృప్తినిచ్చింది. టెక్నికల్‌గా సామ్ సీఎస్ మ్యూజిక్ హైలైట్‌గా నిలిచింది. రీ రికార్డింగ్ తర్వాత సినిమాలోని కంటెంట్ చాలా ఎఫెక్టివ్‌గా మారింది. సామ్‌కు థ్యాంక్స్ చెబుతున్నాం.
- ఈ సినిమాలో నేను ద్విపాత్రాభినయం చేశాను. శ్రీని క్యారెక్టర్ డీమాంటీ కాలనీ 1లో ఉన్నదే కంటిన్యూ అయ్యింది. రఘు అనే క్యారెక్టర్ కొత్తగా యాడ్ చేశా. రఘు క్యారెక్టర్ చాలా స్టైలిష్‌గా ఉంటుంది. తనొక బిగ్ ఆర్కిటెక్చర్. కాబట్టి స్టైల్‌గా ఉంటాడు. రిచ్ కిడ్ కాబట్టి కేర్‌లెస్‌గా బిహేవ్ చేస్తుంటాడు. శ్రీని క్యారెక్టర్‌కు కంప్లీట్ డిఫరెంట్ క్యారెక్టర్ రఘు. ద్విపాత్రాభినయం చేయడం కష్టమే. గతంలో నేను డ్యుయర్ రోల్ చేశాను. బాగా నటించాలననే పేరొచ్చింది. డీమాంట్ కాలనీ 2కు మా డైరెక్టర్ అజయ్ మంచి స్క్రిప్ట్ చేశాడు.
- నా కెరీర్‌లో ఎక్కువగా థ్రిల్లర్స్, సస్పెన్స్ మూవీ చేశాను. అలా కావాలని ప్లాన్ చేయలేదు. ఇక నుంచి వేరే జానర్ మూవీస్ చేయాలని అనుకుంటున్నాను. నా ప్రతిభకు రావాల్సి నంత గుర్తింపు రాలేదనే ప్రశ్న చాలా సార్లు ఎదురైంది. అయితే డీమాంటీ కాలనీ ఫ్రాంచైజీ ద్వారా ఆ గుర్తింపు దక్కుతుందని భావిస్తున్నా. నా సోదరుడు ఉదయనిధి స్టాలిన్ నెలక్రితమే డీమాంటీ కాలనీ2 చూశాడు. సినిమా బాగుందని, మేకింగ్ క్వాలిటీ ఆకట్టుకుందని చెప్పారు. సినిమా షూటింగ్ టైమ్‌లో ఎలాంటి భయం కలగలేదు. జీవితంలో కూడా భయపడే పనులేవీ చేయను.
- ఈ సినిమా పార్ట్ 1లో ఒక క్యారెక్టర్ చేశాను. పార్ట్ 2లో రెండు క్యారెక్టర్స్ చేశాను. పార్ట్3లో ఎన్ని క్యారెక్టర్స్ చేయిస్తారో డైరెక్టర్ అజయ్ నిర్ణయం తీసుకో వాలి. డీమాంటీ కాలనీ 3 మరిన్ని సర్‌ప్రైజ్‌లతో మీ ముందుకు వస్తుందనిమాత్రం నమ్మకంగా చెప్పగలను తెలుగులో మూవీ ఆఫర్స్ ఇప్పటివరకు రాలేదు. నాక్యారెక్టర్ బాగుండి కథ ఆకట్టుకుంటే తప్పకుండా తెలుగులో సినిమా చేస్తానని అన్నారు.

# 'కాలం రాసిన కథలు' సక్సెస్ సెలబ్రేషన్స్



**యమ్‌యన్‌వి సాగర్** స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఆసక్తికరమైన చిత్రం 'కాలం రాసినకథలు' నూతన నటీనటులు ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవలే విడుదలై అందరినీ అలరించింది. ఈ సినిమాకి హిట్ టాక్ రావడంతో ఈ ఫిలిం యూనిట్ ఈ రోజు సక్సెస్ మీట్ నిర్వహించారు. దర్శక నిర్మాతలు ఎంఎన్‌వి సాగర్ మాట్లాడుతూ, ఈ సినిమా కోసం గత రెండు సంవత్సరాలుగా నేను పని చేస్తున్నాను. సినిమా విడుదల అయ్యాక ప్రేక్షకుల స్పందన బాగుంది. చిన్న సినిమాల్లో మా సినిమా మంచిగా రాణిస్తుంది. మంచి రిలీజ్‌ని మాకు అందించినందుకు డిస్ట్రిబ్యూటర్‌కి థాంక్స్ చెప్పుకుంటున్నాను. ఈ సినిమా విజయం నేను తదుపరి చేయబోయే సినిమా మీద విశ్వాసాన్ని పెంచింది. ఈ సినిమాలో పెద్ద స్టార్స్ లేకున్నా, కొత్త వాళ్లని కూడా ప్రేక్షకులు బాగా ఆదరించారు. ఈ చిత్రంలో అన్ని పాత్రలు ప్రేక్షకులకి దగ్గరయ్యాయి. ముఖ్యంగా, కిరాక్ కిరణ్ పాత్ర క్లైమాక్స్‌లో బాగా పండింది. ఈ సినిమాలో చేసిన ముగ్గురు హీరోయిన్స్‌కి స్పెషల్ థాంక్స్ చెప్తున్నాను. హన్విక తనకి ఇచ్చిన పాత్రలో అందరినీ మెప్పించింది. ఉమా కూడా అద్భుతమైన నటన కనబరిచి బేబీ సినిమాలో వైష్ణవి చైతన్యలాగా, ఆర్‌ఎక్స్ 100లో పాయల్ రాజ్పుట్ లాగా మెప్పించింది. రాబోయే వారాల్లో కూడా సినిమా ఇంకా బాగా ఆడాలని కోరుకుంటున్నాను అన్నారు.

హన్విక శ్రీనివాస్ మాట్లాడుతూ, 'నేను చిత్రంలో నవ్య అనే పాత్రను పోషించాను. ఈ పాత్రని చాల బాగా రాసారు. సాగర్ ఈ పాత్రకి నన్ను ఎంచుకున్నందుకు ఆయనకి ధన్యవాదాలు చెప్పుకుంట్నూను. ఇక్కడకొచ్చిన మీడియా వాళ్లందరికీ కూడా థాంక్స్ అన్నారు.

ఉమా రేచర్ల మాట్లాడుతూ, ఈ సినిమాలో నా కోస్టార్ అభిలాష్, శ్రీధర్ నాకు బాగా సపోర్ట్ చేశారు. నేను కొత్త అయినా నన్ను ప్రేక్షకులు ఆదరించినందుకు సంతోషంగా వుంది. అని చెప్పారు.

నటుడు వికాస్ మాట్లాడుతూ, ఈ పాత్ర నాకు దక్కినందుకు చాలా అదృష్టంగా ఉంది. ఈ సినిమా మొదట నా దగ్గరకొచ్చినపుడు నేను చేయగలనో లేదో అనిపించింది కానీ సాగర్ నాకు ధైర్యం ఇచ్చారు. మేమందరం సినిమా విజయం సాధించినందుకు సంతోషంగా ఉన్నాను అన్నారు.




# 'మారుతి నగర్ సుబ్రమణ్యం' బెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



**రావు రమేష్** ప్రధాన పాత్రలో నటించిన హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మారుతినగర్ సుబ్రమణ్యం. ప్రేక్షకుల విశేష ఆదరణతో ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శింపబడుతోంది. ఇటువంటి విజయవంతమైన, చక్కటి కుటుంబ వినోదాత్మక సినిమా తీసినందుకు 'మారుతినగర్ సుబ్రమణ్యం' చిత్ర బృందాన్ని సూపర్‌స్టార్ మహేష్ బాబు అభినందించారు. మంచి సినిమాలకు మద్దతు ఇవ్వడంలో సూపర్‌స్టార్ మహేష్‌బాబు ఎప్పుడూ ఓ అడుగు ముందుంటారు. సినిమా ఆయనకు నచ్చిన విషయాలు చెప్పడంతో పాటు తన అభిప్రాయాన్ని వెల్లడిస్తారు. తాజాగా 'మారుతినగర్ సుబ్రమణ్యం' సినిమాకు మహేష్ బాబు రివ్యూ ఇచ్చారు. ఈ మధ్యకాలంలో వచ్చిన మంచి వినోదాత్మక చిత్రాల్లో 'మారుతి నగర్ సుబ్రమణ్యం' ఒకటి అని సూపర్‌స్టార్ మహేష్ బాబు తెలిపారు. తన ట్వీట్‌లో సమర్పకురాలు తబితా సుకుమార్, చిత్ర బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. మహేష్ ట్వీట్ చూస్తే.. ఆయన సినిమాను చాలా ఎంజాయ్ చేసినట్టు అర్థం అవుతోంది. ఆయన ప్రశంసలతో 'మారుతి నగర్ సుబ్రమణ్యం' చిత్ర బృందం అమితానందంలో ఉంది. లక్ష్మణ్ కార్యదర్శకత్వం వహించిన 'మారుతీ నగర్ సుబ్రమణ్యం' సినిమా తబితా సుకుమార్ సమర్పణలో విడుదలైంది. కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతరం సైతం ఈ సినిమాను ఎంజాయ్ చేస్తోంది. థియేటర్లలో నవ్వుల పండగ స్పష్టంగా కనబడుతోంది. ఈ చిత్రాన్ని పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్ సంస్థ బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు.

# 'గబ్బర్ సింగ్' రీరిలీజ్

## కలెక్షన్స్‌లోనూ చరిత్ర సృష్టిస్తుంది

### ప్రెస్‌మీట్‌లో నిర్మాత బండ్ల గణేష్

**పవర్‌స్టార్ పవన్ కల్యాణ్,** మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ క్రేజీ కాంబోలో చరిత్ర సృష్టించిన మూవీ 'గబ్బర్‌సింగ్'. పరమేశ్వర్ ఆర్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత బండ్లగణేష్ నిర్మించిన ఈ చిత్రం 2012లో విడుదలై కలెక్షన్ల వర్షం కురిపించి ఇండస్ట్రీ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రం మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా సెప్టెంబర్ 2న 'గబ్బర్ సింగ్' రీరిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో రీ -రిలీజ్ ప్రెస్‌మీట్ గ్రాండ్‌గా జరిగింది. రీరిలీజ్ ప్రెస్‌మీట్‌లో నిర్మాత బండ్ల గణేష్ మాట్లాడుతూ. నా తల్లిదండ్రులు నాకు జన్మనిస్తే పవన్‌స్టార్ పవన్‌కల్యాణ్ నాకు బ్రతుకుని ఇచ్చారు. పవన్ కల్యాణ్ గురించి నేను ఎంత చెప్పుకున్నా తక్కువే. నేను ఆర్థికంగా ఎంత స్థాయికి వెళ్లినా పవన్ కల్యాణ్ లేకపోతే ఈ క్రేజ్, పేరు ఉండేది కాదు. పవన్ కల్యాణ్ ఒక రోజు పిలిచి సినిమా నిర్మించే అవకాశం ఇచ్చారు. నన్ను నేను నమ్మలేని పరిస్థితితో పవన్ కళ్యాణ్ నమ్మారు. ఈ సందర్భంగా కల్యాణ్‌కి పాదాభివందనాలు తెలియజేసు కుంటున్నాను. గబ్బర్‌సింగ్ ఒక చరిత్ర. రీ రిలీజ్‌కి ఇంత క్రేజ్ ఎంటని కొందరు అడుగుతున్నారు. హిందువులకు భగవద్గీత, ముస్లింలకు ఖురాన్, క్రైస్తవులకు బైబిల్ పవిత్రమైనదో పవన్‌కళ్యాణ్ అభిమానులకు గబ్బర్‌సింగ్ అంత పవిత్రమైనదని వారికి చెప్పాను. గబ్బర్‌సింగ్ సినిమాని అణువణువునా ప్రతి అడుగు ప్రతి మాట ప్రతిక్షణం ప్రతికష్టం డైరెక్టర్ హరీష్ శంకర్‌కి చెందుతుంది. హరీష్‌శంకర్ ఏదీ చెప్పే అది చేద్దాం అని పవన్ కల్యాణ్ సినిమా ప్రారంభం అయినరోజునే చెప్పారు. పవన్ కల్యాణ్ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే, ఆయన గొప్ప మానవత్వం వున్న వ్యక్తి. భారతదేశంలో ఏ నటుడు పొందలేనంత అత్యధిక రెమ్యూనిరేష్ పొందలగలిగే స్టార్ అయినప్పటికీ అన్నీ వదిలేసి జనం కోసం అహర్నిశలు కష్టపడుతున్నారు అన్నారు.

డైరెక్టర్ హరీస్ శంకర్ మాట్లాడుతూ, ఈ ఈవెంట్‌కి గణేశ్ హీరో. అందుకే ఆయన్ని చివరిగా మాట్లాడమని చెప్పా. సోషల్ మీడియా విస్తృతంగా వ్యాప్తి చెందిన ఈ రోజుల్లో గబ్బర్‌సింగ్ రిలీజ్ అయి వుంటే ఎంత బాగుండేదో అని నా మనసులో ఎప్పటి నుంచి ఒక చిన్న వెలితి ఉండేది. ఆ వెలితి ఇప్పుడు తీరింది. అప్పుడు మిస్ అయిన డిజిటల్ హంగామాని మళ్లీ క్రియేట్ చేసి ఇస్తున్న మా అన్న గణేష్ సత్యనారాయణకి థాంక్‌యూ. గబ్బర్ సింగ్ అంటేనే ఒక చరిత్ర. మా జీవితాలనే మార్చేసిన చిత్రమిది. ఎక్కడికెళ్లినా ప్రేక్షకులు అభిమానాన్ని చూపించారు. ఇదంతా పవన్‌కల్యాణ్‌దే అని నమ్ముతూ వచ్చాను. ఈ సక్సెస్ అందరికంటే బలంగా కోరుకునే వ్యక్తి బండ్ల గణేష్. ఆయన ఎప్పుడూ బ్లాక్‌బస్టర్ కొడుతున్నామని సంకల్పంతో వుండేవాడు. పుష్కరాలు పన్నెండు సంవత్సరాలకి వస్తాయి. గబ్బసింగ్ అంతే ఎవర్‌గ్రీన్. ఇప్పుడు ఆయన సంతకానికి పవర్ వుంది. కొన్ని జీవితాల్ని మార్చబోతోంది. ఆ సంతకాన్నిచ్చిన భగవంతుడికి, నిర్విరామంగా కృషి చేస్తున్న వపన్‌కల్యాణ్ గబ్బర్‌సింగ్ యూనిట్ తరపున మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు చెబుతున్నాను థాంక్‌యూ. అని అన్నారు.

డిస్ట్రిబ్యూటర్ సత్యనారాయణ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ సినిమా గత యేడాదే రీ రిలీజ్ చేయాని అనుకున్నాం. పవన్‌కల్యాణ్ నెక్స్ ఇయిర్‌పవర్‌లోకి వస్తారు. అప్పుడు రిలీజ్ చేస్తే ఆ కిక్కే వేరు' అని బండ్ల గణేష్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకి కృతజ్ఞతలు. నేను పవన్‌కల్యాణ్ వీరఅభిమానిని. ఈ సినిమా రీరిలీజ్ టిక్కెట్లు దొరకడం లేదు. ఐదు నిమిషాలకే ఫుల్ అయిపోతున్నాయి. ఈ అవకాశం ఇచ్చిన హరీష్‌కి గణేష్‌కి థాంక్‌యూ అన్నారు.

యాక్టర్ రమేష్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం 12 ఏళ్ల క్రితం రిలీజైంది. అభిమానుల సందడి చూస్తుంటే. ఈ రోజే రిలీజై రిజల్ట్ వచ్చినంత ఆనందంగా వుంది. 12 ఏళ్లకి పుష్కరాలు వస్తాయి. రెండో తారీకున థియేటర్స్‌కి పుష్కరాలు రాబోతోన్నాయి. ఈ రీరిలీజ్ తర్వాత గణేష్ బ్లాక్‌బస్టర్ తీస్తారని కోరుకుంటున్నానుని అన్నారు.



# 'ప్రణయ గోదారి' నుంచి మాస్ బీట్ సాంగ్ రిలీజ్

**ప్రస్తుతం** ఫీల్ గుడ్ స్టోరీస్, చిన్న చిత్రాలు, కొత్త టీం చేస్తున్న ప్రాజెక్టులు బాక్సాఫీస్ వద్ద సక్సెస్ అవుతున్నాయి. ఆ కోవలోనే న్యూ కంటెంట్‌తో రిఫ్రెషింగ్ ఫీల్‌తో రూపొందుతున్న చిత్రం 'ప్రణయ గోదారి'. పి.ఎల్ విఘ్నేష్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని పారమళ్ల లింగయ్య నిర్మిస్తున్నారు. డిఫరెంట్ కంటెంట్‌తో ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు మేకర్స్.



ఈ చిత్రంలో సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన కంటెంట్ అందరినీ ఆకట్టుకుంది. ప్రణయ గోదారి గ్లింప్స్, పోస్టర్లు పాటలు ఆడియెన్స్‌లో మంచి రెస్పాన్స్‌ను దక్కించుకున్నాయి. తాజాగా మరో పాటను మేకర్లు విడుదల చేశారు. గు గు గ్గు.. అంటూ సాగే ఈ హుషరైన పాటను ప్రముఖ కొరియోగ్రాఫర్ గణేష్ మాస్టర్ రిలీజ్ చేశారు. ఈ పాటకు మార్కండేయ బాణీ, సాహిత్యం స్పెషల్ అట్రాక్షన్ కానున్నాయి. భార్గవి పిల్లై గాత్రం కుర్రకారుని కట్టిపడేసేలా ఉంది. పాటను రిటీజ్ చేసిన అనంతరం గణేష్ మాస్టర్ మాట్లాడుతూ.. పాట చాలా బాగుంది. హుక్‌స్టెప్స్ బాగున్నాయి. ఈ మూవీని అందరూ ఆదరించాలి. విఘ్నేశ్ తెరకిక్కెంచిన ప్రణయ గోదారి పెద్ద సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను అన్నారు.

# 'వెంకటలక్ష్మితో యాడాది కిందట' పోస్టర్ లాంచ్



**టింట్ స్ప్రీ** స్టూడియోస్ బ్యానర్‌పై ఆలేటి రాజేష్ నిర్మాతగా రామమూర్తి కొట్టాల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న స్వచ్ఛమైన ప్రేమ కథ చిత్రం 'వెంకటలక్ష్మితో. 'యాడాది కిందట' అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందిన ఈ చిత్రంలో రఘు గద్వాల్ హీరోగా, ప్రియాంక శ్రీ, శివప్రసన్న హీరోయిన్స్‌గా నటించారు. తాజాగా ఈ మూవీ టైటిల్ పోస్టర్‌ను హీరో శ్రీకాంత్ లాంచ్ చేసి సినిమా విజయం సాధించాలని కోరారు.

ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ, 'టైటిల్ చాలా బాగుంది. క్యాచీగా ఉంది. యంగ్ టీమ్ చేసిన సినిమా ఇది. షార్ట్ ఫిలింస్‌తో ఫేమస్ అయిన హీరో రఘు ఈ సినిమా ద్వారా అందర్నీ ఆకట్టుకుంటాడని నమ్ముతున్నా. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్' అని చెప్పారు.

చిత్ర హీరో రఘు గద్వాల మాట్లాడుతూ, నూతన నటీనటులతో ఏడాది కిందట ఈ చిత్రాన్ని మొదలు పెట్టాం. ప్రమోషన్స్‌లో భాగంగా హీరో శ్రీకాంత్ మాకు సపోర్ట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. శ్రీకాంత్‌కి మా టీమ్ తరఫున స్పెషల్ థాంక్స్' అని చెప్పారు.

చిత్ర దర్శకుడు రామమూర్తి కొట్టాల మాట్లాడుతూ.. 'మా మూవీ టైటిల్ పోస్టర్‌ను శ్రీకాంత్ లాంచ్ చేయడం సంతోషంగా ఉంది. ఇదొక స్వచ్ఛమైన ప్రేమ కథా చిత్రం. థ్రిల్లర్, సస్పెన్స్‌తో పాటు అన్ని ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. నిర్మాత రాజేష్ బాగా సపోర్ట్ చేశారు. కంటెంట్ ఉన్న చిత్రాలను ఆదరించే తెలుగు ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరిస్తారని కోరుకుంటున్నా' అని అన్నారు.


నిర్మాత ఆలేటి రాజేష్ మాట్లాడుతూ,'సంవత్సరం కిందట ఈ సినిమాను స్టార్ట్ చేసి షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ కూడా పూర్తి చేశాం. దర్శకుడితో సహా అంతా కొత్తవారితో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. మా టైటిల్ పోస్టర్ లాంచ్ చేసిన శ్రీకాంత్‌కి ధన్యవాదాలు' అని చెప్పారు.

2-9Pg5.qxd:2-9Pg5.qxd 01/01/01 7:25 AM Page 1



# రాజకీయ పార్టీల్లోనూ క్యాస్టింగ్ కౌచ్!

**తిరువనంతపురం, సెప్టెంబరు 1:** మళయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక మాలివుడ్‌ను కుదిపేస్తున్న సంగతి తెలిసిందే. ఈ కమిటీ తర్వాత ఎంతోమంది నటీమణులు మీడియా ముందుకు వచ్చి తమ చేదు అనుభవాలు ఆవేదన పంచుకుంటున్నారు. ఈ పరిణామాల వేళ కేరళకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. క్యాస్టింగ్‌కౌచ్ అనేది సినీరంగానికే పరిమితం కాలేదని రాజకీయాల్లో కూడా ఈ విపరీత పోకడ ఉందని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కేరళయూనిట్‌లో క్యాస్టింగ్ కౌచ్ తరహా పరిస్థితులు ఉన్నాయంటూ సీనియర్



నాయకురాలు సిమీ రోజ్‌బెల్‌జాన్ తీవ్ర ఆరోపణలు చేసారు. పార్టీలో చాలామంది మహిళలు పురుష నేతలనుంచి అభ్యంతరకర ప్రవర్తనను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆ భయానక అనుభవాలను కొంతమంది తనతో పంచుకున్నారని, అందుకు సంబంధించిన ఆధారాలు తనవద్ద ఉన్నాయని పేర్కొన్నారు. సమయం చూసుకుని వాటన్నింటినీ బయటపెడతానన్నారు. పదవుల ఆశచూపి కొంతమంది సీనియర్ నాయకులు మహిళానేతలపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని రోజ్‌బెల్ ఆరోపించారు. అధిష్ఠానంతో సన్నిహత సంబంధాలున్నవారికే అవకాశాలు వస్తున్నాయని అలా కేరళ కాంగ్రెస్ యూనిట్‌లో కొంతమంది అర్హత లేని మహిళలు ఉన్నత హోదాల్లో ఉన్నారని అన్నారు. అయితే ఆమె ఆరోపణలు పార్టీలో అంతర్గత విభేదాలకు దారితీసాయి. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ విభాగం పార్టీ హైకమాండ్‌కు ఆమెపై ఫిర్యాదుచేసింది. 2017లో మళయాళ నటి కిడ్నాప్‌కేసు సంచలనం రేపింది. కారులో ఆమెపై లౌంగిక వేధింపులకు రౌడీలను వినియోగించినట్లు నటుడు దిలీప్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో ఆతడు అరెస్టు అయ్యాడు. ఈక్రమంలో 2019లో జస్టిస్ హేమ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటయింది. ఇటీవలే ఈ కమిటీ తన నివేదికను అం దించింది. అనంతరం మాలివుడ్‌కు చెందిన పలువురు ప్రముఖ నటులపైనా లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే వారిపై కేసులు కూడా నమోదయ్యాయి.



## కపిల్ సిబల్‌పై ధ్వజమెత్తిన ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:** బెంగాల్‌లోని కోల్‌కత్తా ఆర్జీకర్ వైద్యకళాశాలలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటన రాజకీయాలను కుదిపేస్తోంది. ఈ ఘటనపై సీనియర్ న్యాయవాది రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్‌చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఉపరాష్ట్రపతి ధన్‌కడ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆయనచేసిన వ్యాఖ్యలకు గాను క్షమాపణ కోరాలని డిమాండ్ చేసారు. ఈఘటన సర్వసాధారణమంటూ కపిల్ సిబల్ తీవ్ర వ్యాఖ్యలు చేసారు. ఆయన వ్యాఖ్యలను ధన్‌ఖడ్ తీవ్రంగా తప్పుపట్టారు. ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడటం తగదన్నారు. ఆసుపత్రిలో వైద్యురాలి హత్యాచరా ఘటన మానవత్వానికి సిగ్గుచేటని బాధితురాలికి జరిగిన అన్యాయం పట్ల కొందరు వ్యక్తులు చేస్తున్న వ్యాఖ్యలు ఆ బాధను మరింత పెంచుతున్నాయన్నారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పార్లమెంటు సభ్యుడి స్థానంలో ఉన్న ఆయన మాట్లాడటం ఎంతో బాధాకరం అని కపిల్‌నుద్దేశించి ధన్‌కడ్ అన్నారు. ఈతరహా వ్యాఖ్యలుమంచిది కాదు. అలా మాట్లాడినందుకు ఒక్కసారి వారు ఆత్మపరిశీలన చేసుకోవాలి. రాజకీయాలుచేయడానికి ఇది సమయం కాదు బాధితురాలిగురించి అలా మాట్లాడినందుకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని ధన్‌కడ్ డిమాండ్‌చేసారు ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన దేశవ్యాప్తంగాప్రకంపనలు సృష్టిస్తోంది. పెద్ద ఎత్తున విద్యార్థులు ఆందోళన కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఈకేసు సిబిఐ దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే.

# కిమ్‌కు పుతిన్ మేలుజాతి గుర్రాల బహుమతి

**సియోల్, సెప్టెంబరు 1:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ ఉత్తరకొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్‌లు బహుమతులు ఇచ్చి పుచ్చుకోడాన్ని తరచూ చూస్తున్నాం. తాజాగా పుతిన్ మరోసారి కిమ్‌కు గిఫ్ట్‌లను పంపించారు. మేలిమి జాతికి చెందిన 24గుర్రాలను కిమ్‌కు బహూకరించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం వేళ ఉత్తరకొరియానుంచి ఆయుధాలను సరఫరాచేసినందుకు కృతజ్ఞతగా ఈ రిటర్నుగిఫ్ట్‌ను పంపినట్లు స్థానిక మీడియా కథనాలుప్రచురించింది. కొన్నిరోజులక్రితం పుతిన్ ఉత్తరకొరియాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ దేశ నియంత కిమ్‌తో పలు ద్వైపాక్షిక ఒప్పందాలుచేసుకున్నారు. పాశ్చాత్య దేశాలనుంచి తమ రెండుదేశాల్లో ఎవరిపై దాడిజరిగినా పరస్పర సాయం చేసుకుంటామని స్పష్టం చేసారు. ఈనేపథ్యంలోనే ఉక్రెయిన్‌తోయుద్ధం



కొనసాగుతున్న వేళ రష్యాకు సాయంగా ఆయుధాలు పంపించారు. ఇందుకు బదులుగా ఈ గుర్రాలను పంపించినట్లు తెలుస్తోంది. ఓర్లోవ్ ట్రోటర్ జాతికి చెందిన 19 స్టాలియన్లు, ఐదు మరే జాతి గుర్రాలనురష్యా పంపించింది. ఈ జాతి గుర్రాలంటే కిమ్‌కు ఎంతో ఇష్టమట. ఈ జాతిగుర్రాలు ఉత్తరకొరియా వారసత్వానికి ప్రతీకలుగా భావిస్తారు. గడతంలోట్రోటర్ గుర్రంపై కిమ్ స్వారీ చేసిన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గతంలో కూడా పంగ్సన్ అనే తెల్లటి వేటాడే శునకాలను పుతిన్‌కు కిమ్ గిఫ్ట్‌గా ఇచ్చారు. అందుకు రష్యా అధ్యక్షుడు కూడా ఆరుస్ లిమోసిన్‌కారును బహు మతిగా ఇచ్చారు. ఇరువురు దేశాధినేతలు ఆకారులో కొద్దిసేపు షికారుచేసారు. ఆ తర్వాత కిమ్‌కు 447 మేకలను ఇచ్చారు. తాజాగా మేలి జాతికి చెందిన గుర్రాలను నియంత కిమ్‌కు బహు మతిగా ఇచ్చారు.

# మూడు నెలల్లోనే వందేభారత్ స్లీపర్ రైళ్లు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:** వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్లీపర్ రైళ్లనుత్వరలోనే పట్టాలు ఎక్కించేందుకు రైల్వేశాఖ కసరత్తుచేస్తోంది. ఈనేపథ్యంలో వందేభారత్ స్లీపర్‌కోచ్ ప్రొటోటైప్ వెర్షన్‌ను కేంద్ర రైల్వేశాఖమంత్రి అశ్వినీవైష్ణవ్ ఆవిష్కరించారు. బెంగళూరులోని భారత్ ఎర్త్‌మూవర్స్ లిమిటెడ్ ఫెసిలిటీలో వీటిని ప్రారంభించారు. బిఎంఇఎల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వందే భారత్ తయారీ కేంద్రానికి మంత్రి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా సభలో మాట్లాడుతూ ఈరోజు ముఖ్యమయిన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నామని వందేభారత్ చైర్‌కార్ విజయవంతమైన తర్వాత వందేభారత్ స్లీపర్ కోసం చాలా శ్రమించామన్నారు. వీటితయారీ ఇప్పుడే పూర్తియిందని, పదిరోజులపాటు వీటిపై కఠినమైన ట్రయల్స్ టెస్టులు జరుగుతాయని వైష్ణవ్ చెప్పారు. రానున్న మూడునెలల్లో ప్రయాణీకులకు ఈసేవలు అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు. స్లీపర్ కోచ్‌ల్లో రీడింగ్ ల్యాంప్స్, ఛార్జింగ్ ఔట్‌లెట్‌లు, స్నాక్ టేబుల్, మొబైల్ మ్యాగజైన్ హోల్డర్లు ఉంటాయి. రైల్వేప్రమాదాలకు అట్టుకట్టవేసే కవచ్ వ్యవస్థ. అన్ని కోచ్‌లు స్టెయిలిన్‌లెస్ స్టీల్‌కార్ బాడీతో ఉంటాయి. జిఎఫ్ఆర్‌పి ఇంటీరియర్ ప్యానెల్స్ ఉంటాయి. అగ్నిమాపక భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉంటాయనిఆటోమేడిక్‌డోర్లు మెరుగైన సదుపాయాలతో మరుగుదొడ్లు కొతనత టెక్నాలజీతోరూపొందించిన సీటు కుషన్‌లు ఇందులో అమర్చారు. 16 కోచ్‌లు 832 బెర్తులతో స్లీపర్‌ట్రైన్‌రానుంది. వీటిలో 11 టైర్ ఎసి కోచ్‌లు అంటే 600బెర్తులు, నాలుగు టూటైర్ ఎసి కోచ్‌లు మొత్తం 188 బెర్తులు, ఒక ఫస్టైటర్ ఎసికోచ్ 24 బెర్తులతో ఉంటుంది. మూడు వెర్షన్లలో ఈరైళ్లు వస్తున్నాయి. సెమి హైస్పీడ్ వందే భారత్ చైర్‌కార్ రైళ్లదేశవ్యాప్తంగా మెట్రోనగరాల మధ్య నడుస్తు న్నాయి. వందేమెట్రో రైలును కూడా తీసుకువచ్చే కసరత్తులు చేస్తోంది. ఎక్కువ దూరం ప్రయాణీం చేవారికి మెరుగైన సదుపాయాలు అందించడం కోసం ఈ స్లీపర్ వెర్షన్‌ను కొన్నినెలల్లోనే పట్టా లెక్కించనున్నారు.

## రూ.12 కోట్ల విలువైన ఐఫోన్ల దోపిడీ




**భోపాల్, సెప్టెంబరు 1:** మధ్యప్రదేశ్‌లో భారీ చోరీ జరిగింది. సాగర్ జిల్లాలో ఒక కంటైనర్‌ట్రక్కు నుంచి దాదాపు 1500కు పైగా ఐఫోన్లలను దుండగులు చోరీ చేసారు. ఆ ట్రక్కు హర్యానా నుంచి చెన్నై వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. చోరీ అయి న ఐఫోన్ల విలువ 11-12 కోట్లవరకూ ఉంటుం దని వెల్లడించారు. కాగా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగాను ముగ్గురుపోలీసులపై వేటుపడింది. ఆగస్టు 15న జరిగిన ఈ సంఘటన ఆలశ్యంగా వెలుగులోకి వచ్చింది. గురుగ్రామ్‌నుంచి వచ్చిన ట్రక్కుమధ్యప్రదేశ్‌లోకి రాగానే కొందరు దుండగులు దానిపై దాడచేసారు. డ్రైవర్‌కు మత్తుమందు ఇచ్చి ఆతడిని బంధించి ట్రక్కులోని ఐఫోన్లను ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. స్పృహలోకి వచ్చిన డ్రైవర్ చోరీని గుర్తించి వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై దర్యాప్తుచేపట్టిన పోలీసులు ట్రక్కులో ఉన్న సెక్యూరిటీ గార్డును ప్రధాన నిందితుడిగా అనుమానిస్తున్నారు. ఆతడే తన అనుచరులకు ఫోన్‌చేసి దాడిచేయించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. నిందితులకోసం గాలిస్తున్నామని, డ్రైవర్ ఫిర్యాదు చేసిన వెంటనే కేసు నమోదుచేయకుండా అలసత్వం ప్రదర్శించిన ముగ్గురు సిబ్బందిపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ చోరీపై ఇప్పటివరకూ యాపిల్ సంస్థ పోలీసులను సంప్రదించకపోవడం గమనార్హం.

# ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే 70 స్థానాలు మావే

## ఢిల్లీ ఎమ్మెల్యే మనిష్ సిసోడియా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:** ఇప్పటికిప్పుడు ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహిస్తే మొత్తం 70 స్థానాల్లో తమ పార్టీయే విజయం సాధిస్తుందని ఆప్ నేత మాజీ డిప్యూటి సిఎంమనీష్ సిసోడియా అన్నారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పాదయాత్ర చేపట్టిన ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రిమనీష్ సిసోడియా బిజెపిపై విమర్శల దాడిచేసారు. తనను, ముఖ్యమంత్రి అరవింద్‌కేజ్రీవాల్‌ను తప్పుడు కేసుల్లో ఇరికించి జైలులోపెట్టారని ఆరోపించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో తాను చేపడుతున్న ప్రచారంలో తనకు లభించిన అభిమానాన్ని సిసో



డియా గుర్తు చేసుకుంటూ ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఆమ్ ఆద్మీపార్టీకి మొత్తం 70 స్థానాల్లోనూ విజయం తథ్యం అని అన్నారు. మొత్తం ఓట్లలో 70శాతం సాధిస్తుందని అన్నారు. తాను ఏ తప్పూ చేయలేదని అందుకే జైలునుంచి నువ్వుతూ బయటకు వచ్చానన్నారు. మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, అరుణాచల్‌ప్రదేశ్‌తో సహా అనేక ప్రభుత్వాలను బిజెపి పడగొట్టిందని తమ నాయకులపైకి ఈడీ సిబిఐలను పంపించి పార్టీని విచ్ఛిన్నం చేసే ప్రయత్నంచేసిందన్నారు. అయితే ఆమ్ ఆద్మీపార్టీ ఏమాత్రం బెదరకుండా మరింత బలం పుంజుకున్నదని అన్నారు. సీఎం అరవింద్‌కేజ్రీవాల్ త్వరలోనే మన మధ్యకు వస్తారని అన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 70స్థానాలకుగాను 62 స్థానాల్లో ఆప్ విజయం సాధించింది. ఇటీవలజరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మొత్తం ఏడు స్థానాలను బిజెపి గెలుచుకుంది. మద్యం కుంభకోణంలో అరెస్టు అయిన మనీష్ సిసోడియా17 నెలల పాటు తీహార్‌జైలులో గడిపిన తర్వాత గత నెల ప్రారంభంలో విడుదలయ్యారు.



## రూ.39 పెరిగిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:** చమురు మార్కెటింగ్ కంపెనీలు వాణిజ్య ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లధరలను సవరించాయి. సెప్టెంబరు ఒకటినుంచి ఢిల్లీలో 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ రూ.39 రూపాయలు పెరిగింది. కోల్‌కత్తాలో వాణిజ్య సిలిండర్ రూ.1802.50గా ఉంటే ముంబయిలో కొత్తధర 1644గా ఉంది. చెన్నైలో వాణిజ్య సిలిండర్ 1855కి చేరింది. గడచిన జులై ఒకటవ తేదీ వాణిజ్యసంస్థలకు ఉపశమనం కలిగించేందుకు చమురు మార్కెటింగ్ కంపెనీలు వాణిజ్య ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. జులై ఒకటిన 19 కిలోల కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్‌ధర రూ.30 తగ్గింది. ప్రతినెల ప్రారంభంలో ఎల్పీజీ సిలిండర్‌ధరల్లో చోటుచేసుకుంటున్న సర్దుబాట్లు మార్కెట్‌ను ప్రభావితం చేస్తుంటాయి. అంతర్జాతీయ చమురుధరలు, పన్నుల విధానాలు, సరఫరా, డిమాండ్ వంటి వివిధ అంశాలు ఈధరల నిర్ణయాల్లో కీలకంగా ఉంటాయి.

## వాయిదాల పద్ధతి కట్టడితోనే సత్వరన్యాయం

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:** సత్వరం న్యాయం కక్షిదారులకు అందించాలంటే కోర్టుల్లో వాయిదాల సంస్కృతి మారాల్సి న అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు. పెండింగ్‌కేసులు భారీ స్థాయిలో పెరిగిపోవడం అతిపెద్ద సవాల్ అన్నారు. జిల్లా న్యాయవ్యవస్థ జాతీయ సదస్సు లో ప్రసంగించిన ఆమె న్యాయాన్ని రక్షించాల్సి న బాధ్యత దేశంలోని న్యాయమూర్తులందరిపైనా ఉందన్నారు. కోర్టులకు హాజరుకావడం అనేది సామాన్యులపై ఒత్తిడిని పెంచుతుందని కోర్టుల్లో వాయిదాల పద్ధతిని మార్చేందుకు అన్ని విధాలా కృషి చేయాలని న్యాయాన్ని రక్షించాల్సి న బాధ్యత అందరిపైనా ఉందని రాష్ట్రపతి ముర్ము అన్నారు. న్యాయవ్యవస్థలో మహిళా అధికారుల సంఖ్య పెరగడంపై సంతోషం వ్యక్తం చేసారు. భారత్ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి జ.స్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌మేఘవాల్‌లు హాజరయ్యారు. మరోవైపు ముందురోజు ఇదే సదస్సులో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోడీ మహిళలపై జరిగే నేరాల్లో బాధితులకు సత్వర న్యాయం లభించాలని, అప్పుడే వారికి భద్రతపై భరోసా లభిస్తుందని ఉద్ఘాటించారు. ఈ క్రమంలోనే 2019లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల పథకాన్ని తీసుకు వచ్చామని ప్రధాని మోడీ గుర్తు చేసారు.



## రష్యాపై అర్ధరాత్రి విరుచుకుపడిన ఉక్రెయిన్

# 158 డ్రోన్లు కూల్చివేత

**మాస్కో, సెప్టెంబరు 1:** రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య డ్రోన్ల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మాస్కో సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా దూసుకొచ్చిన 158 ఉక్రెయిన్ డ్రోన్లను సమర్థవంతంగా కూల్చేసినట్లు రష్యా రక్షణమంత్రిత్వ శాఖ పేర్కొంది. మాస్కో సహా మరో తొమ్మిది ప్రాంతాలపై అర్ధరాత్రివేళ ఈ దాడులు జరిగినట్లు తెలిపింది. ఇందులో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని వివరించింది. యుద్ధం మొదలైన తర్వాత ఉక్రెయిన్ జరిపిన అతిపెద్ద డ్రోన్ దాడుల్లో ఇదిఒకటని అధికారులు వెల్లడించారు. ఉక్రెయిన్ సరిహద్దుల్లో ఉన్న కుర్స్క్, బ్రయాన్స్క్, వొరోనెజ్, బెల్గోరోడ్ ప్రాంతాల్లో 122 డ్రోన్లు కూల్చినట్లు రష్యా అధికారులు తెలిపారు. బ్రాయన్స్క్ ప్రాంతం భూభాగంపై భారీ యుఎవి డ్రోన్‌ను మా దళాలు తిప్పికొట్టా యని ప్రాంతీయ గవర్నర్ అలెగ్జాండర్ బోగో మాజ్ వెల్లడించారు. ఇక, మూడు డ్రోన్లు కషీరా బొగ్గు ఆధారిత పవర్ స్టేషన్ ఢీకొట్టేందుకు ప్రయత్నించాయని స్థానిక అధికారి తెలిపారు. అయితే ఎటువంటి నష్టం జరగలేదన్నారు. ఈ దాడుల కారణంగా నగర సరహద్దులోని బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్ దెబ్బతిన్నట్లు తెలిపారు. రష్యా వార్తా సంస్థలు సైతం ఈవిషయాన్ని ధ్రువీకరించాయి. బెల్గ్‌రోడ్‌లోని మూడు నివాస భవనాల్లోని అద్దాలు దెబ్బతినగా, ఒక ప్రైవేట్ నివాస యుటిలిటీ భవనం పూర్తిగా ధ్వంసమైందని స్థానిక గవర్నర్ వ్యాచెస్లావ్ గ్లాడ్కోవ్ తెలిపారు.



## బంగ్లాదేశ్‌లో వేలాది ఆయుధాల లూటీ!

### అప్పగించాలని పోలీసుల ఆదేశం

**ఢాకా, సెప్టెంబరు 1:** రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనలతో ఇటీవల బంగ్లాదేశ్ అట్టుడికిపోయింది. దేశవ్యాప్తంగా హింసాత్మక ఘటనలు చెలరేగాయి. కల్లోల పరిస్థితులు, పోలీసుల గైర్హాజరును అదనుగా తీసుకుని పోలీసు స్టేషన్లపైనా ఆందోళనకారులు విరుచుకుపడ్డారు. ఈ క్రమంలోనే పెద్దఎత్తున ఆయుధ సామగ్రిని లూటీ చేశారు. ప్రస్తుతం పరిస్థితులు అదుపులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు కీలక ప్రకటన చేశారు. దోచుకున్న ఆయుధాలను ఈ నెల 3వ తేదీనాటికి అప్పగించాలని హెచ్చరించారు. ఆందోళనకారులు లూటీ చేసిన వాటిలో శనివారం నాటికి మొత్తం 3,872 ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 2.86 లక్షల బుల్లెట్లు, 22వేలకుపైగా టియర్‌గ్యాస్ షెల్స్, రెండు వేలకుపైగా గ్రనేడ్‌లనూ స్వాధీనం చేసుకున్నారు. హసీనా 15 యేళ్ల పాలనలో పౌరులకు జారీ చేసిన ఆయుధ లైసెన్సులను రద్దు చేయాలని మధ్యంతర ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఈ క్రమంలోనే సంబంధిత ఆయుధాలనూ సెప్టెంబరు 3వ తేదీనాటికి అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించింది. అనంతరం మిగిలిన ఆయుధాలను స్వాధీనం చేసుకునేందుకు ఈనెల 5న ప్రత్యేక తనిఖీలు ప్రారంభించనున్నట్లు తెలిపింది. బంగ్లాదేశ్‌లో నిరసనలు హింసాత్మకంగా మారడంతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. నిరసనలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు మృతుల సంఖ్య 600దాటింది. ఈ ఘటనల్లో 43 మంది పోలీసులూ ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.



## ఐఎఎస్ అకాడెమీకి ఐదు లక్షల జరిమానా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:** సివిల్స్ పరీక్షల శిక్షణా సంస్థ శంకర్ ఐఎఎస్ అకాడమీకి జరిమానా పడింది. 2022 సివిల్ సర్వీస్ పరీక్షకు సంబంధించి తప్పుదోవపట్టించే ప్రకటనలు చేసినందుకుగాను కేంద్ర వినియోగదారుల భద్రత సంస్థ చర్యలు చేపట్టింది. ఈ అకాడమీకి రూ.5 లక్షలజరిమానా విధించింది. సిసిపిఎ ఒక ప్రకటనలో వివరాలను తెలిపింది. తమ సక్సెస్‌రేటు, సివిల్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తీసుకున్న కోర్సుల గురించి ఈ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ తప్పుడు ప్రకటనలుచేసిందని సిసిపె గుర్తించింది. 2022 యుపిఎస్‌సి సివిల్ సర్వీస్ కోసం శంకర్ ఐఎఎస్ అకాడమీ ఒక యాడ్ ఇచ్చింది. అందులో ఆలిండియా లెవెల్‌లో ఎంపికైన 933 మందిలో 336మంది తమ అకాడమీలో శిటక్షణ తీసుకుంటున్నట్లు తెలిపింది. ఇక టాప్ 100లో తమ ఇన్‌స్టిట్యూట్ నుంచి 40మంది అభ్యర్థులు ఉన్నట్లు ప్రచురించింది. దేశంలోనే ఉత్తమ ఐఎఎస్ అకాడమీ తమదేనంటూ ప్రకటనలో రాసుకుంది. ఫిర్యాదులు చేయడంతో సిసిపిఎ దర్యాప్తు చేసింది. శంకర్‌ఐఎఎస్ అకాడమీ ఉద్దేశ్య పూర్వకంగా ఈ ప్రకటన ఇచ్చినట్లు తెలిసింది. ఉత్తీర్ణత సాధించినఅభ్యర్థులు తీసుకున్న కోర్సులను ఇన్‌స్టిట్యూట్ దాచిపెట్టినట్లు తేలింది. ఈ అకాడమీనుంచి ఉత్తీర్ణత సాధించినట్లు చెపుతున్న 336 మందిలో 221 మంది కేవలం ఉచిత ఇంటర్వ్యూ గైడెన్స్ ప్రోగ్రామ్‌నుమాత్రమే తీసుకున్నారని దర్యాప్తులో వెల్లడయింది. మిగతావారు కూడా షార్ట్‌టర్మ్ కోచింగ్‌కు తీసుకున్నవారేనని తెలిసింది. దీంతో ఈ వ్యవహారాన్ని సిసిపిఎ తీవ్రంగా పరిగణించింది. మన దేశంలో ఏటా పదిలక్షలమందికిపైగా సివిల్స్ పరీక్షలకు హాజరవుతున్నారు. ఇలాంటి తప్పుదోవ పట్టించే ప్రకటనలు వారిపై ప్రభావం చూపిస్తాయని పేర్కొంది. అందువల్ల ఈ అకాడమీకి ఐదు లక్షల జరిమానా విదిస్తున్నట్లు వెల్లడించింది. ఈ అకాడమీ ప్రధాన కార్యాలయం చెన్నైలో ఉండగా దేశవ్యాప్తగా అనేక రాష్ట్రాల్లో దీనికి కోచింగ్ సెంటర్లు ఉన్నాయి.

# గాజా సొరంగంలో బందీల మృతదేహాలు..

## అతి దారుణంగా చంపేసిన హమాస్

**జెరూసలేం, సెప్టెంబరు 1:** ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ, బందీల విడుదలకు ప్రయత్నాలు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. హమాస్ చెరలో ఉన్న వారిలో ఆరుగురి మృతదేహాలు లభ్యమైనట్లు ఇజ్రాయెల్ శనివారం వెల్లడించింది. దక్షిన గాజా పట్టీలోని రఫా నగరంలో ఐడిఎఫ్ దళాలు చేపట్టిన ఆపరేషన్‌లో వీరి మృతదేహాలను గుర్తించారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. రఫాలో హమాస్‌కు చెందిన ఓ సొరంగంలో ఆరుగురు బందీలు మృతి చెంది కన్పించినట్లు ఐడిఎఫ్ వెల్లడించింది. ఇజ్రాయెల్ దళాలు అక్కడకు వెళ్లడానికి కొద్ది గంటల ముందే హమాస్ ఉగ్రవాదులు ఆ బందీలను అతికిరాతకంగా చంపేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. గతేడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై జరిపిన మెరుపు దాడి సమయంలో హమాస్ వీరిని బంధించినట్లు తెలిపారు. అప్పటి నుంచి వీరిని చిత్రహింసలకు గురిచేసి ఉంటారని అనుమానిస్తున్నారు. గతవారం ఇదే రఫా ప్రాంతంలో ఓ



బందీని ఐడిఎఫ్ దళాలు సొరంగం నుంచి కాపాడాయి. ఆ సొరంగానికి కిలోమీటరు దూరంలో ఉన్న మరో సొరంగంలో ఈ బందీల మృతదేహాలు లభించడం గమనార్హం. మృతుల్లో ఒకరు ఇజ్రాయెల్-అమెరికన్ అయిన 23 యేళ్ల హెర్ష్ గోల్డ్‌బర్గ్‌పొలిన్ అని ఐడిఎఫ్ తెలిపింది. అతడి మృతిని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ కూడా ధ్రువీకరించారు. అతడి మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈనేరాలకు గానూ హమాస్ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. మిగతా బందీల విడుదల కోసం ఇజ్రాయెల్-హమాస్ మధ్య సత్వర ఒప్పందం కుదిరేలా కృషి చేస్తామన్నారు. ఇదిలా ఉండగా తాజా మరణాల వార్తతో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బందీల ప్రాణాల గురించి ఆయన పట్టించుకోవడంలేదని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. గతేడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపుదాడికి పాల్పడి వందల మందిని అతికిరాతకంగా చంపేసిన సంగతి తెలిసిందే. కొందరిని బందీలుగా చేసుకొని గాజా తీసుకెళ్లింది. దీనికి ప్రతీకారంగా గాజా పట్టీపై ఇజ్రాయెల్ భీకర దాడులు కొనసాగిస్తోంది. ఐడిఎఫ్ దాడుల్లో ఇప్పటివరకు 40,691 మంది మరణించినట్లు పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

ఇక, ఒప్పందంలో భాగంగా హమాస్ చెరలో ఉన్న బందీల్లో కొంతమందిని గతంలో విడుదల చేయగా ఇంకా ఎంతమంది ప్రాణాలతో ఉన్నారన్నది స్పష్టత లేదు.



మంగళగిరి నియోజకవర్గం ముంపుప్రాంతాల్లో పర్యటించిన మంత్రి లోకేష్

# మంగళగిరిలో ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి మాస్టర్ ప్లాన్

## ముంపు ప్రాంతాల్లో మోటార్లతో నీరు తోడాలని మంత్రి లోకేష్ ఆదేశం

## కొండ చరియలు పడి మృతిచెందిన నాగరత్నమ్మ కుటుంబానికి రూ.5లక్షలు అందజేత

**మంగళగిరి, సెప్టెంబర్1,ప్రభాతవార్త :** మంగళగిరి నియోజకవర్గంలో ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి మాస్టర్ ప్లాన్ రూపొ ందిస్తామని ఇందులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,స్ట్రోమ్ వాటర్ డ్రైనేజీ సిస్టమ్ అంతర్భాగాలుగా ఉంటాయని రాష్ట్ర విద్య,ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.ముంపుకు గురైన తాడేపల్లి నులకపేట క్వారీ ఏరియా,మంగళగిరి రత్నాల చెరువు, దీన్ దయాళ్ నగర్,టిడ్కో కాలనీ ప్రాం తాలను మంత్రి లోకేష్ ఆదివారం పరిశీలిం చారు.స్థానిక కొత్తపేటలో కొండచరియలు విరిగిపడి దెబ్బతిన్న ఇంటిని లోకేష్ పరిశీలించారు.కొండచరియలు విరిగిపడి మృతిచెందిన నాగరత్నమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించిన లోకేష్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం తరపున రూ.5లక్షల పరిహారం చెక్కును అందజేశారు.రత్నాల చెరువు,నులకపేట క్వారీ ఏరియా ప్రాంతాల్లో ఇళ్ళ మధ్య చేరిన నీటిని ఆయిల్ మోటార్లు ఏర్పాటుచేసి వెంటనే తొల గించాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశిం చారు. తాగునీటికి ఇబ్బందిగా ఉందని ఎవరూ ఫోన్ చేసినా గంటలో ట్యాంకర్ పంపేలా ఏర్పా ట్లు చేయాలన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా 4500 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా,3800 ట్రాన్స్ ఫార్మర్ల పరిధిలో విద్యుత్ పునరుద్ధరించినట్లు ట్రాన్స్‌కో ఈఈ తెలిపారు.

**అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష:** ముంపు ప్రాంతాల పరిశీలన అనంతరం సహాయ చర్యలపై మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయంలో మంత్రి లోకేష్ అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ వచ్చే వారంరోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.గత 25ఏళ్ళలో ఎప్పుడూ లేని విధంగా వర్షాలుపడ్డాయని,ప్రజలు ధైర్యంగా ముందుకువచ్చి తమ సమస్యలు చెప్పుకున్నారన్నారు.మున్సిపల్ కమిషనర్ హలీమ్ భాషా మాట్లాడుతూ వందరోజుల ప్రణాళికల్లో భాగంగా మంగళగిరి నియోజకవర్గ పరిధిలో 452కిమీల మేర డ్రైన్లలో రూ.48లక్షల వ్యయంతో పూడిక తీశామన్నారు.

**జనావాసాల్లో నీరు తోడేందుకు మోటార్లు :** నియోజకవర్గ పరిధిలో ఎక్కడా జనావాసాల్లో నీరు నిల్వడానికి వీల్లేదని, అవసరమైన చోట్ల మోటార్లు ఏర్పాటు చేసి వర్షపు నీరు తోడేయాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు.వర్షపు నీరు చేరిన చోట్ల బ్లాక్‌లు క్లియర్ చేసేందుక 7టీమ్‌లు ఏర్పాటుచేశామని చెప్పారు.ఇరిగేషన్ శాఖ అధికారి మాట్లాడుతూ గుంటూరు చానల్ 0-14కిమీ పరిధిలో 8చోట్ల గండ్లు పడ్డాయని చెప్పారు.యుద్ధప్రాతిపదికన ఇసుక బస్తాలు ఏర్పాటుచేయాలని మంత్రి ఆదేశించారు. మంచినీటి సరఫరా కోసం తాము సొంతంగా 5ట్యాంకర్లు ఏర్పాటుచేశామని కార్పొరేషన్,సెక్రటేరియట్ అధికారులు సమన్వయం చేసుకొని ఎక్కడా తాగునీటి సమస్యల తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశం అనంతరం మంత్రి లోకేష్ విలేకరులతో మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా 11ప్రాంతాల్లో వర్షపు నీరు చేరిందని,8జేసిబిలు ఏర్పాటుచేసి బ్లాక్‌లను తొలగించినట్లు చెప్పారు. టిడిపి,జనసేన కార్యకర్తలు సహాయ చర్యల్లో పాల్గొంటున్నారని అన్నారు.మురుగునీరు ఇరిగేషన్ కాల్వలోకి వదలకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.టిడ్కో గృహాల వద్ద లీకులున్నాయని వాటిని సరిచేయాలిసిందిగా అధికారులకు ఆదేశాలిచ్చామని తెలిపారు.ముంపు నివారణకు మాస్టర్ ప్లాన్ రూపొందించి శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.



భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ పి.జగదీష్ ఇతర అధికారులు

# క్రికెట్ ఆటగాళ్ల భద్రతపై జిల్లా ఎస్పీ సమీక్ష

**అనంతపురం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త బ్యూరో:** ఈ నెల 5 నుంచి 22వ తేది వరకు అనంతపురం ఆర్డిటి మైదానంలో జరిగే దులీప్ ట్రోఫీలో పాల్గొనేందుకు విచ్చేస్తున్న భారత క్రికెట్ ఆటగాళ్ల భద్రతపై జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదివారం సమీక్షించారు. క్రికెట్ ఆటగాళ్లు అనంతపురంలో బస చేస్తున్న మాసినేని, అలెగా ఓడర్ లాడ్జిలలో కేటాయించిన గదులను పరిశీలించారు. భద్రతా పరంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో పోలీసు అధికారులకు దిశ నిర్దేశం చేశారు. అనంతరం భారత క్రికెట్ ఆటగాళ్లు స్థానిక ఆర్డిటి మైదానానికి వెళ్లొచ్చే రూట్లలో ఎస్పీ పర్యటించి పలు సూచనలు చేశారు. ఆర్డిటి మైదానంలో ఎలాంటి చర్యలు చేపట్టాలో పోలీసు అధికారులకు వివరించారు. డ్రెస్సింగ్ రూమ్‌లు, పార్కింగ్ ప్రదేశాలు, ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లు, గ్యాలరీలు, పార్కింగ్ స్థలాలు, తదితర ప్రదేశాలను నిశితంగా పరిశృలించారు. అదే విధంగా.. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల రాకపోకలు సాఫీగా జరిగేలా సూచనలు చేశారు. జిల్లా ఎస్పీతోపాటు అనంతపురం రూరల్ డిఎస్పీ బి.శివారెడ్డి, ఏఆర్ డిఎస్పీ మునిరాజ, వన్ టౌన్ సిఐ రాజేంద్రనాథ్ యాదవ్, టూ టౌన్ సిఐ శ్రీకాంత్, రాప్తాడు సిఐ శ్రీహర్ష, ఆర్ఐకె. రాముడు, వన్ టౌన్ ఎస్సై రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఐతవరం జాతీయ రహదారిపై మున్నేరు వరదనీరు

## పూర్తిగా నిలిచిపోయిన వాహనాల రాకపోకలు

**విజయవాడ.సెప్టెంబరు1,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ- హైదారాబాద్ 65వ జాతీయ రహదారిపైకి నందిగామ శివారు అయితవరం వద్ద ఉపనది మున్నేరు వరద నీరు పొంగి ప్రవహిస్తుంది.కృష్ణవేణికి ఉపనది మున్నేరు వరద ఉధృతి రెండు రోజులుగా అధికంగా ఉంటుంది.నీరు రోడ్డుపైగా పొర్లిపారుతుండటంతో ముందు జాగ్రత్త చర్యగా వాహనాల రాకపోకలును వెవెన్యూ అధికారులునియంత్రించారు. ఒక దానివెంట ఒకటి ఆపి పోలీసుల సహాయంతో పంపించారు.అయితే వరద ఉధృతి తీవ్రంగా పెరిగి ఆదివారం సాయంత్రానికి 65వ జాతీయరహదారిపై మూడు అడుగులపైకి చేరింది. సమీప పంటపొలాలు ముంపుకు గురయ్యాయి. దీంతో పూర్తి ఇటుగా వాహనాలు రాకపోకలను నిలిపివేసారు.ఆర్డీవో రవీంద్రరావు,ఎసీపీ.ఇతర అధికారులు ఇక్కడ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.ముంపుకు గురైన రోడ్డు ప్రాంతానికి కిలో మీటరు అవతల మోటారు వాహనాలను నిలిపివేసారు.విజయవాడ నుంచి వచ్చిన వాహనాలను కీసర నుంచే వెనక్కి మళ్ళించారు.అయితవరం నుంచి వెనక్కు పంపించారు.హైదారాబాద్ వైపు నుంచి వస్తున్న వాహనాలను చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద,విజయవాడ వైపు కీసర టోల్‌ప్లాజా వద్ద నిలిపివేసారు.దీంతో హైవే స్తంభించిపోయింది,వరద తగ్గేవరకు హైవేపై ఎవ్వరిని అనుమతించబోమని నందిగామ ఆర్డీవో రవీంద్రరావు స్పష్టంగా చేసారు. విజయవాడ వైపునుంచి వచ్చే వాహనాలను ఖమ్మంజిల్లా వైపు మళ్ళించే అవకాశం లేకుండా పోయింది.ఈ పరిస్థితి కారణంగా హైదారాబాద్‌నుంచి వచ్చే వాహనాలు విజయవాడ వైపు వచ్చే పరిస్థితి లేదు.దీంతో వాహనాలన్ని 65వ జాతీయ రహదారిపై నిలియివున్నాయి..అన్ని వైపుల జాతీయరహదారులపై కీలకంగా ఖమ్మం- కొదాడ నడుమ రోడ్డుపై వరద నీరు రావడంతో విజయవాడ- హైదారాబాద్‌ల నడుమ రాకపోకలు నిలిచాయి.గుంటూరు మీదుగాను వాహనాలను మళ్ళించడానికి అధికారులు అంగీకరించడం లేదు.



ఆంధ్రా-తెలంగాణ రాష్ట్రలను కలుపుతున్న గరికపాడు పాలేటి బ్రిడ్జిని తాకి రహదారిపై పడిన ప్రమాదకర గండి, ముంపున కు గురైన జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామం. వరద ముంపునకు గురైన పంటపొలాలు.

# ప్రజల్ని భీతావహుల్ని చేసిన అతిభారీ వర్షాలు

## క్షణక్షణం భయం..భయం..

## విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై వరద నీరు : రాకపోకలు బంద్

## హైవేపై కోతకు గురైన గరికపాడు పాలేటి బ్రిడ్జి

## ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రాంతంలో భయకంపితులను చేసిన వరదలు

## గ్రామాలను విడిచి సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్న ప్రజానీకం

## ప్రమాదాల్లో చిక్కుకున్న పలు సంఘటనల్లో 17 మందిని రక్షించిన ప్రభుత్వ సిబ్బంది

**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** ఈ శతాబ్ధంలో ఎప్పుడూ లేని విధంగా అతిభారీ వర్షాలు ప్రజల్ని భీతావహుల్నిచేశాయి. బంగాళా ఖాతంలో ఏర్పడ్డ తుఫాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అస్థవ్యస్తంగా మార టమే కాకుండా పలు గ్రామాలు జలదిగ్భందంలో చిక్కుకున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మున్నెన్నడూ లేనివిధంగా వరద నీరు ఇండ్లలోకి చేరటం, రెండు చెరువులకు గండ్లు పడటం, పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంతోపాటు నియోజకవర్గ పరిధిలోని జగ్గయ్యపేట మండలం, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలలో కురుస్తున్న భారీ వర్షంతో 4,300ల ఎకరాల్లో పత్తి పంట, 7,200ల ఎకరాల్లో వరి పంట, 3,500ల ఎకరాల్లో మిర్చి పంటలు ముంపుకు గురైనట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు వెల్లడించారు. గతవారం నాట్లు వేసిన, మిర్చి, వరి పంటలకు అధిక నష్టం వాటిల్లే అవకాశం ఉందని, వర్షాలు తగ్గిన తర్వాత పూర్తిస్థాయి పరిశీలన చేస్తామని వారు తెలిపారు.

**పిండ ప్రధానానికి వెళ్ళి పాలేటి ముంపులో చిక్కుకున్నారు:** ఇటీవల మరణించిన రెండు కుటుంబాలకు సంబంధించిన వారు ఇరువురు పూజారులతో కలిసి మొత్తం పది మంది పాలేటి శ్మశానవాటికకు ఆదివారం ఉదయం వెళ్ళారు. అంతలోనే క్రమక్రమంగా పాలేటి వరద పెరిగిపోవటంతో వారు ఒడ్డుకు రాలేక పిండప్రధాన ప్రాతంలోని ఒక కట్టుబడిపైకి ఎక్కి రక్షించాలని కేకలు వేశారు. సమాచారం అందుకున్న స్థానిక ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ వెళ్ళి రావిరాల నుండి పడవను, గజ ఈతగాళ్ళను యుద్ధప్రాతిపదికన రప్పించి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అలాగే వత్సవాయి మండలంలో కరెంటు సరఫరా నిలిచిపోగా ఇరువురు విద్యుత్ ఉద్యోగులు లింగాల మునేటి కాజేవే వద్ద రిపేర్లు చేస్తూ మునేటి వరదకు గురై అక్కడే చిక్కుకుపోయారు. ఎంఎల్ఏ రాజగోపాల్ వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చేవరకు విశేష పరిశ్రమచేశారు. జగ్గయ్యపేట మండలంలోని బూదవాడ గ్రామం పాలేటి వరద తాకిడికి గురైంది, ఇండ్లలోకి ఐదుగుల వరకు వరద నీరు చేరుతుండగా ఇండ్లను వదలి సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్స్ ఫ్యాక్టరీలోని సురక్షిత ప్రాంతాని వెళ్ళి ప్రాణాలు నిలువుకున్నారు. నవాబుపేట, చిల్లకల్లు చెరువులకు వరదలతో గండ్లుపడ్డాయి. కాగా రాష్ట్ర సరిహద్దులోని గరికపాడు పాలేటి బ్రిడ్జిని తాకిన వరద కారణంగా బ్రిడ్జి అంచేన రహదారి కోతకు గురైంది. ఎగువన రామాపురం క్రాస్‌రోడ్, కోదాడ సమీపంలోని ద్వారకుంట వద్ద వరద నీరు హైవే మీదుగా ప్రవహిస్తుండటంతో హైదరాబాద్ నుండి విజయవాడకు వెళ్ళే వాహనాలను నిలిపివేశారు. జగ్గయ్యపేట పట్టణంలోని క్రిష్టియన్‌పేట, విలియంపేటలు పాలేటి వరదకు గురయ్యాయి. పలు ఇండ్లలోని వరద రావటంతో నివాశితులు ఇండ్లు ఖాళీచేశారు. పట్టణంలోని కాకానినగర్ బిలాల్ మసీదు వద్ద 9 ఏండ్ల బాలుడు కాలుజారీ వేపలవాగులో పడిపోయాడు. గమనించిన మౌలానా షేక్ ఆదిల్ అహ్మద్ వాగులోకి దుమికి బాలుడిని రక్షించారు.

**జగ్గయ్యపేట పట్టణంలో పది రోజులపాటు మంచినీటి సరఫరా బంద్:** పాలేటి వరద మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ యూనిట్‌ను ముంచివేయటంతో జగ్గయ్యపేట పట్టణానికి మంచినీటి సరఫరా విభాగం పూర్తిగా దెబ్బతింది. యూనిట్‌ను తిరిగి పునరుద్ధరించేందుకు కనీసం పది రోజుల వ్యవధి పడుతుందని ఇంజనీరింగ్ అధికారులు అంటున్నారు. దీంతో నీటి సరఫరాకు ఎన్నడూ లేని విధంగా అవరోధం కలిగిందని, సాధ్యమైనంత వరకు ట్యాంకర్లతో మంచినీటి సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు.

# రైతులకు భరోసా కల్పించండి

## వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్

## వ్యవసాయశాఖ సంచాలకులు ఎస్.డీల్లీ రావు

**సచివాలయం. సెప్టెంబర్ 1. ప్రభాతవార్త:** వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా పాలన యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ రైతులకు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు ఎస్.డీల్లీరావు అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల వ్యవసాయ అధికారులు మరియు అనుబంధ శాఖల అధిపతులతో రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాను రాష్ట్ర తీరం దాటి వర్షాలు తగ్గుముఖం పట్టిన దృష్ట్యా అధికార యంత్రాంగం పంటలను కాపాడుకుని రైతులకు భరోసాను కల్పించే తక్షణ చర్యలపై చర్చించారు. ఉత్తర కోస్తా మరియు రాయలసీమ జిల్లాల్లోని అధికారులు మాట్లాడుతూ ఈ వర్షాలు ఈ ప్రాంత పంటలకు అనుకూలంగా వుండి మేలు చేసివిగా ఉన్నాయన్నారు. దీనిపై వ్యవసాయ సంచాలకులు ఎస్.డీల్లీరావు స్పందిస్తూ ఈ వర్షాలను రాయలసీమ మరియు ఉత్తర కోస్తా అధికారులు అవకాశంగా తీసుకొని రైతులకు మేలైన పంటలు, ఎరువుల యాజమాన్య పద్ధతులను అనుసరించే విధంగా ప్రచారం చేయాలన్నారు. పంటలు ఎక్కువగా ముంపునకు గురైన కృష్ణా నది బేసిన్ పరివాహక జిల్లాలైన ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల మరియు ఏలూరు జిల్లాల వ్యవసాయ అధికారులతో మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ముంపు బారిన పొలాలను గుర్తించడం, డ్రైయన్ల నుండి నీరు బయటకు పోని ప్రాంతాలను గుర్తించి, స్థానిక జిల్లా యంత్రాంగంతో నీటి పారుదల అధికారులతో సంప్రదిస్తూ సమన్వయం చేసుకుంటూ ముంపు ప్రాంతాల పంటల నుండి నీళ్లను బయటకు వెళ్లగొట్టే ప్రక్రీయ చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణ ప్రాంతం నుండి దిగువ పల్లపు ప్రాంతానికి పారుతున్న వర్షపు నీటి మూలంగా ఎన్టీఆర్ జిల్లాలోని మున్నేరు, కట్టలేరు, బుడమేరులలో నీరు పొంగి ప్రవహిస్తూ పొలాలను ముంపునకు గురవుతున్నాయన్నాని, అధికారులందరు అప్రమంతంగా ఉండాలన్నారు. వరి, పత్తి, మొక్కజొన్న, కంది పంటల వారీగా విడుదల చేసిన శాస్రీయ సూచనలను వివిధ మాధ్యమాల ద్వారా రైతులకు తెలియజేసి పంటలను కాపాడాలన్నారు. ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ ముంపుబారిన పొలాలను అంచనా వేయడానికి సాంకేతికతను ఉపయోగించాలన్నారు. డ్రోన్ల మరియు శాటిలైట్ ద్వారా పంట నష్టాన్ని అంచనా వేసి ఏ మేరకు చేయవచ్చో రాష్ట్ర రిమోట్ సెన్సింగ్ వారితో చర్చించమని యూనివర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ సత్యనారాయణకు సూచించారు.

డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సాగులో ఉన్న వరి రకాలు పూర్తిగా ముంపు బారిన పడిన కూడా నీరు బయటకు పోయిన తరువాత తిరిగి పూర్తి స్థాయిలో కోలుకునే శక్తి వాటికి ఉందన్నారు. బీపీటీ 5204 సాంబమసూరి రకం 3 రోజుల వరకు, యం.టీ.యు 1318 రకం 5 రోజుల వరకు, యం.టీ.యు 1061 రకం 7 రోజుల వరకు పూర్తిగా ముంపు బారిన పడినా కూడా వరి పంటకు ఏవిధమైన ప్రమాదం లేదని తెలియజేస్తూ రైతులకు భరోసా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తదితరలు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి, విదేశీపెట్టుబడుల సేకరణకు ప్రాధాన్యత

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** ఆంధ్రరాష్ట్ర ప్రజలు ఉమ్మడి ప్రభుత్వంపై ఎన్నో ఆశలతో పట్టం కట్టారని వారి ఆశలు, ఆలోచనలకు అనుగుణంగా ఎంతో అనుభవం ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారని రాష్ట్ర మైక్రో,చిన్న, మధ్య ఎంటర్‌ప్రైజస్,గ్రామీణ పేదరిక నిర్మూలన, ఎన్ఆర్ఐ సాధికారికత మరియు సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం శ్రీజ్ఞానప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ యువత కు ఉపాధి కోసం పరిశ్రమల స్థాపనకు విదేశీపెట్టుబడులను, పారిశ్రామిక వెత్తలను ఆకర్షించుటకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని మంత్రి శ్రీనివాస్ వివరించారు.గత పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారిందన్నారు. నాలుగు నెలల నుంచి ఏ శాఖలో ఏం లోసుగులున్నాయో తెలుసుకోవటానికి సరిపోతుందన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**యువతకు ఉపాధే లక్ష్యంగా అడుగులు:** ఆంధ్ర రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధితో పాటు రాష్ట్రానికి సంబంధించిన మేధా సంపత్తి బయట వెళ్ళిందన్నారు. వారి సేవల్ని ఆలోచనల్ని మన రాష్ట్రంలో ఉపయోగించుకొనుటకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందడుగు వేస్తున్నారని వివరించారు.నిత్యం పారిశ్రామిక వెత్తలతో చర్చిస్తూ పెట్టుబడులు,పరిశ్రమల స్థాపనతో ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పని చేస్తున్నారన్నారు.ఓ వైపు యువత సేవలు ఉపయోగించుకొనుట మరో వైపు రైతు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వివరించారు.లక్షలాది మంది యువకులు విదేశాల్లోనూ, ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తున్నట్లు ఇటీవల జరిగిన ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకొనుటకు రావటం నిదర్శనం అన్నారు. ఆ యువత అందరికి మన రాష్ట్రంలోనే పెద్ద పెద్ద పరిశ్రమలు ఏర్పాటుచేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని రాష్ట్రం అభివృద్ధితోపాటు యువత కుటుంబాలతో సంతోషంగా ఉంటారని భావిస్తూ బడా కంపెనీల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**రాష్ట్రం అభివృద్ధి: సంక్షేమానికి పెద్ద పీట:** రాష్ట్రం అభివృద్ధి చెందాలని అలాగే సంక్షేమ పథకాలు ఏవీ కూడా ఆగరాదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచన అన్నారు. అందుకు ఆయన అహర్నిశలు పని చేస్తూ తమను పరుగులు తీయిస్తున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.తాము ఎంత కృషి చేసినా ప్రతి పథకం విజయవంతం కావాలన్నా,నిధులు సమకూరాలన్నా భగవంతుని ఆశీస్సులు ఎంతో అవసరం అన్నారు. ఆ వరాన్నే తాను మహిమాన్వితుడైన పరమేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో స్వామితో పాటు అమ్మను కూడా వేడుకున్నానని మంత్రి వివరించారు. ఆయనతో పాటు శ్రీకాళహస్తి మండల తెలుగుదేశం నాయకుడు కామేష్‌యాదవ్ ఉన్నారు.

# జానపద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

## ప్రజా నాట్యమండలిచే జానపద ఉత్సవాలు

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** మన సంప్రదాయాలు,సంస్కృతిని భావితరాలకు అందించిన జానపద కళలను ప్రభుత్వం ఆదరించాలని ప్రోత్సహించాలనికళాకారులను ఆదుకోవాలని తిరుపతి జిల్లా ప్రజానాట్యమండలి ఉత్సవాల్లో ముఖ్యఅతిధులు పిలుపు నిచ్చారు.ఇక్కడి అంబేద్కర్ భవన్‌లో జిల్లా జానపద కళాకారుల ఉత్సవాలకు ముఖ్యఅతిధిగా హాజరైన హరినాధ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఉత్సవాలు కళాకారుల్లో కొత్త ఊపిరి పోస్తుందనటంలో సందేహం లేదన్నారు. నేడు రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ఉన్న పవన్‌కళ్యాణ్ వృత్తిరీత్యా కళాకారుడు కాబట్టి ఆయన హయాంలో కళాకారులకు న్యాయం జరుగుతుందన ఆశాభావం వ్యక్తం చేసారు.

జానపద కళలను భావి తరాలకు అందించాలి: జానపద కళలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని హరినాధ్‌రెడ్డి అన్నారు. తన పసితనంలో గ్రామాల్లో 'ఏల పదాలు' పాడేవారన్నారు. అదేవిధంగా పొలాల్లో పనులు చేసే సమయంలో పాటలు పాడుతూ పని చేస్తూ శ్రమను మరచే వారన్నారు. పొలాల వద్ద పాటలు పాడేందుకు ప్రత్యేక కళాకారులుండేవారన్నారు. నేడు యాంత్రిక యుగంలో మన సంప్రదాయాలు కనుమరుగౌతున్నాయన్నారు. పూర్వం ప్రసార మాద్యమాలు ఉండేవి కాదన్నారు. భారత,భాగవత,రామాయాణలను జానపద కళాబృందాలే ప్రచారం చేసేవారన్నారు. సినిమాలు రాకతో జానపద కళలకు ఆదరణ తగ్గిందన్నారు. నేడు సోషల్ మీడియాతో చీకటి మయమైందన్నారు.

**డిజేలతో సంప్రదాయ కళలు కనుమరుగు:** నేడు సమాజంలో డిజేలతో సంప్రదాయ కళలకు ముప్పు వాటిల్లిందన్నారు. ఆదిమ మానవుని నుంచి ఇటీవల కాలం వరకుచర్మవాయిద్యం డప్పుకు ఎంతో ప్రాచుర్యం ఉండేదన్నారు. ప్రజలకు ఏ సమాచారం అందించాలన్నా జానపద గీతాలు ఆలపించాలన్నా డప్పును వాడే వారని నేడు డప్పు శబ్దం మాయమౌతుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో పాటు గ్రామీణ కళలనుకాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో జానపద కళలు ఎంతో కీలక పాత్ర పోషించాయన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో జానపద కళల అభివృద్ధికి ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. సంప్రదాయ కళలను ఆదరించటానికి ఆడిటోరియాల నిర్మించాలన్నారు. కళలను బతికించి కళాకారులను ఆదుకునే బాధ్యతను రాష్ట్రం తీసుకోవాలని హరినాద్‌రెడ్డి కోరారు.



ప్రజానాట్యమండలి ఉత్సవాల్లో మాట్లాడుతున్న హరినాధ్‌రెడ్డి

**డప్పు మోగితే ఎవ్వరైనా ఆడాల్సిందే: సినీ దర్శకులు** జానపద కళల్లో మనిషిని ఆకర్షించే శక్తి నిగూఢంగా ఉందని డప్పు మోగితే ఎంతటి వారైనా ఆడాల్సిందే అని సినీ దర్శకులు భీమాస్ ఆశోక్ అన్నారు.ఆధునిక సమాజంలో గ్రామీణ సంప్రదాయాలు,సంస్కృతిని యువత మరచిపోతున్నారన్నారు. పాశ్చాత్య సంప్రదాయాల మోజులోమనం ఎటు వెళుతున్నామో అంతు పట్టడం లేదన్నారు.వీధి నాటకాలు, కోలాటాలు, భారత రామాయణం నేడు మాయమౌతు న్నాయన్నారు.భారతీయ సంప్రదాయాలు సంస్కృతిని ఎవరూ మరువరాదన్నారు. భవిష్యత్తులో తన సినిమాల్లో ప్రతిభ ఉన్న కళోకారులకు అవకాశం కల్పిస్తామన్నారు.

ఈ ఉత్సవాల ప్రారంభోత్సవం లో ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచులయ్య,జిల్లా కార్యదర్శి నాగరాజు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సినీ నటుడు కృష్ణ చైతన్య ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు,డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి కాలయ్య, నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూదస్త్రాలు, యాజమాన్య హక్కులపైనే ఎక్కువ ఫిర్యాదులు

## మండల స్థాయిలోనే పరిష్కరించాలని అభ్యర్థనలు

## క్రోడీకరణ తరువాత మార్పులు, చేర్పులు

## కొత్త రెవెన్యూ చట్టం రూపకల్పనకు కసరత్తు షురూ

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా కొత్త రెవెన్యూ చట్టం రూపకల్పనకు కసరత్తు ప్రారంభమైంది. రాష్ట్రంలో కొత్త రెవెన్యూ చట్టం 2024ను అమలులోనికి తీసుకు రానున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం అందుకు సంబంధించిన ముసాయిదాను గత అసెంబ్లీ సమావేశాలలో ప్రవేశపెట్టింది. ఈ ముసాయిదాను హైదరాబాద్‌లోని భూ పరిపాలన ప్రధాన కార్యాలయంలో పబ్లిక్ డొమైన్‌లో ఉంచగా భూ దస్త్రాలు, యాజమాన్య హక్కులు (ఆర్వోఆర్ 2024) చట్టానికి సంబంధించి క్షేత్రస్థాయిలో ఎక్కువగా ఫిర్యాదులు అందాయి. ప్రధానంగా తహసీల్దార్ స్థాయిలోనే అధికారాలు ఉండాలని ఎక్కువ మంది నుంచి విజ్ఞాపనలు వచ్చినట్లు తెలిసింది. ఈమేరకు ప్రభుత్వం తీసుకురానున్న ఆర్వోఆర్ 2024 చట్టం ముసాయిదాను భూ పరిపాలన ప్రధాన కమిషనర్ వెబ్‌సైట్‌లో ఉంచి వివిధ వర్గాల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరించారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లాల్లోనూ ప్రత్యేకంగా చర్చా వేదికలు, సమావేశాలు ఏర్పాటు చేసి నిపుణులు, మేధావులు, ప్రజాప్రతినిధుల నుంచి సూచనలు స్వీకరించారు. ఈ క్రమంలో వచ్చిన దరఖాస్తులు అభ్యంతరాలను క్రోడీకరించి ప్రధానమైన వాటిని గుర్తించే పనిని రెవెన్యూ శాఖ చేపట్టింది. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి, సునీల్ కుమార్‌తో సమావేశమై ఈ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పబ్లిక్ డొమైన్‌లో వచ్చిన అభ్యర్థనలన్నింటినీ పరిశీలించి కొత్త చట్టంలో చేర్చాల్సిన వాటి జాబితాను రూపొందించాలని ధరణి కమిటి సభ్యులు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. కాగా, ఆర్వోఆర్ 2024 ముసాయిదాపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున సూచనలు అందాయి. ప్రధానంగా తహసీల్దార్ స్థాయిలోనూ భూ సమస్యలను పరిష్కరించే వెసులుబాటు కల్పించాలన్న విజ్ఞప్తులు ఎక్కువగా రాగా, ప్రతీ సమస్యకు జిల్లా కేంద్రం, రాజధాని హైదరాబాద్ వరకు వెళ్లాల్సి రావడం వ్యయ ప్రయాసగా మారుతోందంటూ పలు జిల్లాల నుంచి అభ్యర్థనలు వచ్చినట్లు సమాచారం. ధరణి రాకముందు మండల స్థాయిలోనే ఏ సమస్యకైనా మండల స్థాయిలోనే పరిష్కారం లభించేది. అదే విధంగా ఇప్పుడూ వీలు కల్పించాలనీ, గతంలో రద్దయిన తహసీల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్, సిసిఎల్‌ఏ స్థాయిలో రెవెన్యూ కోర్టులను పునరుద్ధరించాలని వివిధ దశల్లో ల్యాండ్ ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. ఏదైనా సమస్యపై దరఖాస్తు చేస్తే నిర్ణీత సమయంలో అది పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలనీ, దీనికి సిటిజన్ చార్టర్‌ను రూపొందించాలని కోరారు. రద్దయిన వీఆర్వో, వీఆర్‌ఏలతో ఇతర శాఖల్లో చేరి నష్టపోయిన కొందరు తమను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నూతన చట్టంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు తీసుకునేలా గుర్తింపు ఇవ్వాలని పలువురు పబ్లిక్ డొమైన్ ద్వారా కోరినట్లు తెలిసింది.



ఆదివారం విజయవాడలో ఉధృతంగా నప్రవహిస్తున్న వరద నీరు

# చరిత్రలో ఎన్నడూ లేనంతగా విజయవాడలో రికార్డు స్థాయిలో వర్షం

## 30యేళ్ల రికార్డు బద్దలు, ఒకే రోజు 29 సెంటీమీటర్ల వర్షపాతం

**విజయవాడ,సెప్టెంబరు 1,ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ నగరాన్ని భారీ వర్షాలు వణించాయి.జనం భయంతో అల్లాడేదిశలో వర్షం భీభత్సం సృష్టించింది. ఎడతెరిపి లేని వర్షంతో పలు చోట్ల రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. బెజవాడలో రికార్డ్ వర్షపాతం నమోదైంది. 30 ఏళ్ళ రికార్డ్ బద్దలైంది. చరిత్రలో ఎన్నడూ లేనంతా ఒకే రోజు 29 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది. ఆదివారం కుడా వర్షం కురుస్తునే ఉంది.రెండు రోజులు విజయవాడలో కుండపోత వర్షం కురవడంతో అనేక కాలనీల్లో నాలుగు అడుగుల మేర నీరు నిలిచింది. విజయవాడలో కనీవినీ ఎరగని రీతిలో కురిసినవర్షానికి నగర జీవనం అస్తవ్యస్తమైంది. ఎప్పుడు చూడని రీతిలో బెజవాడలో కుంభవృష్టితలా వర్షం పడటంతో కాలనీలన్నీ నీటమునిగాయి. ఏకథాటిగా రోజంతా వర్షం కురవడంతో వరదలు నగరాని ్ని ముంచెత్తాయి. నగరం జలదిగ్బంధంలో చిక్కి విలవిలలాడుతోంది. ఎన్డీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తి నిల్చిపోయింది. మరోవైపు కొండచరియలు విరిగిపడటంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. విజయవాడ లోని విద్యాధరపురం,ఆర్ఆర్ నగర్‌లో రహదారులు జలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల రహదారులపై మోకాళ్ళ లోతు నీరు చేరింది. భారీ వర్షాలకు మొగల్రాజపురం సునన్నపు బట్టీ వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సహాయక చర్యలకు వర్షం పలుమార్లు ఆటంకం కల్గించింది. విజయవాడ బస్టాండ్ పరిసర ప్రాంతాలు నీటమునిగాయి. రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద భారీగా ట్రాఫిక్ నిల్చిపోయింది. బెంజి సర్కిల్ ఫ్లైఓవర్ క్రింద భారీగా వర్షపు నీరు చేరింది.నగరంలో మంత్రులు నారాయణ,అనిత,అధికారులు ఆర్‌పీ సీసోడియా పరిస్థితులు సమీక్షిస్తున్నారు.వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్ళి బాధితులకు భరోసా ఇస్తున్నారు.వారందరికి అవసరమైన చేయూతను ఇస్తున్నారు.కొందరిని సహయక శిబిరాలకు చేరుస్తున్నారు.ఎన్నడులేని రీతిలో విజయవాడ చిట్టినగర ప్రాంతంలో లోతట్టు ప్రాంతాలు వర్షాలకు చెరువులుగా మారాయి.మంత్రులు పొంగూరు నారాయణ,కొల్లురవీంద్ర, ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని)మోకాటి లోతులో దిగి బాధితుల వద్దకు వెళ్ళి పరామర్శించి,భరోసా ఉంటామని వాగ్దానం చేసారు.

# జత్వానీ నుండి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన పోలీసులు

### తనపై అక్రమ కేసులు పెట్టిన వారికి శిక్ష పడాలన్న జత్వాని

**విజయవాడ క్రైం,సెప్టెంబరు 1,ప్రభాతవార్త:** సంచలనం సృష్టించిన కాదంబరి జత్వాని కేసులో పలువురు ఐపిఎస్ అధికారులకు ఉచ్చు బిగుసుకుంటోంది. నగరానికి వచ్చిన జత్వాని నుండి పోలీసులు సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఈ సందర్భంలో ఆమె తన వద్ద ఉన్న సాక్ష్యాలు,ఆధారాలను బెజవాడ పోలీసులకు అందచేశారు. పోలీసుల విచారణ అనంతరం జత్వాని మాట్లాడుతూ తనపై అక్రమ కేసులు పెట్టిన వారికి శిక్ష పడాలన్నారు. పలువరు ఐపిఎస్ అధికారులపై తాను ఫిర్యాదు చేశానని వెల్లడించారు. తనతో పాటు కుటుంబ సభ్యులను కూడ చాలా ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాదంబరి జత్వాని విషయంపై ప్రసార మాధ్యమాల్లో రావడంతో ఎపి ప్రభుత్వం దీనిని సీరియస్‌గా తీసుకుంది. సమగ్ర విచారణకు సిఎంఒ ఆదేశాలు జారీ చేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో నగరానికి చేరిన ఆమె తొలుత సిపిని కలిసారు. అనంతరం సిపి కార్యాలయంలో ఈ కేసు గురించి ప్రత్యేకంగా నియామకం కాబడ్డ ఎసిపి స్రవంతిరాయ్ తదితర పోలీసు అధికారులు దర్యాప్తులో భాగంగా ఆమె నుండి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకున్నారు. ఆమెతో పాటు ఆమె తల్లి వాంగ్మూలాన్ని కూడ రికార్డు చేసుకున్నారు. ఆమెతో పాటు హాజరైన ఆమె తరపు న్యాయవాదులు 41ఎ క్రింద నోటీసులు ఇవ్వకుండా కుట్రపూరితంగా జత్వానీ కేసులో గత ప్రభుత్వంలో పోలీసులు వ్యవహరించారన్నారు. ఆమెను 42 రోజుల పాటు జైలులో పెట్టి,కుటుంబ సభ్యుల చాలా ఇబ్బంది పెట్టారన్నారు. కేసులో సీనియర్ ఐపిఎస్ అధికారులతో పాటు పలువురు పోలీసు అధికారులు, రాజకీయనాయకులు కూడ ఇన్‌వాల్వ్ అయి ఉండటంతో కేసు దర్యాప్తులో భాగంగా తొలుత ఎవరికి మూడుతుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నే?



పిల్లలకు విషమిచ్చి తాము ఆత్మహత్య చేసుకున్న వెంకటేశ్, వర్శిణి, రిషికాంత్, విహాంత్ (ఫైల్)

# ఆర్థిక ఇబ్బందులతో ఓ కుటుంబం ఆత్మహత్య

### మొదట ఇద్దరు పిల్లలను చంపి ఆపై దంపతుల బలవన్మరణం

### ఆన్‌లైన్ బెట్టింగ్‌లే కారణమా?.. గాజులరామారంలో విషాదం

**హైదరాబాద్ (కుత్బుల్లాపూర్), సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులు తట్టు కోలేక తమ పిల్లలు ఇద్దరిని చంపి తామూ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పరిధిలోని గాజులరామారంలో తీవ్రవిషాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాలకు చెందిన వెంకటేశ్(40) వర్శిణి(33) దంపతులు మంచిర్యాల నుండి బతుకుదెరువు కోసం నగర శివారుల్లోని గాజుల రామారం బాలాజీ లేఅవుట్‌లోని సహస్ర అపార్ట్‌మెంట్‌లో నివాముం టున్నారు. వీరికి ఇద్దరు కుమారులు రిషికాంత్(11) విహాంత్(3). వెంకటేశ్ దంపతులు స్థానికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొని దిక్కుతోచనిస్థితిలో ఆత్మహత్యకు నిర్ణయిం చుకున్నారు. శనివారంరాత్రి ఇద్దరు పిల్లలు రిషికాంత్, విహాంత్‌ను విషం ఇచ్చి చంపి తర్వాత వెంకటేశ్, వర్శిణిలు కూడా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకు న్నట్లు పోలీసులు వివరించారు. జీడిమెట్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శవాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్‌కు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాల్గొనే అలవాటు ఉన్నట్లు సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు నిర్ధారించలేదు. భార్యభర్తలు ఆత్మహత్య చేసుకునే ముందు తల్లిదండ్రులకు ఫోన్‌ద్వారా మాట్లాడినట్లు తెలుస్తుంది. పూర్తివివరాలు ఇంకాతెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వరద నీటిని భవిష్యత్తు అవసరాలకు వినియోగించండి

### ప్రాజెక్టుల పరిధిలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో నీటిని నిల్వ చేయండి

### అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 1:** భారీ వర్షాలతో వచ్చిన వరద నీటిని వృధా చేయకుండా భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల పరిధిలోని రిజర్వాయర్లు, చెరువులు కుంటల్లో నిటిని నిల్వ చేయాలని సూచించారు. ఎగువన కురిసిన వర్షాలతో పాటు కడెం నుంచి వస్తున్న వరదతో పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండింది.
ఎల్లంపల్లి గేట్లు ఎత్తి నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. మరోవైపు ఎల్లంపల్లికి వచ్చిన వరద నీటిని వీలైనంత మేరకు లిఫ్ట్ చేయాలని,రోజుకు ఒక టిఎంసీ తగ్గకుండా డ్రా చేయాలని ఆదేశించారు. నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా లిఫ్ట్ చేసి రిజర్వాయర్లు నింపాలని ముఖ్యమంత్రి సూచించారు. మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యామ్‌తో పాటు రంగనాయక్ సాగర్,మల్లన్నసాగర్ వరకు జలాశయాల్లోకి ఏకధాటిగా నీటి లిఫ్ట్ చేయాలని ఆదేశించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థ్యం 20 టిఎంసీలు కాగా ప్రస్తుతం 18.45 టిఎంసీల నీటి నిల్వ ఉంది. కడెం ప్రాజెక్టు నుంచి ప్రవహం ఉధృతంగా వస్తుండటంతో నంది,గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా మిడ్‌మానేరుకు నీటిని తరలి స్తున్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టు సామర్థ్యం 27 టిఎంసీలు కాగా ప్రస్తుతం 15 టిఎంసీలు ఉంది. అక్కడి నుంచి 14వేల క్యూసెక్కులకు పైగా లోయర్‌మానేరు డ్యామ్‌కు మరో 6400 క్యూసెక్కులు అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా రంగనాయక్ సాగర్‌కు తరలిస్తున్నారు. అటు రంగనాయక్ సాగర్ నుంచి నీటిని పంపింగ్ చేసి మల్లన్న సాగర్,కొండపోచమ్మ సాగర్ నింపాలని అక్కడి నుంచి సింగూర్ ప్రాజెక్టు,నిజాంసాగర్ ప్రాజెక్ట్ వరకు నీటిని తరించాలని ఆదేశించారు. మల్లన్నసాగర్ ఫుల్ కెపాసిటీ 50 టిఎంసీలు,ప్రస్తుతం 11.43 టిఎంసీల నిల్వ ఉంది.
కొండ పోచమ్మసాగర్‌లో 15 టిఎంసీల కెపాసిటీ ఉండగా 7.91 టిఎంసీ నీళ్ల ఉన్నాయి. కేంద్ర జలసంఘం మార్గదర్శకాల ప్రకారం మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లలో సాధ్యమైనంత వరకు నీటిని నిల్వ చేయాలని చెప్పారు. మల్లన్నసాగర్‌లో గరిష్టంగా 18 నుంచి 20 టిఎంసీలు,కొండపోచమ్మ సాగర్ 10 టిఎంసీలు నిల్వ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అన్ని ముందు జాగ్రత్తలు పాటించాలని అప్రమత్తం చేశారు. కొండపోచమ్మ సాగర్ నుంచి హల్దీవాగు ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిని తరలించాలని చెప్పారు

# కస్తూర్బా గురుకుల పాఠశాలను సందర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు

### విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం

**శంషాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని పాలమాకుల కస్తూర్బా గురుకుల పాఠశాలను ఐటీ శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్‌బాబు ఆదివారం సందర్శించారు. విద్యార్థులు సరమైన వసతులు కల్పించకుండా పురుగుల అన్నం, నీళ్ల చారు పెడుతున్నారని ఆరోపిస్తూ మూడురోజుల క్రితం ఆ పాఠశాల విద్యార్థులు హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగిన విషయం పాఠకులకు విదితమే. దీంతో స్పందించిన శ్రీధర్‌బాబు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ జిల్లా కలెక్టర్ శశాంక్‌తో కలిసి పాఠశాలను సందర్శించి విద్యార్థులను అడిగి పరిస్థితులను తెలుసుకున్నారు.
విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. బయటి వ్యక్తులు హాస్టల్‌లోకి రాకుండా కఠినచర్యలు తీసుకోవాలని జరిగిన ఆందోళనపై పూర్తిస్థాయి విచారణచేసి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. నాణ్య మైన భోజనంతోపాటు విద్యను అందించి అక్కడ ఉన్న సమస్యలు అన్నింటిని పరిష్కరించాలని అధికా రులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ నరసింహారెడ్డి అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ డిఇఒ సుశీందర్‌రావు శంషాబాద్ తహసీల్దార్ రవీందర్ దత్తు మంత్రి వెంట ఉన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి మాజీ ఫ్లోర్ లీడర్ నీరటి తన్వీరాజు సీనియర్ నాయ కులు కోడుగంటి చంద్రరెడ్డి నీరటి రాజు ముదిరాజ్ గుర్రంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, జిల్లా కలెక్టర్ శశాంక్

#### డిఇఒపై మంత్రి ఆగ్రహం

పాలమాకుల కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఇన్ని సమస్యలు ఉంటే వీరేం చేస్తున్నారంటూ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జిమంత్రి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సుశీందర్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో కలిసి కస్తూ ్ర్బా గురుకుల పాఠశాలను సంద ర్శించారు. పాఠశాలలోని పరిస్థితులను భోజన వసతులను గురించి విద్యార్థులను విద్యాబోధన జరుగుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

# సిఎంఆర్‌ఎఫ్ స్కాంలో ఇద్దరు అరెస్టు

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ (సిఎంఆర్‌ఎఫ్) స్కాంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇద్దరు నేరగాళ్ల ను సిఐడి అధికారులు అరెస్టు చేశారు. అరెస్టయిర వారిలో ఒకతను ఆర్‌ఎంపి డాక్టర్ కాగా మరొకతను ప్రైవేటు వైద్యశాలలో సూపర్‌వైజర్. దీనికి సంబంధించిన వివ రాలను సిఐడి డిజి శిఖా గోయల్ ఆదివారం మీడియాకు వెల్లడించారు.
రాష్ట్రంలో ఇటీవల సిఎంఆర్‌ఎఫ్ స్కాం వెలుగు చూడడం తెలిసిందే. ఉమ్మడి తెలంగాణ జిల్లాల లో అనేకచోట్ల ఈ గోల్‌మాల్ వ్యవహారాలు రట్టవడం విదితమే.
దీనిపై సర్కారు సిఐడి విచారణకు ఆదేశించడంతో రంగంలో దిగిన ఈ విభాగం అధికారులు రాష్ట్ర వా ్యప్తంగా అనేకచోట్ల దాడులకు దిగారు. ఇందులో ఉమ్మడి నల్లగొండ జిల్లా కూడా వుంది. ఈ జిల్లా నుంచి పదుల సంఖ్యలో సిఎంఆర్‌ఎఫ్ నిధుల కోసం దరఖాస్తులు రాగా ఇందులో అనేకం ఆమోదం పొందాయి. దీనిపై విచారించిన సిఐడి అధికారులు ఇందులో అనేకం తప్పుడువని తేల్చారు.
ఈ క్రమంలో మిర్యాలగూడకు చెందిన ఆర్‌ఎంపి వైద్యుడు గొట్టి గిరి (46), అదే ప్రాంతానికి చెందిన నవీన మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి చెందిన సూపర్‌వైజర్ లక్కిరెడ్డి సైదిరెడ్డి (40)ని సిఐడి అధికారులు అరెస్టు చేశారు. వీరిద్దరు సిఎంఆర్‌ఎఫ్ నిధుల కోసం నకిలీ పత్రాల తేవడం వీటిని నకిలీ ఫారాలతో జతచేయడం చేశారు. ఇందుకోసం నకిలీ రబ్బర్ స్టాంపులు, ఆసుపత్రుల స్టాంపులు, వైద్యుల పేరిట వున్న నకిలీ రబ్బర్ స్టాంపులు రూపొందించారు.
నకిలీ బిల్లుల తయారీకి కంప్యూటర్లు వాడారు. ఇందుకోసం వీరిద్దరు ఒక్కో ద రఖాస్తుకు నాలుగు వేల రూపాయలను వసూలు చేసేవారని తేలింది. నిందితులను రిమాండుకు తరలించారు.

# ప్రగతిని కాంక్షిస్తున్న బిజెపి

### ప్రజలకు మేలుచేసే పనులను స్వాగతిస్తుంది

### పార్టీ ఎంపి ఈటల రాజేందర్



**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** బిజెపి ప్రగతిని కాంక్షిస్తుందని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బిజెపికి ఎవరికి వ్యతిరేకం కాదని, చట్టబద్ధంగా నడుచుకోవాలని కోరుతున్నామన్నారు. పేదల ఇళ్లను కూలిస్తే ఖబర్దార్ అని హెచ్చరిస్తున్నామన్నారు. అక్రమ నిర్మాణాలకు కారకులకు శిక్ష వేయాలని, వారి నుంచి రికరవీ చేయాలన్నారు. బిజెపి ప్రజల పక్షాన ఉంటుందన్నారు. న్యాయపోరాటం కూడా చేస్తామని, ప్రజలకు మేలు చేసే పనులను స్వాగతిస్తుందన్నారు. కానీ సిఎం రేవంత్‌రెడ్డి మొదటి సిఎం అయినట్లు ఫోజు కొడుతున్నారన్నారు. బండిపోట్లలాగా పేదల ఉపాధిని పొగొట్టే వారి బతుకులో మట్టిపోసిన దుర్మార్గపు ప్రభుత్వం ఇదన్నారు. సిఎంకు కోర్టులపై నమ్మకం, గౌరవం ఉందా అంటూ ప్రశ్నించారు. హైడ్రా పేరుతో సిఎం ఆడుతున్న డ్రామ తప్ప సమాజహితం కాదన్నారు. విద్యా, వైద్యం ఇచ్చిన హామీలు, గ్యారెంటీలు వీటిమీద దృష్టి పెట్టలేదన్నారు. సర్వరోగ నివారణి హైడ్రా అంటూ అంటున్నారు. గత ప్రభుత్వ పెద్దలు అడ్డగోలుగా దోచుకున్నారు. కొంత మంది ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారన్నారు. నేను ఎవరికి కొమ్ముకాసే వాడిని కాదన్నారు. సిఎంలని ఎంత పెద్దవారిని అయినా చీల్చి చెండాడిని వాడిని అన్నారు. నాది గులాంగిరి చేసే చరిత్ర కాదన్నారు. అల్వాల్‌లో 1968లో అంటే 56 సంవత్సరాల క్రితం 200 మంది లేఅవుట్‌లో కొనుక్కొని ఇళ్ళ కట్టుకుని ఉంటున్నారు. 17 ఎకరాల చెరువు అని అప్పుడు ఫెన్సింగ్ వేశారని, ఒకప్పుడు మంచినీళ్ల ఉన్న చెరువు ఇప్పుడు మురికి కూపంగా మారిందన్నారు. ఇప్పుడు 48 ఎకరాల చెరువు అంటూ రెండు వందల మందికి నోటీసులు ఇచ్చి హైడ్రా వారి బతుకులతో చిచ్చు పెట్టారన్నారు. హస్మత్‌పేటలో కూడా అదే పరిస్థితి అన్నారు. అధికారులు రాజ్యాంగ బద్ధంగా పనిచేయాల న్నారు. 72 సంవత్సరాల్లో ఎక్కువ కాలం పాలిం చింది కాంగ్రెస్ పార్టీ. మా ముఖ్యమంత్రులు, ఆనాటి మా అధికారులు తప్పు చేశారని ఒప్పుకుని శిక్షించాలని, వారి నుంచి నష్టాన్ని రికవరీ చేయాలన్నారు. భూకబ్జాలు చేసిన వారిమీద ఎలాంటి చర్యలు లేవు అన్నారు. శనివారం, ఆదివారం కోర్టులు ఉండవని విధ్వం సం చేస్తున్నారన్నారు. శంకరపల్లి మండలం కొడంకగల్ తండాలో అసైన్డ్ భూములను అపర్ణ రియల్ ఎస్టేట్ వారు కబ్జా పెడుతున్నారు. అడ్డంగా గోడకడుతున్నారు. వారిపై చర్యలు తీసుకోవాల న్నారు. వరదలు వస్తు న్నాయని, ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారని ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలన్నారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి ఆదుకోవాలని కోరుతున్నానన్నారు. ఈ సమా వేశంలో సీనియర్ నేతలు కొండేటి శ్రీధర్, నర్సిం హారెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుమల హాతీరాంజీ మఠం మహంత్ శ్రీ ఓం ప్రకాష్ మహంత్‌వారికి దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఇఓ

# దుర్గమ్మ సేవలో హాతీరాంజీ మఠం మహంత్

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త :** దుర్గమ్మను ఆదివారం తిరుమల తిరుపతి కి చెందిన శ్రీ హాతీరాంజీ మఠంకు చెందిన శ్రీ ఓం ప్రకాష్ మహంత్ వారు దర్శించుకున్నారు. అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవ స్త్రం, మెమొంటోలు ఇఓ కెఎస్ రామారావు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



**నృత్యనీరాజనంతో అలరింపు:** దుర్గమ్మ ఆలయంలో ఆదివారం జరిగిన నృత్యనీరాజనం భక్తులను అలరించింది. అనంతపురంకు చెందిన డి రమ్య కృష్ణ శిష్యబృందం మహాగణపతిం, పుష్పాంజలి, గురుబ్రహ్మ, స్వాగతం కృష్ణ, మూషిక వాహన, గంధముపూయరుగా, అష్టలక్షిమ స్తోత్రం, అంబా శాంబవి, ముద్దుగారె యశోద అంటూ సాగిన కీర్తనలకు నృత్య అభినయం ప్రదర్శించారు.

# అప్రమత్తతతో సహాయక చర్యల్లో భాగస్వాములు కండి

### ప్రభుత్వోద్యోగులకు జెఏసి చైర్మన్ లచ్చిరెడ్డి సూచన

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యోగుల జెఏసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి సూచించారు. విధి నిర్వహణలో భాగంగా ముందస్తుగా ఉద్యోగులు తగిన జాగ్రత్తలు తీసుకుంటూనే సహాయక చర్యలలో భాగస్వా ములు కావాలని పేర్కొన్నారు. ప్రజల ఆస్తి, ప్రాణ నష్టాలు జరుగకుండా ఆయా శాఖల ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ తగిన సలహాలు, సూచనలు తీసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఉద్యోగులకు విధి నిర్వహణ ఎంత ముఖ్యమో వ్యక్తిగత భద్రత కూడా అంతే ముఖ్యమనీ, ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. ఎలాంటి ప్రమాదానికి లోనుకాకుండా సురక్షితంగా విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు.

# సమీకృత సంక్షేమ గురుకులాల డిజైన్లు సిద్ధం

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సమీకృత సంక్షేమ గురుకుల విద్యాలయాల నిర్మాణానికి సంబంధించిన డిజైన్లు సిద్ధమ య్యాయి. సాంఘిక, గిరిజన, వెనుకబడిన, మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాలలను వేర్వేరు చోట్ల కాకుండా ఒకే చోట ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ క్యాంపస్ (సమీకృత గురుకుల విద్యాలయాలు)లను ఏర్పాటు చేయాలని సర్కార్ ఇప్పటికే నిర్ణయించింది. వీటికి సంబంధించి మూడు డిజైన్లు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారు. వాటిని ముఖ్యమంత్రి రేవంతరెడ్డి పరిశీలించి సంక్షేమ అధికారులకు కొన్ని సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో ఆ డిజైన్లను మార్పులు చేర్పులు చేసేందుకు ఆర్కిటెక్చర్ కన్సల్టెన్సీలతో కలిసి అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. త్వరలోనే మార్పులు చేర్పులు చేసిన సమీకృత గురుకుల విద్యాలయాల డిజైన్ల సీఎంకు సమర్పించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

# రూ.360 కోట్లతో ఆదివాసీ గ్రామాల అభివృద్ధి

### ట్రైకార్ సమావేశంలో తీర్మానం

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఏజెన్సీలోని ఆదివాసీనగ్రామాలను పటిష్టంగా అభివృద్ధి చేయాలని తెలంగాణ షెడ్యూల్ ట్రైబ్స్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ట్రైకార్) నిర్ణయించింది. ఇందుకు అంచనా బడ్జెట్లో కేటాయించిన 360 కోట్ల రూపాయల నిధులను సంపూర్ణంగా వినియోగించాలని ట్రైకార్ సమావేశం తీర్మానించింది. హైదరాబాద్ మాసాబ్‌టాంక్‌లోని డీఎస్ఎస్ సంక్షేమ భవన్లో ట్రైకార్ ఛైర్మన్ డాక్టర్ తేజ నాయక్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ ఆవాసాలు, గూడెంలు, తండాలను అభివృద్ధి చేయాల్సిన అసరం ఉందన్నారు. ఇందుకు 2024-25 వార్షిక అంచనా బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 360 కోట్ల రూపాయల నిధులను పూర్తి స్తాయిలో ఖర్చు చేసి, అడవి బిడ్డలకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గిరిజనులు అభివృద్ధి చెందేలా మంచి పథకాలను ఎంపిక చేయాలని సూచించారు.

# సహాయ, పునరావాస చర్యల్లో పాల్గొనాలి

### కార్యకర్తలకు పిలుపునిచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** బిజెపి కార్యకర్తలు, నాయకులు ప్రజా ప్రతి నిధులంతా జాగ్రత్తగా ఉంటూ అధికా రులకు సహకరిస్తూ సహాయ పున రావాస చర్యల్లో పాల్గొనాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు కూడా అత్యవస రమైతే తప్ప బయటకు రావొద్దని పిలుపునిచ్చారు.

2-9pg10.qxd:2-9pg10.qxd 01/01/01 7:30 AM Page 1



# ప్రో కబడ్డీ లీగ్‌కు రెడీ




## వచ్చే నెల 18 నుండి కూత.. టిజి, ఎపికి ప్రాతినిధ్యం నిల్

## 118 మంది ప్లేయర్లను కొన్న 12 ఫ్రాంచైజీలు

## ఒక్క స్థానిక ఆటగాడినీ తీసుకోని తెలుగు టైటాన్

**ఢిల్లీ:** ప్రతిష్టాత్మక ప్రో కబడ్డీ లీగ్-11 సీజన్‌కు రంగం సిద్ధమైంది. అక్టోబరు 18వ తేదీ నుండి మళ్లీ కబడ్డీ కూత సందడి చేయనుంది. ఇప్పటికే ఈ సీజనుకు సంబంధించి తాజాగా జరిగిన వేలం కూడా పూర్తయింది. స్టార్ ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీలు కోట్ల రూపాయలను కురిపించాయి. లీగ్ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ఈ సారి 8 మంది కబడ్డీ ఆటగాళ్లు కోట్ల రూపాయలు పలికడం విశేషం. రెండు రోజుల పాటు సాగిన వేలంలో సచిన్ తన్వార్ అత్యధిక ధర దక్కించుకున్నాడు. ఈ వేలంలో 12 ఫ్రాంచైజీలు మొత్తం 118 మంది ఆటగాళ్లను కొనుగోలు చేశాయి. అయితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కబడ్డీ ప్లేయర్లకు ఈసారి కూడా నిరాశే ఎదురైంది. ఒక్క ఆటగాడిని కూడా వేలంలో ఫ్రాంచైజీలు కొనుగోలు చేయలేదు. గత ఏడాది కూడా ఈ రెండు రాష్ట్రాల నుండి ఒక్కరు కూడా ప్రో కబడ్డీ లీగ్‌లో ప్రాతినిధ్యం వహించ లేదు. కాగా ప్రోకబడ్డీ టోర్నిలో హర్యానా రాష్ట్రానికి చెందిన ఆటగాళ్లదే పూర్తి ఆధిపత్యం నడుస్తోంది. ఆ రాష్ట్రం నుండి అత్యధికంగా 106 మంది ఆటగాళ్లు ఈ ప్రో కబడ్డీ టోర్నీలో భాగమయ్యారు. ఆ తర్వాత మహారాష్ట్ర నుండి 39 మంది, తమిళనాడు నుండి 22 మంది, ఉత్తరప్రదేశ్ నుండి 21 మంది కబడ్డీ ప్లేయర్లు ఈ ఫ్రాంచైజీ లీగ్‌లో పాల్గొనబోతున్నారు. అయితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి ఒక్క కబడ్డీ ప్లేయర్ కూడా ఈ లీగ్‌లో పాల్గొనే అకాశాన్ని అందుకోలేకపోయారు. చివరకు జమ్మూ కశ్మీర్ నుండి కూడా ఇద్దరు ప్లేయర్లు ఎంపిక అవ్వగా, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఉత్తరాఖండ్ నుండి ఒక్కొక్కరు ప్రాతినిధ్యం వహిస్తు న్నారు. అయితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలుగు టైటాన్స్ ఫ్రాంచైజీ కూడా ఈ రెండు రాష్ట్రాల నుండి ఒక్క ప్లేయర్‌ను తీసుకోలేదు. లోక్ టాలెంట్‌ను ప్రోత్స హించాల్సి న సొంత ఫ్రాంచైజీ స్థానిక ఆటగాళ్లను పట్టించుకోకపోవడంపై అభిమానుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నాయి. సాంప్రదాయ క్రీడ అయిన కబడ్డీలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకపోవడం ఏమిటని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు క్రీడాకారుల కోసం అత్యధిక ప్రాధాన్యత నిస్తూ భారీ ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నాయని చెబుతున్నా, ప్రో కబడ్డీ లీగ్‌లో స్థానికంగా ఉన్న ఒక్క ప్లేయర్ కూడా లేకపోవడం ఏమిటని నిలదీస్తున్నారు. పల్లె క్రీడ అయిన కబడ్డీకి సరైన ప్రోత్సాహం లభించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సరైన టోర్నీలు నిర్వహించకపోవడం, కబడ్డీ అసోసియేషన్లు అన్నీ రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారడంతో నైపుణ్యం కలిగిన ఆటగాళ్లకు ప్రోత్సాహం లభించడం లేదని, అందువల్లే వేలంలో టిజి, ఎపి రాష్ట్రాలకు చెందిన వారిని కొనుగోలు చేసేందుకు ఫ్రాంచైజీలు ఇష్టపడ లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ రెండు రాష్ట్రాల నుండి ప్రో కబడ్డీ లీగ్‌లో అసలు ప్రాతినిధ్యమే తెరమరుగైందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఛాంపియన్లకు భారీ నగదు, ప్రోత్సహకాలను అందించే బదులు మట్టిలో మాణిక్యాలను వెలుగులోకి తీసుకొచ్చే కార్యక్రమాలపై దృష్టిసారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## శరత్ గెలిచినా గోవా చేతిలో చెన్నై ఓటమి

**ఢిల్లీ:** ఆల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) లీగ్‌లో గోవా ఛాలెంజర్స్ రెండో విజయాన్ని నమోదు చేసింది. చెన్నైలో జరిగిన మ్యాచ్‌లో గోవా 9-6తో చెన్నై లయన్స్‌పై గెలుపొందింది. సొంతగడ్డపై శరత్ కమల్ 2-1 (11-6, 11-10, 6-11)తో మిహాయి బొబోసికాపై గెలుపొందినప్పటికీ సహచరుల వైఫల్యంతో చెన్నైకి నిరాశ తప్ప లేదు. ఇక మహిళల సింగిల్స్‌లో సకుర మొరి 2-1 (11-9, 11-9, 9-11)తో గోవాకు చెందిన యాంగ్జీ లియాపై గెలిచి చెన్నై ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. కానీ తర్వాతి మ్యాచ్‌ల్లో చెన్నై ప్లేయర్లు వరుసగా ఓడిపోయారు. రెండో పురుషుల సింగి ల్స్ మ్యాచ్‌లో గోవాకు చెందిన హర్‌మత్ దేశాయ్ 2-1 (6-11, 11-7, 11-5)తో జులెస్ రోలం డ్‌పై గెలిచాడు. కాగా మిక్స్‌డ్ డబుల్స్‌లో శరత్-సకుర జోడీ 0-3 (9-11, 10-11, 7-11)తో గోవాకుచెందిన హర్‌మత్ దేశాయ్-యాంగ్జీ లియో జంట చేతిలో పరాజయం చెందింది. రెండోమహి ళల సింగిల్స్‌లోగోవాకు చెందిన్ యశస్విని ఘోర్పడే 2-1 (11-5, 11-8, 3-11)తో మౌమ దాస్‌పై గెలుపొందడంతో చెన్నైఓటమిపాలైంది. మరో పోరులో బెంగుళూరు స్మాషర్స్ 9-6తో అహ్మదాబాద్ ఎస్‌జీ పైపర్స్‌పై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో బెంగుళూరుకు చెందిన ఆంథోని అమల్‌రాజ్ 1-2 (9-11, 10-11, 11-10)తో బార్డెట్ చేతిలోను, మహిళల సింగిల్స్‌లో బెంగుళూరుకు చెందిన మనిక బత్రా 1-2 (11-7, 9-11, 7-11)తో బెర్నాడెట్ సాక్స్ చేతిలోఖంగుతిన్నారు. తర్వాత మిక్స్ డ్ డబుల్స్‌లోనూ అల్వరోరొబెల్స్-మనిక జోడీ 1-2(3-11, 11-7, 8-11)తో మునుశ్ షా-బెర్నాడెట్ సాక్స్ జంట చేతిలో పరాజయం చెందింది. ఈ దశలో పురుషుల సింగిల్స్‌లో బెంగుళూరుకు చెందిన అల్వరో రొబెల్స్ 3-0 (11-8, 11-7, 11-8)తో మనుశ్ షాపై, మహిళల సింగిల్స్‌లో బెంగుళూరుకు చెందిన లిలి జాంగ్ 3-0 (11-5, 11-8, 11-10)తో క్రిత్విక సిన్హా రాయ్‌పై ఒక్క గేమ్ కూడా ఓడిపోకుండా గెలుపొందడంతో బెంగుళూరు విజయం సాధించింది.

## ఇంటర్ ఫుట్‌బాల్ కప్‌కు హైదరాబాద్ సిద్ధం

**ఢిల్లీ:** ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (ఎఐఎఫ్‌ఎఫ్), తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ సంయుక్తంగా నిర్వహించనున్న ఇంటర్ కాంటినెంటల్ ఫుట్‌బాల్ కప్-2024కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ టోర్నమెంట్‌లో భారత్‌తో పాటు, సిరియా, మారిషస్ దేశాలు పాల్గొంటున్నాయి. ఈ నెల 3వ తేదీన ఇండియా, మారిషస్ మధ్య, 6వ తేదీన మారిషస్, సిరియా మధ్య, 9వ తేదీనన ఇండియా. సిరియా మధ్య ఈ టోర్నమెంట్ జరుగనుంది. ఇందు కోసం స్పోర్ట్స్ అథారిటీ గచ్చిబౌలి స్టేడియంలో అవసరమైన ఆధునీకరణ పనులు చేపట్టింది.

## ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో విధ్వంసం

### సన్ రైజర్స్ హైదరాబాద్ రికార్డుకు బ్రేక్



**ఢిల్లీ:** ఢిల్లీ ప్రీమియర్ లీగ్ -2024లో సిక్సర్ల మోత మోగింది. ఈ లీగ్‌లో భాగంగా అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా నార్త్ స్ట్రయికర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సౌత్ ఢిల్లీ సూపర్ స్టార్జ్ టీమ్ బ్యాటర్లు ఆయుష్ బదోని, ప్రియాన్ష్ ఆర్య విధ్వసం సృష్టించారు. ఈ ఇద్దరు యువ ఆటగాళ్లు మెరుపు సెంచరీలతో చెరేగారు. ప్రత్యర్థి బౌలర్లను ఉతికారేశారు. బదోని 55 బంతుల్లో 8 ఫోర్లు, 19 సిక్స్‌లతో 165 పరుగులు చేయగా, ఆర్య 50 బంతుల్లో 10 ఫోర్లు, 10 సిక్స్‌ల సాయంతో 120 పరుగులు చేశాడు. ఇక వీరిద్దరి సంచలన ఇన్నింగ్స్‌ల ఫలితంగా సౌత్ ఢిల్లీ సూపర్ స్టార్జ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 308 పరుగుల భారీ స్కోరు చేసింది. ఇక ఈ మ్యాచ్‌లో భారీ స్కోరు చేసిన సౌత్ ఢిల్లీ సూపర్ స్టార్జ్ జట్టు ఓ అరుదైన ఘనతను తమ పేరిట లిచంచుకుంది. టీ20 క్రికెట్‌లో అత్యధిక స్కోర్ సాధించిన రెండో జట్టుగా సూపర్ స్టార్జ్ రికార్డుల కెక్కింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్-2024లో ఎస్ఆర్‌హెచ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరుపై 283 పరుగుల భరీ స్కోరు చేసింది. ప్రస్తుత ఢిల్లీ ప్రీమియర్ లీగ్ టోర్నీ సందర్భంగా జరిగిన ప్రస్తుత మ్యాచ్‌లో 308 పరుగులు చేసిన సౌత్ ఢిల్లీ సూపర్ స్టార్జ్ టీమ్ సన్ రైజర్స్ హైదరాబాద్ రికార్డును బ్రేక్ చేసింది.

## బంగ్లాపై పాక్ 12 పరుగుల స్వల్ప ఆధిక్యం

**ఢిల్లీ:** రావల్పిండిలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న రెడో టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో పాకిస్థాను 274 పరుగులకు కట్టడి చేసిన సంతోషం బంగ్లాకు దక్క లేదు. బంగ్లాపై (262) పాక్ 12 పరుగుల స్వల్ప ఆధిక్యతతో పాక్ కొనసాగుతోంది తొలి సెషన్‌లో పాక్ పేసర్ ఖుర్రమ్ షెహ్‌జాద్ విజృంభణకు బంగ్లా టాపార్డర్ కుప్పకూలింది. అయితే ఓ వైపు వికెట్లు పడుతున్నా లిట్టన్ దాస్ (138) మొండిగా పోరాడాడు. మెహిదీ హసన్ మిరాజ్ (78)తో కలిసి పాక్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి సూపర్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. కానీ అఘా సల్మాన్ అతడిని వెనక్కి పంపాక బంగ్లా ఇన్నింగ్స్ 262 వద్దే ముగిసింది. దాంతో ఆతిధ్య పాకిస్థాన్‌కు 12 పరుగుల ఆధిక్యం లభించింది. ఇక సిరీస్ విజేతను నిర్ణయించే రెండో టెస్టులో బౌలర్ల ఆధిపత్యం నడుస్తోంది. మూడో రోజు తొలి సెషన్‌లోనే బంగ్లాకు ఆదిలోనే షాక్ తగిలింది. పేసర్ ఖుర్రమ్ బుల్లెట్ బంతులతో వణికించి తొలి మూడు వికెట్లు పడగొట్టాడు. తొలు ఓపెనర్ జకీర్ హసన్ (1)ని బౌల్డ్ చేసిన ఖుర్రమ్, 5 పరుగుల వ్యవధిలోనే మరో ఓపెనర్ షద్మమ్ ఇస్లామ్ (10)ను దొరబుచ్చుకున్నాడు ఆ షాక్ నుండి తేరుకునే లోపే కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో (4)ను బౌల్డ్ చేసి బంగ్లాను ఒత్తిడిలోకి నెట్టాడు. మరో ఎండ్‌లో మిర్ హమ్జా సైతం చెలరేగగా 26 పరుగులకే బంగ్లా సగం వికెట్లు కోల్పోయింది. సగం మంది డగౌట్ చేరినా లిట్టన్ దాస్ అధైర్యపడ లేదు. దూకుడుగా ఆడుతూ పాక్ బౌలర్ల ఎత్తులను చిత్తు చేశాడు. మిరాజ్‌తో కలిసి బంగాన స్కోర్ బోర్డును ఉరికించాడు. అయితే ఖుర్రం డేంజరస్ మిరాజ్‌ను ఔట్ చేసి పాక్‌కు బ్రేకిచ్చాడు. దాంతో వీళ్లిద్దరి 165 పరుగుల భాగస్వామ్యానకి తెరపడింది.




## 17 పరుగులకే మంగోలియా ఆలౌట్

**ఢిల్లీ:** ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) పురుషుల టీ 20 ప్రపంచ కప్ ఆసియా క్వాలిఫైయర్‌లో రెండో అత్యంత చెత్త రికార్డు నమోదైంది. ఈ క్వాలిఫైయర్‌లో హాంకాంగ్, మంగోలియా జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన మంగోలియా జట్టు కేవలం 17 పరుగులకే ఆలౌట్ అయింది. టీ20 క్రికెట్‌లో రెండో అత్యల్ప స్కోరు ఇన్నింగ్స్‌ను ముగించిన రికార్డును నెలకొల్పింది. మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరుగుతున్న ఐసీసీ పురుషుల టీ20 ప్రంచ కప్ మ్యాచ్‌లో హాంకాంగ్, మంగోలియా జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన మంగోలియా జట్టు అత్యంత తక్కువగా కేవలం 17 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ మ్యాచ్‌లో హాంకాంగ్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. తదనుగుణంగా తొలుత బ్యాటింగ్ ప్రారంభించిన హాంకాంగ్ జట్టుకు తొలి ఓవర్ నుంచే పెవిలియన్ పరేడ్ మొదలైంది. అయితే జట్టు మొత్తం 14.2 ఓవర్లు ఆడినా 20 పరుగులు కూడా చేయ లేకపోయింది. ఈ సమయంలో మంగోలియాకు చెందిన నలుగురు ఆటగాళ్లు ఖాతా తెరవలేకపోయారు. మంగోలియా తరపున మోహన్ వివేకానంద గరిష్టంగా 5పరుగులు చేయగా, ముగ్గురు ఆటగాళ్లు 2 పరుగులు, మరో ముగ్గురు బ్యాటర్లు 1 పరుగు చొప్పున స్కోరు చేశారు. మంగోలియా జట్టును ఇంత తక్కువ స్కోరుకు ఆలౌట్ చేయడంలో హాంకాంగ్ టీమ్ పేసర్ల సహకారం ముఖ్యం. జట్టు తరపున ఎహ్సాన్ ఖాన్ 3 ఓవర్లు వేసి 4 వికెట్లు తీయగా, యాసిమ్ ముర్తజా, అనాస్ ఖాన్ చెరో 2 వికెట్లు, ఆయుష్ శుక్లా, అతిక్ ఇక్బాల్ చెరో వికెట్ తీశారు. అలాగే హాంకాంగ్ తరపున ఆయుష్ శుక్లా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఈ మ్యాచ్‌లో ఆయుష్ 4 ఓవర్లు వేయడమే కాకుండా ఒక వికెట్ కూడా పడగొట్టాడు. ఇక మంగోలియా 17 పరుగుల అత్యంత స్వల్ప స్కోరును ఛేదించిన హాంకాంగ్ జట్టు 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 18 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా 1.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి ఛేదించింది. ఇక టీ20 క్రికెట్‌లో రెండో అత్యల్ప స్కోరు ఇన్నింగ్స్‌తో మంగోలియా జట్టు చెత్త రికార్డును నెలకొల్పింది. నిజానికి మంగోలియా పేరుతో మరో అత్యల్ప మొత్తం రికార్డు కూడా ఉండడం గమనార్హం. ఈ ఏడాది మే 18వ తేదీన జపాన్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ మంగోలియన్ జట్టు కేవలం 12 పరుగులకే ఆలౌట్ కావడం ద్వారా ఈ అవాంఛనీయ రికార్డు సృష్టించింది.

## వాణిజ్యం

# టాటా ఈవీలకు చైనా బూస్ట్!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:** ప్రముఖ కంపెనీ టాటా మోటార్స్ నుంచి విడుదలయ్యే వాహనాలకు దేశంలో ఎంతో ఆదరణ ఉంది. లేటెస్ట్ టెక్నాలజీ, అత్యుత్తమ ఫీచర్లతో విడుదలయ్యే ఈ కంపెనీ కార్ల కోసం విని యోగదారులు ఎదురు చూస్తుంటారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎలక్ట్రిక్ వాహనాల విభాగం లోకి ప్రవేశించి అనేక వాహనాలను విడుదల చేసింది. అయితే కొత్తగా ఈవీల బ్యాటరీ పనితీరును మెరుగు పర్చడానికి చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా చైనాకు చెందిన బ్యాటరీ సరఫరా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. టాటా మోటార్స్ తీసుకున్న ఈ



నిర్ణయం వెనుక అనేక వ్యూహాత్మక కారణాలున్నాయి. ప్రస్తుతం ఈవీల మార్కెట్‌లో విపరీతమైన పోటీ నెలకొంది. పోటీని తట్టుకునేందుకు కంపెనీ అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా టాటా ఈవీల అమ్మకాలు కూడా తగ్గిపోవడం దీనికి వెనుక ప్రధాన కారణం. ఆక్టిలియన్ పవర్ సిస్టమ్స్ అనేది చైనాలోని బ్యాటరీ ప్యాక్ తయారీ సంస్థ. దీని నుంచి తన ఈవీలకు బ్యాటరీలు కొనుగోలు చేయాలని టాటా మోటార్స్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకూ తన గ్రూప్ కంపెనీ అయిన టాటా ఆటోకాంప్ సిస్టమ్స్ లిమిటెడ్ నుంచి బ్యాటరీ ప్యాక్‌లను కొనుగోలు చేసేది. ఇప్పుడు ఆ నిర్ణయం మార్చుకుని చైనా సంస్థతో కలిసింది. టాటా కంపెనీకి చెందిన తాజా కర్వ్ కూపే ఎస్ యువిలో ఆక్టిలియన్ సంస్థ తయారు చేసిన లిథియం అయాన్ బ్యాటరీ ప్యాక్‌లు ఉన్నాయి. ఆ సంస్థకు కాలిఫోర్నియాలో ప్రధాన కార్యాలయం ఉంది. అలాగే అమెరికాతో పాటు మన దేశంలో పనిచేస్తోంది. ఎల క్ట్రిక్ వాహనాల మార్కెట్‌లో సవాళ్లను ఎదుర్కొనేం దుకు, ఇతర కంపెనీల నుంచి వస్తున్న పోటీని తట్టు కునేందుకు టాటామోటార్స్ తాజా నిర్ణయం తీసుకుం ది. అలాగే ఈ కంపెనీకి చెందిన మునుపటి మోడళ్ల లో బ్యాటరీఛార్జింగ్ తగ్గుదల వంటి సమస్యలు వచ్చా యి. వాటినిపరిష్కరించడంలో భాగంగా చైనా బ్యాటరీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. కొత్త బ్యాటరీ ప్యాక్ డిజైన్లు, విభిన్న సెల్ రకాలను చేర్చ డం ద్వారా టాటా మోటార్స్ తన ఈవీల కు ప్రజల విశ్వసనీయతను మరింత పెంచడానికి ప్రయత్నిస్తోంది. ఈ కంపెనీ అనేక కొత్త ఈవీ మోడళ్ల ను పరిచయం చేయనున్నం దున, వాటి సాంకేతిక సామర్థ్యాలను మెరుగుపర్చ డానికి ఆక్టిలియన్ సంస్థతో కలిసిముందుకు సాగనుంది. చైనాకు చెందిన ఆక్టిలియన్ సంస్థ గతేడాది మన దేశం లోని పుణెలో2జిడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్ ఉత్పత్తిని ప్రారంభించింది. ఈ సంస్థ అందించిన బ్యాటరీ ప్యాక్‌లను టాటా కర్వ్ ఈవీ 45కెడబ్ల్యూ హెచ్ వేరియంట్‌లో వినియోగిం చారు. అలాగే మరో చైనీస్ కంపెనీ ఈవీఈ అందించిన 15.2ఎహెచ్ సిలిండ్రికల్ సెల్స్‌ను కూడా వాడారు. టాటా కర్వ్ ఈవీ 55కెడబ్ల్యూహెచ్ వేరి యంట్‌లో టాటా ఆటోకాంప్ నుంచి విడుదలైన బ్యాటరీ ప్యాక్‌ల ను ఉప యోగించడం కొనసాగుతుంది. వీటిలోచైనీస్ లిథియం -అయాన్ సెల్ ప్రొవైడర్ అయిన గోషన్ నుంచి విడు దలైన 105ఎహెచ్ ప్రిస్మాటిక్ సెల్స్ ఉన్నాయి. ఇప్పటి వరకు టాటామోటార్స్ తన ప్యాసింజర్ ఈవీ బ్యాటరీ ప్యాక్‌లను టాటా ఆటో కాంప్ సిస్టమ్స్ జాయింట్ వెంచర్‌ద్వారా గోషన్ నుంచి సెల్ లను ఉపయోగించి తయారుచేసింది. టాటామోటార్స్ తన స్టార్‌బస్ ఈవీకోసం ఆక్టిలియన్ బ్యాటరీ ప్యాక్‌ల ను రెండేళ్లుగా ఉపయోగిస్తున్నప్పటికీ, ప్రయాణీకుల ఈవీలోఉపయో గించడం ఇదే మొద టిసారి.

## గోల్డ్‌మన్ శాక్స్‌లో ఉద్యోగుల తొలగింపులు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:** ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాం కింగ్ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సిబ్బంది వార్షిక పని తీరు సమీక్ష ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మొత్తం ఉద్యోగుల్లో 3నుంచి 4శాతం మందిపై ఈ ప్రభావం పడనుంది. రానున్న కొన్ని వారాల్లో ఈ తొలగింపులను చేపట్టనుందని కంపెనీ వర్గాలు వెల్లడించినట్లు కొన్ని కథనాలు వెలువడుతున్నాయి. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై లేఆఫ్‌ల ప్రభావం పడ నుంది. ఏకంగా 1300 మందికి పైగా ఉద్యోగులను తొలగించే యోచనలో ఉంది. ముఖ్యంగా నాసిరకం ప్రదర్శన చేసిన ఉద్యోగులపై తొలుత వేటు పడనుంది. గోల్డ్‌మన్ శాక్స్‌లో తొలగింపుల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని ఓ వైపు మార్కె ట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ విషయంపై సంస్థ ఏ ప్రకటనా జారీచేయలేదు. మహమ్మారి సమయంలో గోల్డ్‌మన్ శాక్స్ నాసిరకం పనితీరును కారణంగా చూపి పెద్దఎత్తున ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. తాజాగా రెండేళ్ల తర్వాత మరోసారి ఇదే కారణంతో లేఆఫ్‌లను ప్రకటించినట్లు తెలుస్తోంది. కాగా ఈ యేడాది జూన్ 30 నాటికి సంస్థలో 44,300 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. మరోవైపు బ్యాంకు స్టాక్ ఆల్‌టైమ్ గరిష్టానికి చేరింది. అమెరికాలోని బ్యాంకుల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచింది. మొన్నటివరకు మాంద్యం భయాలతో పెద్దసంఖ్యలో ఉద్యో గులను తొలగించిన సంస్థలు తాజాగా ఏఐ సాంకేతికతను అంది పుచ్చుకొనే క్రమంలో లేఆఫ్‌లు ప్రకటిస్తున్నా యి. ఇప్పటికే కంప్యూ టర్ల తయారీ సంస్థ డెల్, ప్రముఖ నెట్ వర్కింగ్ సంస్థ సిస్కో కూడా ఇదే బాటపట్టాయి.




## గ్రే మార్కెట్లో ఐపిఒల హవా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:** దేశీయ స్టాక్ మార్కెట్లలో ఐపిఒల రద్దీ భారీగా పెరి గిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రధానంగా ఎస్ఎంఇ కేటగిరీ ఎంట్రీలపై జాగ్రత్తగా ఉండాలని ఈ వారం మార్కె ట్ రెగ్యులేటరీ సంస్థ సెబి పెట్టుబడి దారులను హెచ్చరించిన విషయం విది తమే. అయినప్పటికీ, ఇన్వెస్టర్లలో జోరు ఏ మాత్రం తగ్గటం లేదు. ఇసిఒఎస్ మొబిలిటీ అండ్ హాస్పిటాలిటీ కంపెనీ ఐపిఒ ప్రస్తుతం సబ్‌స్క్రిప్షన్ గడువు ముగిసింది. ఈ క్రమంలో ఐపిఒ పెట్టు బడిదారుల నుంచి గడచిన మూడు రోజులు విశేష స్పందనను పొం దింది. బిడ్డింగ్ చివరి రోజున భారీగా 64.18 రెట్లు సబ్ స్క్రిప్షన్‌ను అందు కుంది. వాస్తవానికి కంపెనీ 1,80,00,000 షేర్లను ఐపిఒలో విక్రయానికి ఉంచగా, దరఖాస్తు దారులు 80,86,90,256 షేర్ల కోసం బిడ్డింగ్ వేసినట్లు ఎన్ఎస్ఇ డేటా ప్రకారం వెల్లడైంది. పైగా ఐపిఒలో పూర్తిగా షేర్లు ఆఫర్ ఫర్ సేల్ కింద విక్రయించ బడుతున్నాయి. ఐపిఒకి పెట్టుబడ దారుల నుంచి వచ్చిన భారీ స్పందన తో అర్హత కలిగిన సంస్థాగత ఇన్వెస్టర్ల భాగం 136.85 రెట్లు, సంస్థాగతేతర పెట్టుబడి దారుల కోసం 71.17 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 19.66 రెట్లు సబ్‌స్క్రిప్షన్‌ను పొందిం ది. ఐపిఒ తెరుచుకున్న తొలిరోజునే పూర్తిగా సబ్‌స్క్రైబ్ చేయబడింది. పెట్టుబడిదారుల కోసం ఐపిఒ తన ప్రైస్ బ్యాండ్ ధరను ఒక్కో షేరుకు రూ.318-334గా ఉంచిన విషయం విదితమే. అయితే ప్రస్తుతం గ్రే మార్కెట్లో కంపెనీ ఐపిఒ ఒక్కో షేరు రూ.152 ప్రీమియం పలుకుతున్నాయి. ఇదే ధర లిస్టింగ్ రోజు వరకు కొనసాగినట్లయితే స్టాక్ రూ.486 రేటు వద్ద మార్కెట్లో లిస్టింగ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని




నిపుణులు చెబుతున్నారు. మెయిన్ కేటగిరీలో వస్తున్న ఐపిఒ ఎన్ఎస్ఇ,బిఎస్ఇలో జాబితా కానుంది. కంపెనీ వ్యాపారాన్ని పరిశీలిస్తే దేశంలోని ఫార్చ్యూన్ 500 కంపెనీలతో సహా కార్పొరేట్ క్లయింట్‌లకు ఉద్యోగుల రవాణా సేవలు, డ్రైవర్ కార్ రెంటల్ వ్యాపారంలో ఉంది. సెల్ఫ్ డ్రైవింగ్ కోసం ఢిల్లీ, గురుగావ్, ముంబై, బెంగళూరు నగరాల్లో కంపెనీ వాహనాలను అందిస్తోం ది. లగ్జరీకోచ్‌లు, మినీవ్యాన్‌లు,ఎకానమీ ఆటోమొబైల్స్ తో సహా 12వేల వాహనాలను నిర్వహి స్తోంది.

## బ్యాంకింగ్ రంగంలో లిక్విడిటీ సమస్య

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:** భారత్ బ్యాంకింగ్ రంగం లిక్విడిటీ సమస్య ను ఎదుర్కొంటోంది. బ్యాంకుల్లో డిపాజిట్లు తగ్గడం ఇందుకు కారణం. తాజాగా ప్రభుత్వ రంగ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూపొందించిన నివేదిక ప్రకా రం, ఈ నెలలో అంటే ఆగస్టు 28 నాటికి బ్యాంకింగ్ లిక్విడిటీ రూ.0.95 లక్షల కోట్లకు తగ్గింది. ఆగస్టు నెల ప్రారంభంలో 2వ తేదీన బ్యాంకింగ్ లిక్విడిటీ గరిష్ట స్థాయి రూ.2,86 లక్షల కోట్లుగా నమోద య్యాయి. ఆ తర్వాత ఆగస్టు 16న రూ.1.55 లక్షల కోట్లకు తగ్గగా, కాగా ఇది మరింత దిగొచ్చింది. పరిస్థితిని గమనించిన భారతీయ రిజర్వ్ బ్యాంకు, ఆర్థిక మంత్రిత్వ శాఖ బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని బ్యాంకులకు సూచించాయి. అయినప్పటికీ, లిక్విడిటీ కొరత కొనసాగుతోంది. బ్యాంకింగ్ లిక్విడిటీ నిరంతరం క్షీణించడం వల్ల ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావంఉంటుందనే ఆందో ళనలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో కంటే ఇటీ వల చాలామంది బ్యాంకుల్లో డిపాజిట్ చేయడం కంటే మ్యూచువల్ ఫండ్స్, స్టాక్ మార్కెట్లు, ఇతర పెట్టుబడి సాధనాలపై ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నా రు. దానివల్ల బ్యాంకుల్లో డిపాజిట్లు తగ్గు తున్నాయి. దీనిపై బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఈ నెల ప్రారంభం లోనూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకులు రుణాలతో పాటు డిపాజిట్లు పెరిగే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.




## యూకో బ్యాంకుకు ఆర్‌బిఐ జరిమానా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 1:** బ్యాంకింగ్ రంగ నియంత్రణ సంస్థ రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రభుత్వ రంగ బ్యాంకు యూకో బ్యాంకుపై పెద్ద చర్య తీసుకుంది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ 1949, దాని సూచనలను పాటించనందున ఆర్‌బిఐ యుసిఒ బ్యాంకుపై రూ.2,68,30,000 జరిమానా విధించింది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రకటన విడుదల చేసింది. ఆగస్టు 26, 2024న జారీ చేసిన ఆర్డర్ ప్రకారం, యూకో బ్యాంకుపై రూ.2,68,30,000 జరిమానా విధించినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంకు తెలిపింది. ఆర్‌బిఐ తెలిపిన వివరాల ప్రకారం, యూకో బ్యాంకు బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ 1949 సెక్షన్ 26ఎ నిబంధనలను ఉల్లం ఘించినందుకు అడ్వాన్స్‌లపై వడ్డీరేట్లు, బ్యాంకు కరెంట్ ఖాతాలలో క్రమశిక్షణ, డిపాజిట్లపై వడ్డీరేట్లు, మోసం, వాణిజ్య బ్యాంకుల రిపోర్టింగ్, తదితర కార ణాల వల్ల ఈ జరిమానా విధించింది. ఆర్థిక సంస్థలు డిపార్ట్‌మెంట్ జారీచేసిన సూచనలను పాటించనందు న ఈ చర్య తీసుకుంది. యూకో బ్యాంకుకు ఇచ్చిన అధికారాల ప్రకారం ఈజరిమానా విధించినట్లు ఆర్‌బిఐ తెలిపింది. బ్యాంకు పర్యవేక్షక విచారణ అనంతరం దానికి నోటీసు కూడా జారీచేసినట్లు ఆర్‌బిఐ తెలిపింది. దీనిపై గరిష్ట జరిమానా ఎందుకు విధించకూడదని బ్యాంకుకు పంపిన నోటీసులో ప్రశ్నించింది. నోటీసుకు బ్యాంకు ప్రతిస్పందన తర్వాత, పెనాల్టీ వేసింది. ఆ తర్వాత యూకో బ్యాంకుపై ద్రవ్య పెనాల్టీ విధించింది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14